సత్యం, సమర్థత, విశ్వసనీయత
WWW.SAKSHYAM.COM

# సాక్ష్యం

తెలుగు దినపత్రిక

సంపుటి: 17 | సంచిక: 150
పేజీలు: 08 | వెల: రూ.2:00

హైదరాబాద్ | గురువారం 28 మే 2026

Published from Hyderabad, Vijayawada.

## ఓటరు జాబితా సవరణకు సుప్రీం గ్రీన్ సిగ్నల్!



- ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ చట్టబద్ధం
- నిబంధనల ప్రకారమే ఈసీ చర్యలని స్పష్టీకరణ

న్యూఢిల్లీ,మే27(సాక్ష్యం): ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ చట్టబద్ధమేనని సుప్రీంకోర్టు బుధవారం సంచలన తీర్పునిచ్చింది. సాధారణ సవరణ విధానానికి భిన్నంగా ఉందనే ఒకే ఒక్క కారణంతో ఈ ప్రత్యేక ప్రక్రియను మిగతా 5 లో..



## ప్రధాని మోడీతో తమిళనాడు సీఎం విజయ్ భేటీ

**రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి ప్రధానికి సీఎం వినతి**
**పలు అంశాలపై ప్రకటన విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం**

న్యూఢిల్లీ,మే27(సాక్ష్యం): తమిళనాడు ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ ఢిల్లీలో తొలిసారి జరుపుతున్న అధికారిక పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి మిగతా 2 లో..



## కొనసాగుతున్న సరస్వతీ పుష్కరాలు

**వివిధ ప్రాంతాల నుంచి తరలివస్తున్న భక్తులు**

కాళేశ్వరం,మే27(సాక్ష్యం): కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి అంత్య పుష్కరాలకు భక్తులు పోటెత్తుతున్నారు. పుష్కం ఘాట్‌ల వద్ద తెల్లవారు జాము నుంచే భక్తులు భారీ సంఖ్యలో చేరుకుని పవిత్ర స్నానాలు మిగతా 2 లో..



## పోలీస్ కస్టడీకి బండి భగీరథ్

**ముగిసిన తొలిరోజు విచారణ**
**సీన్ రీ కన్‌స్ట్రక్షన్ కోసం మొయినాబాద్‌కు తరలింపు**
**కోర్టు అనుమతితో 3 రోజులపాటు విచారణ**

హైదరాబాద్,మే27(సాక్ష్యం): పోక్సో కేసులో కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు ప్రస్తుతం మిగతా 2 లో..

## కర్నాటకలో మారుతున్న సమీకరణాలు

**సిద్ధరామయ్యను తప్పుకోవాలని అధిష్టానం సూచన**
**నేడు గవర్నర్ అపాయింట్‌మెంట్ కోరినట్లు సమాచారం**
**30న డీకే శివకుమార్ ప్రమాణం చేస్తారన్న ప్రచారం**
**సిద్ధరామయ్యను రాజ్యసభకు పంపాలని అధిష్టానం నిర్ణయం**




న్యూఢిల్లీ,మే27(సాక్ష్యం): కర్నాటకం క్లైమాక్స్‌కు చేరినట్లు తెలుస్తోంది. కర్ణాటకలో నాయకత్వ మార్పుపై కాంగ్రెస్ అధిష్ఠానం చురుగ్గా పావులు కదుపుతోంది. మే 30వ తేదీ శనివారంనాడు కొత్త ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారం చేసే అవకాశాలున్నాయని పార్టీ వర్గాల తాజా సమాచారం. కొత్త మంత్రివర్గంలో ముగ్గురు ఉపముఖ్యమంత్రులకు చోటు కల్పిస్తారని తెలుస్తోంది. వీరిలో షెడ్యూల్డ్ కులాలకు చెందిన ఒకరు, ఓబీసీ వర్గానికి చెందిన మరొకరితో పాటు ఒక మహిళ ఉంటారు. కర్ణాటకలో నాయకత్వ మార్పునకు మార్గం సుగమం చేయాలని, జాతీయ స్థాయిలో కీలకమైన మిగతా 2 లో..

# ఎత్తు పెంచాల్సిందే

- తుమ్మిడిహట్టిపై చర్చించేందుకు సిద్ధం
- చర్చకు మహారాష్ట్ర సమయం ఇవ్వాలి
- గతంలో 148 మీటర్ల ఎఫ్ఆర్ఎల్‌కు సమ్మతి
- వాటితో తెలంగాణ నీటి అవసరాలు తీరవు
- ఎఫ్ఆర్ఎల్ పెరిగితే గ్రావిటీ ద్వారా నీళ్ళు
- మహారాష్ట్రలో ముంపు ప్రభావం ఉండదు
- తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి
- మహారాష్ట్ర సీఎంకు రేవంత్‌రెడ్డి లేఖ



హైదరాబాద్,మే27(సాక్ష్యం): తుమ్మిడిహెట్టి బ్యారేజ్ ఎత్తు, నిర్మాణంపై మహారాష్ట్రతో చర్చించేందుకు తెలంగాణ ప్రభుత్వం అడుగు ముందుకేసింది. ఈ మేరకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు లేఖ రాశారు. తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి బృందంతో సమావేశానికి సమయమివ్వాలని, అనుకూలమైన తేదీని త్వరగా ఖరారు చేయాలని రేవంత్ కోరారు. తుమ్మిడిహట్టి ఎత్తుపై మహారాష్ట్రతో చర్చించాల్సిన అవసరం ఉందన్న సీఎం రేవంత్ రెడ్డి గతంలో 148 మీటర్ల ఎఫ్ఆర్ఎల్‌కు మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందని గుర్తు చేశారు. మిగతా 2 లో..

## రెవెన్యూ శాఖలో పలువురు బదిలీ

**పలు జిల్లాల్లో తహసిల్దార్లను బదిలీ చేస్తూ ఆదేశాలు**

హైదరాబాద్,మే27(సాక్ష్యం): తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖలో ప్రభుత్వం పలువురు అధికారులను బదిలీ చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో పనిచేస్తున్న 12 మంది తహశీల్దార్లను బదిలీ చేస్తూ రెవెన్యూ శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీ అయిన అధికారులకు తక్షణమే అమల్లోకి వచ్చేలా డిస్ట్రిక్ట్ రెవెన్యూ ఆఫీసర్లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు గా కొత్త పోస్టింగులను కేటాయించారు. ఈ బదిలీలకు మిగతా 5 లో..

## సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అదనపు పని వేళలు

**రద్దీని తట్టుకునేందుకు ప్రభుత్వం చర్యలు**

హైదరాబాద్,మే27(సాక్ష్యం): రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. మే 29 నుంచి జూన్ 3 వరకు అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అదనపు పని వేళలు అమలు చేయనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఉదయం 9:30 గంటల నుంచి రాత్రి 7:30 గంటల వరకు రిజిస్ట్రేషన్ సేవలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. ప్రజలకు మిగతా 5 లో..

## గ్రామీణ ప్రాంతాలకు హై-స్పీడ్ బ్రాడ్ బ్యాండ్ కనెక్టివిటీ

- అమెండెడ్ భారత్‌నెట్ ప్రోగ్రామ్ అమలు చేయండి
- ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వెల్లడి
- కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియాకు వినతి



హైదరాబాద్,మే27(సాక్ష్యం): తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాలకు నిరంతరం హై-స్పీడ్ బ్రాడ్ బ్యాండ్ కనెక్టివిటీని అందించే లక్ష్యంగా అమెండెడ్ భారత్‌నెట్ ప్రోగ్రామ్ సజావుగా అమలు చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొన్ని కీలక అంశాలను కేంద్ర సమాచార శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రోగ్రామ్‌కు సంబంధించి సాధ్యమైనంత తొందరగా ఒప్పందాన్ని కుదుర్చుకోవడం, పెండింగ్‌లో ఉన్న నిధులను సత్వరం విడుదల చేయడంపై వంటి అంశాలను ముఖ్యమంత్రి చర్చించారు. అమెండెడ్ భారత్‌నెట్ ప్రోగ్రామ్ కింద తెలంగాణలో టీ-ఫైబర్ ప్రాజెక్టు అమలుపై ముఖ్యమంత్రి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో కేంద్ర మంత్రి మిగతా 2 లో..

# కల్లాల్లో కల్లోలం

అకాల వర్షంతో చల్లబడ్డ వాతావరణం
పలు జిల్లాల్లో ఉరుములు, ఈదురుగాలుల వర్షం
కల్లాల్లో తడిసిన ధాన్యంతో రైతుల ఆందోళన
తక్షణమే ధాన్యం కొనుగోళ్లు చేయాలని డిమాండ్



హైదరాబాద్,మే27(సాక్ష్యం): భానుడి భగభగలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న రాష్ట్ర ప్రజలకు భారీ వర్షంఎండల నుంచి ఉపశమనం కలిగించినా, అన్నదాతలక మాత్రం కన్నీరు మిగిల్చింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి తెలంగాణలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. అకాల వర్షాలకు పలు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. పలుచోట్ల చెట్లు విరిగిపోయాయి రవాణాకు అంతరాయం ఏర్పడింది. సంగారెడ్డిలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. కామారెడ్డి జిల్లాలో వర్షాలకు కల్లాల్లోని ధాన్యం కొట్టుకుపోయింది. సిద్దిపేట జిల్లా ముత్యాల్లో అత్యధికంగా 12.3 సెం.మీ. వర్షపాతం నమోదయింది. మహబూబానగర్ జిల్లా భూత్పూర్ మండలంలో 11 సెం.మీ., నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేటలో 8.4 సెం.మీ., నల్లగొండ జిల్లా గుండ్లపల్లిలో 6.2 సెం.మీ. వర్షం కురిసింది. సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. పిడుగులు పడే అవకాశం ఉండటంతో మిగతా 5 లో..

## పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ

**అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశం**
**పలు జిల్లాలకు వాతావరణ శాఖ హెచ్చరికలు**
**ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వెల్లడి**
**ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలన్న రేవంత్**

హైదరాబాద్,మే27(సాక్ష్యం): తెలంగాణలో పలు జిల్లాలకు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. మోస్తరు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. ఆ సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు మిగతా 5 లో..

## కల్లాల వద్ద దైన్యంగా రైతులు

**పంటల కొనుగోలు లేక దీనావస్థ**
**వారిని వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలి**
**బిఆర్ఎస్ శ్రేణులు రైతులకు అండగా నిలవాలి**
**పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు**

హైదరాబాద్,మే27(సాక్ష్యం): రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న అకాల వర్షాలు, ఈదురు గాలుల కారణంగా అనేక వ్యవసాయ మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన వరి, మొక్కజొన్న తదితర పంటలు తీవ్రంగా దెబ్బతినడం అత్యంత బాధాకరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తారక రామారావు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, రైతాంగానికి అండగా ఉండాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ ఆపత్కాలంలో రైతన్నలకు భరోసా ఇవ్వాలని పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు.

## మాజీ సీఎం విజయన్ ఇంటివద్ద ఉద్రిక్తత

- ఈడీ అధికారుల కారుపై రాళ్లదాడి
- దాడిలో ధ్వంసం అయిన కారు అద్దాలు
- అధికారులకు తృటిలో తప్పిన ప్రమాదం



తివనంతపురం,మే27(సాక్ష్యం): కేరళ మాజీ సీఎం పినరయి విజయన్ ఇంటి వద్ద ఉద్రిక్తత నెలకొంది. మనీలాండరింగ్ కేసు విచారణలో భాగంగా ఆయన నివాసంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు సోదాలు చేపట్టారు. వీటిని తీవ్రంగా వ్యతిరేకించిన పినరయి మద్దతుదారులు.. ఇంటి వద్ద ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో ఈడీ అధికారులపై దాడికి పాల్పడ్డారు. వారి కారు అద్దాలు ధ్వంసం చేశారు. పోలీసులు, కేంద్ర బలగాలు నిలువరించే మిగతా 2 లో..

# త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమం

- ఇప్పటికే సుమారు లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తి
- జీహెచ్‌ఎంసీ పరిధిలో 18వేల ఇళ్లు మంజూరు
- మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి
- కేటీఆర్ సవాల్‌పైనా మరోమారు ఘాటు విమర్శలు



హైదరాబాద్,మే27(సాక్ష్యం): రాష్ట్రవ్యాప్తంగా త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమం చేపడతామని తెలంగాణ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే సుమారు లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తయిందని చెప్పారు. జూన్ చివరి నాటికి మరో లక్ష పూర్తవుతాయన్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో 18వేల ఇళ్లు మంజూరు చేశామని మంత్రి వివరించారు. సచివాలయంలో సహచర మంత్రులు మిగతా 5 లో..

సాక్ష్యం



# సంపాదకీయం

## అక్రమ వలసలపై ఉక్కుపాదం మోపాల్సిందే !

దేశంలోకి నానాటికీ పెరుగుతున్న అక్రమ వలసలతో దేశ ఆర్థిక వ్యవస్థకు సావాల్‌గా మారింది. అలాగే దేశంలో అలజడులకు కారణమవుతోంది. పెరుగుతున్న జనాభాకు తోడు అక్రమంగా దేశంలోకి ప్రవేశిస్తున్న వారి కారణంగా పలు రాష్ట్రాలు తీవ్ర ఇక్కట్ల పాలవుతున్నాయి. దేశంలో అస్థిరతకు కారణం అవుతున్నారు. ఓటర్లుగా ఉన్న విదేశీయులను మొన్నటి ఎన్నికలకు ముందు సర్ ప్రక్రియలో లక్షల్లో తొలగించారు. దీనిపై నాటి సిఎం మమతా బెనర్జీ నానాయాగీ చేశారు. అసలు ఎంతమంది ఉన్నారన్నదానికి లెక్కాపత్రం లేనంతగా ఇక్కడ అక్రమ వలసదారులు చేరిపోయారు. అమెరికాలో ట్రంప్ వచ్చాక నిర్దాక్షిణ్యంగా అక్రమ వలసదారులను తన్‌ఇన తరిమేశారు. ప్రపంచ దేశాలు నిరసనలు వ్యక్తం చేసినా ట్రంప్ పట్టించుకోలేదు. ఇది ఓ హెచ్చరికగా అన చర్యలు నిలిచాయి. ఇప్పుడు భారత్ కూడా అలాంటి చర్యలను కఠినంగానే తీసుకోక తప్పదు. ఈ క్రమంలో బెంగాల్లో అక్రమవలసదారులపై ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. ఇకపోతే అక్రమ వలసతకు చెక్ పెట్టడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. అక్రమ వలసలు, చొరబాట్లు, ఇతర అసాధారణ కారణాలతో దేశంలో జరుగుతున్న అసహజ జనాభా మార్పులపై అధ్యయనానికి ఒక ఉన్నత స్థాయి కమిటీ ని ఏర్పాటు చేసినట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. ఈ సమస్య భారతదేశ సార్వభౌమత్వా నికి, జాతీయ భద్రతకు, సామాజిక సమతుల్యతకు, గిరిజన సమాజాల పరిరక్షణకు పెనుసవాలుగా మారడం తో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ కమిటీ ఏర్పాటుకు సంబంధించి గత ఏడాది స్వాతంత్య దినోత్సవం నాడు ప్రధాని మోదీ వాగ్దానం చేశారని గుర్తుచేశారు. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ప్రకాశ్ ప్రభాకర్ నవోలేకర్ అధ్యక్షత వహించే కమిటీలో మాజీ ఐఏఎస్ అధికారి దుర్గా శంకర్ మిశ్రా, మాజీ ఐపీఎస్ అధికారి బాలాజీ శ్రీవాస్తవ, ఆర్థికవేత్త డాక్టర్ షమికా రవి, జనగణన కమిషనర్ సభ్యులుగా ఉంటారని, హోంశాఖ సంయుక్త కార్యదర్శి సభ్య కార్యదర్శిగా వ్యవహరిస్తారని 'ఎక్స్'లో చేసిన పోస్టులో షా పేర్కొన్నారు. అక్రమ వలసలు, సరిహద్దుల్లో చొరబాట్లు, ఇతర అసాధారణ కారణాలతో దేశవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న మార్పులతో పాటు మత, సామాజికవర్గాల వారీగా అసాధారణ జనాభా మార్పుల సరళిని ఈ కమిటీ సమగ్రంగా విశ్లేషిస్తుందని తెలిపారు. ఈ సమస్యలకు అర్థవంతమైన, విధానపరమైన, కాలపరిమితితో కూడిన పరిష్కారాలను ప్రభుత్వానికి సిఫారసు చేస్తుందని అమిత్ షా తెలిపారు. ఇదిలా వుంటే బెంగాల్లో అక్రంగా తిష్టవేసిన వారు ప్రభుత్వాలను శాసించే స్థాయికి చేరారు. మమతా బెనర్జీ హయాంలో బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా చొరబడ్డవారు ఆధార్ కార్డులు, ఓటరు కార్డులు పొంది, స్థానికులనే సవాల్ చేసే స్థాయికి చేరారు. ఈ క్రమంలో కొత్తగా అధికారం చేపట్టిన సువేందు అధికారి నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం అక్రమ వసలదారులను తరిమేసే పనులు చేపట్టింది. కొంచెం కఠినంగానే హెచ్చరించింది. తన్ని తరిమేసే వరకు ఆగకుండా పారిపోవాలని హెచ్చరించింది. ఈ క్రమంలో సరిహద్దులకు బంగ్లా అక్రమచొరబాటుదార్లు చేరుకుంటున్న దృశ్యాలు చూస్తున్నాం. దీనిని బట్టి ఎంతగా ఇక్కడ తిష్టవేశారో అర్థం చేసుకోవచ్చు. ఇదంతా జరుగుతున్న క్రమంలోనే బెంగాల్లో కొత్త ప్రభుత్వం కఠిన చర్యలు ఇప్పుడు అక్కడ అక్రమవసలదారుల గుండెల్లో దడపుట్టిస్తోంది. తమ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకొనేలోపే రాష్ట్రం విడిచి పారిపోవాలని చొరబాటుదారులను సీఎం సువేందు అధికారి తీవ్రంగా హెచ్చరించారు. భారత్ నుంచి తమ పౌరులను తిరిగి స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నట్లు బంగ్లాదేశ్ ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిందని, వారిని తీసుకెళ్లడం ఆ దేశ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. చొరబాటుదారులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని జైలుకు పంపవద్దని కూడా పోలీసులను ఆదేశించారు. అసలు మనం వారికి ఆశ్రయం ఎందుకివ్వాలి? వారికోసం మన దేశ వనరులను ఎందుకు వృథా చేసుకోవాలి? ఈ చొరబాటుదారులేమైనా మన అల్లుళ్లా?' అని సువేందు ప్రశ్నించారు. గుర్తించండి, తొలగించండి, బహిష్కరించండి నినాదంతో రాష్ట్రంలో అక్రమంగా నివసిస్తున్న విదేశీ పౌరులను వెనక్కి పంపడానికి బెంగాల్ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.బంగ్లాదేశ్ అక్రమ వలసదారులపై విదేశీయుల చట్టం కిందే ఈ చర్యలు తీసుకుంటామని చెప్పారు. తక్షణం అక్రమవలసదారులు ఈ ప్రదేశాన్ని వదిలివెళ్లాల్సిందేనని అన్నారు. తమ పౌరులను వెనక్కి తీసుకునే బాధ్యత బంగ్లాదేశ్ ప్రభుత్వంపైనే ఉందన్నారు. కాగా, అక్రమ వలసదారులను వెనక్కి పంపించేందుకు బెంగాల్ ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేయడంతో బంగ్లాదేశీయులు స్వదేశానికి తిరుగుముఖం పడుతున్నారు. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని హకింపూర్ సరిహద్దు వద్ద మంగళవారం ఉదయం పెద్ద ఎత్తున వారు గుమిగూడారు. రాష్ట్రంలో ఎస్ఐఆర్ సమయంలోనూ ఇలాంటి ఘటనలు అనేకం చోటు చేసుకున్నాయి. ఈ క్రమంలో అక్రమ వలసదారులపై పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. రాష్ట్రంలోకి అక్రమంగా చొరబడి.. చట్ట విరుద్ధంగా ఉంటున్న బంగ్లాదేశీయులు, రోహింగ్యాల ను తక్షణమే నిర్బంధ కేంద్రాలకు తరలించాలని ఆదేశించింది. ఆయా జిల్లాల్లో నిర్బంధ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించింది. ఈ మేరకు రాష్ట్ర హోం శాఖ అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకు పట్టుబడిన విదేశీయులు, దేశ బహిష్కరణకు గురైన వారు, జైలు నుంచి విడుదలై.. తమ తమ దేశాలకు వెళ్లేందుకు ఎదురు చూస్తున్న విదేశీ ఖైదీలను తక్షణమే నిర్బంధ కేంద్రాలకు తరలించాలని ఆదేశించింది. ఈ మేరకు అన్ని జిల్లాల కలెక్టర్లకు రాష్ట్ర హోం శాఖ లేఖలు రాసింది. మొత్తంగా బెంగాల్లో ఏరివేత కారణంగా బీహార్, అసోం తదితర రాష్ట్రాల్లో వారు షెల్టర్ పొందకుండా చూడాలి. అక్కడి ప్రభుత్వాలు కూడా కఠినంగా వ్యవహరించాలి. అలాగే హైదరాబాద్‌లో తిష్టవేసిన రోహిగ్యాలను కూడా పట్టుకని పంపించాలి.

## అనంతుని ఆభరణాలు మాయం

తిరువనంతపురం,మే27(సాక్ష్యం): ప్రసిద్ధ శ్రీ పద్మనాభస్వామి ఆలయంలో బంగారం, వజ్రాల ఆభరణాలు అదృశ్యం కావడం సంచలనం సృష్టిస్తోంది. ఈ విషయాన్ని సాక్షాత్తూ కేరళ డీజీపీ వెల్లడించడంతో ఆలయ భద్రతపై భక్తుల్లో అనేక అనుమానాలు రేకెత్తుతున్నాయి. స్వామివారి ఆభరణాలు కనిపించకుండా పోయాయని కేరళ హోంశాఖ సెక్రటరీకి డీజీపీ సమర్పించిన నివేదిక చర్చనీయాంశమైంది. డీజీపీ నివేదిక ప్రకారం.. ఆలయం నుంచి సుమారు 78 గ్రాముల బంగారు, వజ్రాల ఆభరణాలు అదృశ్యమయ్యాయి. వాటిలో వైరమ్ నామంగా పిలువబడే వజ్రాల ఆభరణం కూడా ఉంది. అధికారిక రికార్డుల ప్రకారం వైరమ్ నామాన్ని మరమ్మతుల కోసం కొన్ని నెలల కిందట ఆలయం నుంచి బయటకు తీసుకెళ్లారు. కానీ, ఆ తర్వాత దానిని తిరిగి తీసుకురాలేదు. అదే విధంగా ఆరు నెలల కిందట ఆలయం నుంచి తీసుకెళ్లిన బంగారు దీపం కూడా కనిపించకుండా పోయింది. దీంతో ప్రస్తుతం ఉన్న భద్రతా ఏర్పాట్లపై డీజీపీ ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే దిద్దుబాటు చర్యలు చేపట్టి భద్రతను పటిష్ఠం చేయాలని హోం శాఖ సెక్రటరీని కోరారు.

## పోలీస్ కస్టడీకి బండి భగీరథ్

మొదటిపేజీ తరువాయి..

దర్యాప్తు దశలో ఉంది. మంగళవారం బండి భగీరథ్‌ని 3 రోజులపాటు పోలీసు కస్టడీకి మల్కాజిగిరి కోర్టు అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. బుధవారం పోలీసులు భగీరథ్‌ని కస్టడీలోకి తీసుకున్నారు. వైద్య పరీక్షలు నిర్వహించి పెట్‌బషీరాబాద్ పీఎస్‌కు తరలించారు. అనంతరం మొయినాబాద్‌లోని అరణ్య ఫామ్‌హౌస్‌కు సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం తీసుకెళ్లారు. ముగిసిన బండి భగీరథ్ విచారణ : అరణ్య ఫామ్‌హౌస్‌లో సీన్ రీకన్‌స్ట్రక్షన్ అనంతరం బండి భగీరథ్‌నుకూకట్‌పల్లి డీసీపీ కార్యాలయానికి తీసుకొచ్చారు. కూకట్‌పల్లి డీసీపీ ఆధ్వర్యంలో తొలిరోజు భగీరథ్‌ను విచారించారు. అనంతరం పేట్‌బషీరాబాద్ పీఎస్‌కు బండి భగీరథ్‌ను తరలించారు. మరో రెండు రోజులు భగీరథ్‌ని విచారించాల్సి ఉంది. 7 రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోరినా, కోర్టు కేవలం 3 రోజులపాటు మాత్రమే కస్టడీకి అనుమతి ఇచ్చింది.

అంతకుముందుపోక్స్ కేసులో నిందితుడు బండి భగీరథ్‌ను బుధవారం పేట్ బషీరాబాద్ పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. అనంతరం అతడిని మొయినాబాద్‌లోని అరణ్య ఫామ్‌హౌస్‌కు తరలించారు. సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం భగీరథ్‌ను పోలీసులు ఈ ఫామ్‌హౌస్‌కు తీసుకెళ్లినట్ల తెలుస్తోంది. మరోవైపు భగీరథ్‌ను మూడు రోజులపాటు ప్రశ్నించేందుకు పోలీసులకు కోర్టు అనుమతి ఇచ్చింది. పోక్సో కేసులో అరెస్టయిన బండి భగీరథ్ చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న సంగతి తెలిసిందే. అతడిని కస్టడీకి కోరుతూ మేడ్చల్ మల్కాజ్‌గిరి కోర్టులో పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు.. బండి భగీరథ్‌ను మూడు రోజుల పాటు పోలీసుల కస్టడీకి ఇస్తూ ఆదేశాలు జారీ చేసింది.దీంతో బండి భగీరథ్‌ను చంచల్‌గూడ జైలు నుంచి పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు పోలీసులు తరలించారు. అతడిని మూడు రోజుల పాటు పోలీసులు విచారించనున్నారు. బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా.. ఆమెపై అత్యాచారం చేశాడనే ఆరోపణలు బండి భగీరథపై వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో మే 16వ తేదీన అతడిని పేట్ బషీరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. బండి భగీరథ్ నుంచి మరిన్ని ఆధారాలు సేకరించాల్సి ఉందని.. వారం రోజుల పాటు అతడిని తమ కస్టడీకి ఇవ్వాలని కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో పోలీసులు స్పష్టం చేశారు. కానీ కోర్టు మాత్రం భగీరథ్‌ను మూడు రోజుల వరకే పోలీసుల కస్టడీకి అనుమతి ఇచ్చింది.

# ఎత్తు పెంచాల్సిందే

మొదటిపేజీ తరువాయి..

148 మీటర్ల ఎఫ్ఆర్ఎల్ వల్ల ఉత్తర తెలంగాణ నీటి అవసరాలు తీరవని తెలిపారు. ఎఫ్ఆర్ఎల్ పెరిగితే గ్రావిటీ ద్వారా తెలంగాణకు నీళ్లొస్తాయని, ఎఫ్ఆర్ఎల్ పెంచినా మహారాష్ట్రలో ముంపు ప్రభావం తక్కువేనని రేవంత్ లేఖలో పేర్కొన్నారు. ఇటీవల ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును పూర్తి చేయాలని నిర్ణయించిన తెలంగాణ ప్రభుత్వం ఈ అంశాన్ని పున:సమీక్షించింది. 148 మీటర్ల ఎఫ్ఆర్ఎల్ ఉత్తర తెలంగాణ నీటి అవసరాలకు సరిపోదని నిపుణుల సూచనలతో అంచనాకు వచ్చింది. అందుకే ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల్లో సాగునీరు, తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని తుమ్మిడిహెట్టి బ్యారేజ్ ఎత్తుపై మరోసారి చర్చ అవసరమని ముఖ్యమంత్రి తన లేఖలో ప్రస్తావించారు. 148 మీటర్ల కంటే కొంత ఎక్కువ ఎఫ్ఆర్ఎల్‌ను పరిశీలించినా, మహారాష్ట్రలో ముంపు ప్రభావం తక్కువగానే ఉంటుందని వివరించారు. ఎఫ్ఆర్ఎల్ పెరిగితే గ్రావిటీ ద్వారా తెలంగాణకు నీటిని తెచ్చుకునే వీలుందని లేఖలో ప్రస్తావించారు.

## గ్రామీణ ప్రాంతాలకు హై-స్పీడ్ బ్రాడ్ బ్యాండ్ కనెక్టివిటీ

మొదటిపేజీ తరువాయి..

జ్యోతిరాదిత్య సింధియాతో చర్చించారు. మండలం నుండి గ్రామ పంచాయతీ రింగ్ నెట్‌వర్క్ వ్యవస్థలను డిజిటల్ భారత్ నిధి కి బదిలీ చేయడంపై స్పష్టమైన విధానం ఉండాలని కేంద్ర మంత్రిని కోరారు. వీటిపై సింధియా సానుకూలంగా స్పందించారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి నాణ్యమైన హై-స్పీడ్ ఇంటర్నెట్ అందించాలనే తెలంగాణ దార్శనికతపై ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో చర్చించారు. తెలంగాణ ఆశిస్తున్న లక్ష్యాన్ని సాధించడానికి కేంద్రం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. తెలంగాణ ఒక స్పెషల్ పర్పస్ వెహికిల్ ఏర్పాటు చేసి దాని ద్వారా కేంద్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకోవడం, తద్వారా రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల అవసరాలకు అనుగుణంగా విస్తృతమైన హై-స్పీడ్ నెట్‌వర్క్‌ను అభివృద్ధి పరుచుకోవడానికి వీలుంటుంది. రాష్ట్రంలో ఏకీకృత డిజిటల్ విధానం వల్ల టీ-ఫైబర్ నెట్‌వర్క్‌ను విస్తరిస్తూ ప్రతి గ్రామ పంచాయతీని అనుసంధానిస్తూ రింగ్ ఆర్కిటెక్చర్‌గా తీర్చిదిద్దాలని సంకల్పించారు. రింగ్ ఆర్కిటెక్చర్ ద్వారా ఒక మార్గంలో నెట్‌వర్క్ అంతరాయం ఏర్పడినా, ప్రత్యామ్నాయ మార్గం ద్వారా సేవలు నిరంతరం కొనసాగుతాయి. తద్వారా గ్రామీణ తెలంగాణకు అంతరాయం లేకుండా హై-స్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందుబాటులోకి వస్తాయి. ఈ కార్యక్రమంలో భాగంగా మొదటి దశలో, నెట్‌వర్క్ దెబ్బతిన్న ఉమ్మడి నిజామాబాద్, రంగారెడ్డి, ఖమ్మం జిల్లాల్లోని 3,089 గ్రామాలకు డిజిటల్ కనెక్టివిటీ పునరుద్ధరిస్తారు. అమెండెడ్ భారత్‌నెట్ ప్రోగ్రామ్ కింద గ్రామాలను అనుసంధానిస్తూనే, భవిష్యత్తు అవసరాలకు సరిపడే ఫైబర్ నెట్ వర్క్ మౌలిక సదుపాయాల కల్పన ద్వారా రాష్ట్రంలోని హై-స్పీడ్ నెట్‌వర్క్ అందుతున్న ఇతర ప్రాంతాలకు సమంగా సేవలు అందించవచ్చు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు, సీఎం స్పెషల్ సెక్రటరీ బి. అజిత్ రెడ్డి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ డి. అనుదీప్ , ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కర్నాటకలో మారుతున్న సమీకరణాలు

మొదటిపేజీ తరువాయి..

సంస్థాగత బాధ్యత చేపట్టాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను పార్టీ అధిష్ఠానం కోరినట్టు విస్తృత ప్రచారం జరుగుతోంది. రాహుల్ గాంధీ నుంచి నేరుగా ఈ సందేశం రావడంతో సిద్ధరామయ్య సైతం పదవి నుంచి తప్పుకునే అవకాశం ఉందని అంటున్నారు. తాజా సమాచారం ప్రకారం, ఈనెల 28న అపాయింట్‌మెంట్ ఇవ్వాలని గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్‌ను సిద్ధరామయ్య కోరారు. అదేరోజు తన రాజీనామా పత్రాన్ని అందజేసి, తన డిప్యూటీ డీకే శివకుమార్ ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టేందుకు మార్గం సుగమం చేస్తారు. 'గురువారంనాడు అపాయింట్‌మెంట్ ఇవ్వాలని గవర్నర్‌ను ముఖ్యమంత్రి కోరిన మాట నిజమే' అని సిద్ధరామయ్య సన్నిహితుడు ఒకరు తెలిపారు. సిద్ధరామయ్య పదవి నుంచి తప్పుకోనున్నారనే ఊహాగానాల నేపథ్యంలో తన క్యాబినెట్ మంత్రులతో కీలకమైన బ్రేక్‌ఫాస్ట్ మీట్‌ను ఆయన గురువారం ఉదయం ఏర్పాటు చేయనున్నట్టు అధికారిక వర్గాల సమాచారం. కాగా, ఢిల్లీలో ఉన్న డీకే శివకుమార్ బుధవారం మధ్యాహ్నం బెంగళూరు చేరుకుని తిరిగి గురువారం హస్తినకు వెళ్తారు. ముఖ్యమంత్రి అధికారిక నివాసంలో జరిగే బ్రేక్‌ఫాస్ట్ సమావేశంలో పాల్గొనే అవకాశం ఉంది.కర్ణాటకలో నాయకత్వ మార్పిడి సజావుగా పూర్తి చేసేందుకు కేంద్ర నాయకత్వం గట్టి కసరత్తే చేస్తోంది. ఇందులో భాగంగా సీఎం సిద్ధరామయ్య సేవలను కేంద్ర స్థాయిలో ఉపయోగించు కునేందుకు వీలుగా ఆయనను రాజ్యసభకు పంపాలని పట్టుదలగా ఉంది. అయితే ఆలోచించుకునేందుకు తనకు కొంత సమయం ఇవ్వాలని సిద్ధరామయ్య కోరినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. డీకే శివకుమార్‌కు సీఎం పగ్గాలు అప్పగించాలని కేంద్ర నాయకత్వం ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకోవడంతో సిద్ధరామయ్య ఎప్పుడు రాజీనామా చేస్తారు? డీకే ఎప్పటిలోగా ప్రమాణస్వీకారం చేస్తారనే అంశాలు ఆసక్తిరకంగా మారాయి. ఇందులో రెండు ఆప్షన్లు ఉన్నట్టు చెబుతున్నారు. ఒక ఆప్షన్ ప్రకారం ఈనెల 28న కానీ 29న కానీ సిద్ధరామయ్య తన రాజీనామా పత్రాన్ని గవర్నర్‌కు అందజేసే అవకాశం ఉంది. అదే జరిగితే ఈవారం చివర్లో 30వ తేదీ డీకే కొత్త సీఎంగా ప్రమాణస్వీకారం చేయవచ్చు. రెండో ఆప్షన్ ప్రకారం సిద్ధరామయ్య పదవి నుంచి తప్పుకునే విషయంలో జాప్యం తలెత్తవచ్చు. అదే జరిగితే జూన్ 18న రాజ్యసభ ఎన్నికలు జరిగిన తర్వాతే సిద్ధరామయ్య రాజీనామా చేయడం, డీకే శివకుమార్ సీఎం పగ్గాలు చేపట్టడం జరుగుతుంది. ఇకపోతే కర్ణాటక నుంచి 4 రాజ్యసభ సీట్లకు ఎన్నికల జరగాల్సి ఉండగా, సంఖ్యాబలం ఆధారంగా 3 సీట్లను కాంగ్రెస్ సునాయాసంగా గెలుచుకుంటుంది. సిద్ధరామయ్యకు ఒక రాజ్యసభ సీటును కాంగ్రెస్ అదిష్ఠానం ఇప్పటికే ఆఫర్ ఇచ్చింది. రెండో సీటులో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే పోటీ చేసే అవకాశం ఉంది. ఖర్గే ప్రస్తుతం కర్ణాటక నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. ఆయన పదవీకాలం త్వరలో ముగియనుంది. కాగా, మూడో రాజ్యసభ సీటు డీకే శివకుమార్ సోదరుడు డీకే సురేశ్‌కు కేటాయించే అవకాశం ఉన్నట్టు పార్టీ వర్గాల సమాచారం. కాగా, కొత్త మంత్రివర్గంలో కనీసం ముగ్గురు డిప్యూటీ సీఎంలు ఉండాలని, తద్వారా 'పవర్ బ్యాలెన్స్'కు వీలుంటుందని సిద్ధరామయ్య వర్గం ఆలోచనగా ఉన్నట్టు తెలుస్తోంది. డీకే శివకుమార్ చేతిలో ప్రస్తుతం ఉన్న కర్ణాటక కాంగ్రెస్ అధ్యక్ష పదవిని కూడా ఆ వర్గం కోరుతున్నట్టు చెబుతున్నారు.

# మాజీ సీఎం విజయన్ ఇంటివద్ద ఉద్రిక్తత

మొదటిపేజీ తరువాయి..

ప్రయత్నం చేసినప్పటికీ వారు వెనక్కి తగ్గకపోవడంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దాడి సమయంలో వాహనంలో మహిళా అధికారులు కూడా ఉన్నట్లు సమాచారం. ఆందోళనకారులను సీపీఎం కార్యకర్తలుగా అనుమానిస్తున్నారు. ఈ ఘటనను ఈడీ తీవ్రంగా పరిగణించింది. ఆందోళనకారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తిరువనంతపురంలోని థంపనూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇదిలావుంటే కేరళం మాజీ సీఎం పినరయి విజయ్ నివాసంలో ఈడి రెయిడ్స్‌ను వ్యతిరేకిస్తూ ఆయన మద్దతుదారులు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. బుధవారం తిరువనంతపురంలో సోదాల అనంతరం తిరిగి వెళుతున్న ఈడీ అధికారుల వాహనాన్ని అడ్డుకున్నారు. ఈ క్రమంలో కొందరు రాళ్లతో వాహనంపై దాడి చేయడంతో కారు అద్దాలు దెబ్బతిన్నాయి. ఈడీ రాక నేపథ్యంలో పినరయి విజయన్ నివాసానికి ఆయన మద్దతుదారులు భారీగా చేరుకోవడంతో పోలీసులు వారిని చెదరగొట్టారు. ఈడీ అధికారుల వాహనాన్ని అక్కడి నుంచి పంపించేశారు. కేంద్ర ప్రభుత్వం కావాలని ఈడి దాడులు నిర్వహిస్తోందని సీపీఎం నేతలు ఆరోపించారు. కొచ్చిన్ మినరల్స్ అండ్ రిటైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) కేసులో మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ నివాసాలతో సహా కేరళంలోని 10 ప్రాంగణాల్లో ఈడి సోదాలు నిర్వహిస్తోంది. తిరువనంతపురంలోని మాజీ సీఎం విజయన్ ప్రస్తుత నివాసంతో పాటు ఆయన స్వస్థలమైన కన్నూర్‌లోని మరో ప్రాంగణం, మాజీ సీఎం విజయన్ అల్లుడు, మాజీ మంత్రి మొహమ్మద్ రియాజ్‌కు చెందిన నివాసంలో (కోజికోడ్) కూడా ఈడీ రెయిడ్స్ నిర్వహించింది. సోదాల సమయంలో మాజీ సీఎం, ఆయన కుటుంబ సభ్యులు ఇంట్లోనే ఉండగా బయట మద్దతుదారులు నిరసనలకు తెరతీశారు. సెక్యూరిటీ సిబ్బందిపై కొందరు దాడికి దిగే ప్రయత్నం చేయడంతో పార్టీ సీనియర్ నేతలు వారిని అడ్డుకుని శాంతింపజేసినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. మాజీ సీఎం విజయన్ కూతురు వీణా విజయన్‌కు చెందిన ఐటీ సంస్థ ఎక్సాలాజిక్ సొల్యూషన్స్ నుంచి ఎలాంటి సేవలు పొందకుండానే సీఎంఆర్ఎల్ డబ్బులు చెల్లించిందన్న ఆరోపణల నేపథ్యంలో ఈడీ ఈ రెయిడ్స్ నిర్వహించింది. సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ కూడా రంగంలోకి దిగింది. మొత్తం రూ.2.7 కోట్లు సీఎంఆర్ఎల్ నుంచి ఎక్సాలాజిక్‌కు అందినట్టు ఆరోపణలు వచ్చాయి. ఐటీ సర్వీసులు, కన్సల్టెన్సీ సేవల మాటున ఈ చెల్లింపులు సాగినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇక ఈడీ కేసును కొట్టేయాలంటూ సీఎంఆర్ఎల్ దాఖలు చేసిన పిటిషన్‌ను కేరళ హైకోర్టు ఇటీవలే తోసిపుచ్చింది. మరోవైపు, ఈ ఆరోపణలను మాజీ సీఎం విజయన్ గతంలోనే కొట్టిపారేశారు. తమ ఇమేజీని దెబ్బతీసే లక్ష్యంగా ఈ ఆరోపణలు పుట్టుకొచ్చాయని చెప్పారు.

## ప్రధాని మోడీతో తమిళనాడు సీఎం విజయ్ భేటీ

మొదటిపేజీ తరువాయి..

నరేంద్ర మోదీని సేవతీర్థ్‌లో బుధవారంనాడు కలుసు కున్నారు. ఉభయులూ 25 నిమిషాల సేపు సమావేశమయ్యారు. తమిళనాడు సీఎం విజయ్ బుధవారం ప్రధాని మోదీతో భేటీలో పలు అంశాలు చర్చించారని సమాచారం. తొలుత దిల్లీలోని తమిళనాడు భవన్‌కు చేరుకున్న విజయ్.. అనంతరం ప్రధాని కార్యాలయానికి వెళ్లి మోదీని మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎం అయ్యాక ఆయన తొలిసారి ప్రధానితో సమావేశమయ్యారు. దాదాపు 25 నిమిషాలపాటు సాగిన ఈ భేటీలో.. తమిళనాడుకు సంబంధించిన పలు అంశాలపై వారు చర్చించినట్లు తెలుస్తోంది. తమిళనాడుకు కేంద్రం నుంచి రావాల్సిన ఆర్థిక సాయంతో పాటు పలు అంశాలు చర్చించినట్లు తెలుస్తోంది. అనంతరం ఇరువురు నేతలు కలిసిన సందర్భంగా తీసిన ఫొటోలను పీఎంవో 'ఎక్స్' వేదికగా పోస్టు చేసింది. ఇటీవల నెదర్లాండ్స్ పర్యటన సందర్భంగా 'అనైమంగళం' రాగి శాసనాలను తిరిగి భారత్‌కు రప్పించడంలో ప్రధాని మోదీ చేసిన కృషికి సీఎం విజయ్ కృతజ్ఞతలు తెలిపారని పేర్కొంటూ తమిళనాడు ప్రభుత్వం ఓ ప్రకటన విడుదల చేసింది. మేకెదాటు డ్యామ్ వివాదం అంశంపైనా ప్రధానితో చర్చించినట్లు పేర్కొంది. తమిళనాడు మత్స్యకారులను శ్రీలంక నౌకాదళం అరెస్టు చేయడం, వేధించడం వంటి ఘటనలు పెరుగుతుండటంపై సీఎం ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలిపింది. ఈ ఏడాదిలోనే 12 అరెస్టులు నమోదయ్యాయని, ప్రస్తుతం 58 మంది మత్స్యకారులు శ్రీలంక నిర్బంధంలో ఉన్నారని ప్రధాని దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించింది. మత్స్యకారులను, వారి పడవలను తక్షణమే విడుదల చేయాలని శ్రీలంక ప్రభుత్వాన్ని కోరాల్సిందిగా అభ్యర్థించినట్లు పేర్కొంది. అనంతరం ఆయన నేరుగా తమిళనాడు హౌస్‌కు చేరుకోవడంతో గౌరవ వందనంతో ఆయనకు సాదర స్వాగతం లభించింది. తమిళనాడు సీఎంగా విజయ్ అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత ఢిల్లీకి రావడం ఇదే ప్రథమం. విజయ్ తన పర్యటనలో భాగంగా ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, కేంద్ర మంత్రి అమిత్‌షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కూడా కలుసుకోనున్నారు. కాంగ్రెస్ సీనియర్ నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గేలను 10 జన్‌పథ్‌లో కలుసుకోనున్నారు. విజయ్ సమావేశం నేపథ్యంలో జన్‌పథ్ వెలుపల రాహుల్-విజయ్ ఫోస్టర్లు వెలిసాయి. కాగా, వామపక్షాలు, ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ పార్టీల నేతలు కూడా తమిళనాడు హౌస్‌లో విజయ్‌ను కలుసుకోనున్నారు.

## కొనసాగుతున్న సరస్వతీ పుష్కరాలు

మొదటిపేజీ తరువాయి..

ఆచరించారు. వేద మంత్రోచ్ఛరణలు, హారతులు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో కాళేశ్వర క్షేత్రం మార్మోగుతోంది. ఈ నెల 21న ప్రారంభం అయిన పుష్కరాల్లో భక్తులు వివిధ ప్రాంతాల న ఉంచి వచ్చి నదీ స్నానం ఆరిస్తున్నారు. ఈ పుష్కర పుణ్య స్నానాలకు తెలంగాణ రాష్ట్రంలోని నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. హంపి పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతి మహాస్వామి హాజరై పుష్కరఘాట్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి పుష్కర స్నానం ఆచరించారు. అనంతరం భక్తులకు ఆశీర్వచనాలు అందించి, పుష్కరాల ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను గురిం చి వివరించారు. అలాగే దేవాదాయ కమిషనర్ హనుమంతరావు హాజరై పుష్కర స్నానం ఆచరించి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూర్ణకుంభ స్వాగతం పలికారు. పుష్కరాల సందర్భంగా శ్రీకాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో సకల ఐశ్వర్య ప్రాసస్థ్యం దుర్గ సూక్త హోమం అత్యంత వైభవంగా జరిగింది. పండితులు వేద మంత్రాల నడుమ హోమ క్రతువులను నిర్వహించగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూర్ణాహుతి సమర్పించారు. ఆర్టీసీ సంస్థ సరస్వతి పుష్కరాలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. పుష్కరఘాట్ వద్ద ఏర్పాటు చేసిన బాహుబలి సెట్టింగ్‌ను చూసి మురిసిపో యిన భక్తులు సెల్ఫీలు దిగుతూ సందడి చేస్తున్నారు. సరస్వతి పుష్కరఘాట్ వద్ద ఏర్పాటు చేసిన సరస్వతి మాత, శివుని విగ్రహాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. అలాగే పిల్లలు ఆడు కోవడానికి ఇక్కడ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పిల్లాపాపలతో వచ్చిన భక్తులు ఆహ్లాదాన్ని పొందుతున్నారు. అలాగే అంత్య పుష్కరాల సందర్భంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ చూపరులను మంత్రముగ్ధులను చేస్తోంది. కాళేశ్వర ముక్తీశ్వర ఆలయంలో మంగళ, గురువారాల్లో కాల సర్ప దోశ పూజలు నిర్వహించడం ఆనవాయితీ. పుష్కరాల నేపథ్యంలో ఆ పూజలను తాత్కలికంగా నిలిపివేశారు. పుష్కర స్నానం ఆచరించి ఆలయంలో ముక్తీశ్వరుడిని దర్శించుకుని వెళ్లారు. శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో ప్రతి రోజూ శివపార్వతుల కల్యాణ మహోత్సవం నిర్వహించడం ఇక్కడ ప్రత్యేకత. ఈ ఆలయానికి వచ్చే భక్తులు ఈ కల్యాణోత్సవంలో పాల్గొని పునీతులవుతారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు ఈ కల్యాణాన్ని నిర్వహించి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలను అందిస్తున్నారు.

# మట్టి మాఫియాపై మైనింగ్ అధికారుల సర్వే

## సాక్ష్యం వార్తకు స్పందన

ఖానాపురం మే27(సాక్ష్యం )
వరంగల్ జిల్లా ఖానాపురం మండలం బుధరావుపేట శివారు ఐనపల్లి , పోచారం , మంగళావారిపేట శివారు ప్రాంతాలలో మట్టి మాఫియా కార్యకలాపాలు విస్తృతంగా సాగుతున్న నేపథ్యంలో జిల్లా అధికారులకు అందిన ఫిర్యాదులు ,పలు పత్రికలతో పాటు "సాక్ష్యం " దినపత్రికలో వచ్చిన వార్త కథనాలకు ఎట్టకేలకు అధికారులు స్పందించారు. అక్రమంగా మట్టి (మొరం) తవ్వి న క్వారీలను మైనింగ్ శాఖ అధికారులు ,రెవిన్యూ ,ఫారెస్ట్ అధికారులు సంయుక్తంగా బుధవారం పరిశీలించారు. ఐనపల్లి శివారులోని క్వారీలో సుమారు16968 టన్నుల మట్టిని తరలించారని ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్లు అంచనా. పూర్తి స్థాయిలో అంచనా వేస్తామని, స్థానిక తహాశీల్దార్ సర్వేయర్ ద్వారా భూమి యొక్క వివరాలు తెలపాలని వరంగల్ మైనింగ్ ఏడి ఎ. రవిశంకర్ తెలిపారు. మట్టి మాఫియా తమ వ్యక్తులను పంపి మైనింగ్ అధికారులను, రెవెన్యూ అధికారులను, సర్వే నంబర్లు తారుమారు చేయడానికి ప్రయత్నించింది. కానీ ఆన్‌లైన్‌లో గూగుల్ మ్యాప్ ద్వారా సర్వే నంబర్లు చూడగా, అవి తప్పుడు పత్రాలని అధికారులకు తేటతెల్లమైంది. దీంతో వరంగల్ మైనింగ్ ఏడి రవిశంకర్ ఖానాపురం తహాశీల్దార్ నంగునూరి రమేష్‌ను భూమి యొక్క పూర్తి సర్వే చేయించి వివరాలు ఇవ్వాలని ఆదేశించడం జరిగింది. మట్టి మాఫియా గుట్టలను తవ్వి, టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలించి అక్రమ వ్యాపారాలకు పాల్పడుతున్నట్లు నివేదించబడింది. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు, రవాణా జరుగుతున్నాయని తెలుస్తోంది.నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఈ తవ్వకాలపై అధికారులు కఠినంగా వ్యవహరించాలని స్థానికులు కోరుతున్నారు. ఏప్రిల్ 20న మట్టి వ్యాపారం చేస్తున్న 9మందిపై పోలీసులు కేసు పెట్టి తహాశీల్ధార్ ముందు బైండోవర్ చేశారు. ఐనప్పటికి వారి మట్టి దందా కొనసాగింది. ఈనెల బుధరావుపేట శివారు ఐనపల్లి క్వారీలో బైండోవర్ ఐన వ్యక్తుల జెసీబీ ,టిప్పర్ తో మట్టిని అక్రమంగా తరలించారు. మట్టితరలించిన జెసీబీ ,టిప్పర్ డ్రైవర్లపై గాని యజమానులపై గాని ఏలాంటి చర్యలు తీసుకోబోతున్నారనే విషయాన్ని అధికారులు ప్రస్తావించకపోవడం విడ్డూరంగా ఉంది.మట్టి మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వానికి రావాల్సిన అక్రమ మట్టి రవాణా రాయల్టీ ఫీజును ఖచ్చితంగా వసూలు చేయాలని, అధికారులు పూర్తిస్థాయిలో పారదర్శకంగా వ్యవహరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ మైనింగ్ ఏడి రవిశంకర్, ఖానాపూర్ స్థానిక తహసిల్దార్ నంగునూరి రమేష్, ఆర్.ఐ. స్వామి, ఫారెస్ట్ డి.ఆర్.ఓ. సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.




## ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో ఘనంగా టీడీపీ వర్చువల్ మహానాడు కార్యక్రమం

సికింద్రాబాద్, మే 27 (సాక్ష్యం): తెలుగుదేశం పార్టీ తెలుగువారి ఇంటి పండుగగా నిర్వహించే మహానాడు ఈ నెల 27, 28 తేదీలలో వర్చువల్ విధానంలో నిర్వహిస్తున్న సందర్భంగా హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్



భవన్‌లో ప్రత్యేక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సికింద్రాబాద్ నియోజకవర్గం తార్నాక డివిజన్ అధ్యక్షులు గండికోట విజయ్ కుమార్, టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధికార ప్రతినిధి కాసుల సుదర్శన్ రెడ్డి, అడ్డగుట్ట డివిజన్ అధ్యక్షులు కాత విజయ్ కుమార్, అడ్ హక్ మెంబర్ భాను ప్రకాష్, మెట్టుగూడ డివిజన్ అధ్యక్షులు తడక వినోద్ కుమార్, నగర్ యువత అధ్యక్షులు శ్యామ్ కుమార్, సీతాఫల్ మండి సీనియర్ నాయకులు విక్రమ్ ముదిరాజ్, రామారావు, ప్రసాద్ రావు, బాలకృష్ణ, రాజు, అనిల్ తదితరులు వర్చువల్ మహానాడులో పాల్గొన్నారు. మహానాడులో పార్టీ భవిష్యత్ కార్యాచరణ, ప్రజా సమస్యలపై చేపట్టాల్సిన కార్యక్రమాలు, పార్టీ బలోపేతంపై చర్చలు జరిగినట్లు నాయకులు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## శ్రీనగర్ కాలనీలో ఓపెన్ జిమ్, సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని వినతి

ఉప్పల్, మే 27 (సాక్ష్యం): నాచారం డివిజన్ పరిధిలోని శ్రీనగర్ కాలనీలో ఉన్న పార్కులో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని, అలాగే కాలనీలో దెబ్బతిన్న రహదారుల స్థానంలో కొత్త సిమెంట్ రోడ్డు నిర్మించాలని కాలనీవాసులు



బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. కాలనీలో ప్రజలు వాకింగ్, వ్యాయామం కోసం వినియోగించే పార్కులో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడం అవసరమని, అదేవిధంగా పాడైన రహదారుల కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు వివరించారు. ఈ సందర్భంగా స్పందించిన సాయిజెన్ శేఖర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను ప్రాధాన్యతగా తీసుకొని త్వరలోనే పార్కులో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయించడంతో పాటు కాలనీలో కొత్త సిమెంట్ రోడ్లు నిర్మించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, శ్రీనివాస్, బాలకృష్ణ, భూషణ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## పోరాట యోధుడికి బాధ్యతలు రావడం సంతోషకరం: తెలంగాణ ఉద్యమకారులు

ఉప్పల్,మే 27 (సాక్ష్యం): తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు సభ్యునిగా మోతే శోభన్ రెడ్డి నియమితులైన సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన తెలంగాణ ఉద్యమకారులు కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యమకారులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నిరంతరం పోరాడిన నిబద్ధత కలిగిన



ఉద్యమకారుడికి కీలక బాధ్యతలు దక్కడం ఆనందకరమని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో భాగస్వామ్యమైన ఉద్యమకారుల సంక్షేమానికి సంబంధించిన నిర్ణయాల్లో పోరాట యోధుడు భాగస్వామి కావడం ద్వారా వారి సమస్యలకు మరింత ప్రాధాన్యత లభిస్తుందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తమ జీవితాలను అంకితం చేసి, సర్వం కోల్పోయిన ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించి తగిన గౌరవం, సంక్షేమ పథకాలు అందించాలని కోరారు. అదేవిధంగా ఉద్యమకారులకు రాష్ట్ర స్థాయిలో మరింత గుర్తింపు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు టేకులపల్లి రామచందర్, కొరపాక అంజి మాదిగ, బొడ్డు శివ, అద్వె గజ్వేల్లి శ్రీనివాస్, నడిగంటి బాలరాజ్, పాకాల రవి, దత్రపు దేవకుమార్, ఏల సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చరిత్ర సృష్టించిన వర్చువల్ మహానాడు : నాదెండ్ల బ్రహ్మం చౌదరి

### ఎర్రగొండపాలెంలో టీడీపీ శంఖారావం : గూడూరి ఎరిక్షన్ బాబు

### ఎరిక్షన్ బాబు నేతృత్వంలో కదంతొక్కిన పసుపు దండు

### చంద్రబాబు,లోకేష్ ప్రసంగాలకు దద్దరిల్లిన నియోజకవర్గ కేంద్రం

మార్కాపురం జిల్లా బ్యూరో, సాక్ష్యం:
పొదుపు మంత్రంతో పార్టీని ప్రజల గుండెచప్పుడుగా మార్చారు ముఖ్యమంత్రి చంద్రబాబు.టెక్నాలజీని ఆయుధంగా మలచి, వర్చువల్ మహానాడుతో దేశానికే దిక్సూచిగా నిలిచారు.ఆ స్ఫూర్తిని ఎర్రగొండపాలెం గడ్డ పై ఆవిష్కరించారు నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు.బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన సారథ్యంలో జరిగిన వర్చువల్ మహానాడు నభూతో నభవిష్యతి అనేలా సాగింది. ప్రధాని మోదీ ఇచ్చిన పొదుపు పిలుపును అక్షరాలా పాటిస్తూ,దేశంలోనే మొట్టమొదటిసారిగా వర్చువల్ విధానంలో మహానాడు నిర్వహించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే దక్కుతుంది.ఇది కేవలం ఒక కార్యక్రమం కాదు.ఇది ఒక విప్లవం.ఖర్చు తగ్గించి, వ్యవస్థను బలోపేతం చేస్తూ కార్యకర్తలను కదం తొక్కించిన చారిత్రాత్మక ఘట్టం. ఎర్రగొండ పాలెం టీడీపీ కార్యాలయం పసుపు కండువాలతో,జై టీడీపీ నినాదాలతో దద్దరిల్లింది.నియోజకవర్గ నలుమూలల నుండి వందలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు,అభిమానులు,నేతలు భారీ తెర పై ప్రత్యక్షమైన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతి మాటను గుండెల్లో నింపుకున్నారు.యువగళం నారా లోకేష్ బాబు ఉర్రూతలూగించే ప్రసంగం యువత రక్తాన్ని ఉప్పొంగించింది.ప్రతి డైలాగ్‌కు ఈలలు,చప్పట్లు,జిందాబాద్ నినాదాలతో ఆ ప్రాంగణం హోరెత్తింది. ఈ సమరశంఖానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, నియోజకవర్గ పరిశీలకులు నాదెండ్ల బ్రహ్మం చౌదరి గారి ఉనికి కార్యకర్తల్లో కొత్త జోష్ నింపింది.ఈ మహానాడు కార్యక్రమం ఆరంభంలో అన్న ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సమయంలో ప్రతి కార్యకర్త కంటా భావోద్వేగం పొంగింది.ఇది పార్టీ కాదు,ఒక కుటుంబం అని మరోసారి రుజువైంది.

నాదెండ్ల బ్రహ్మం చౌదరి గర్జిస్తూ...

"చంద్రబాబు అంటేనే ఒక బ్రాండ్.ఒక విజన్. దేశంలో ఏ నాయకుడు ఆలోచించని విధంగా వర్చువల్ మహానాడు పెట్టి చరిత్ర తిరగరాశారు.పొదుపు అంటే ఇది.పాలన అంటే ఇది. ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని అన్ని మండలాలలో మీరు చూపిన పౌరుషం చూస్తే 2029లో టీడీపీ విజయాన్ని ఆపడం ఎవరి తరం కాదని స్పష్టమవుతోంది" అని నినదించారు.

గూడూరి ఎరిక్షన్ బాబు ఉద్వేగంగా ప్రసంగిస్తూ...

" ఇది మన అధినేత ఆదేశం.మనం ఆయన సైనికులం.ఆయన చెప్పినట్లు టెక్నాలజీతో ముందుకు వెళ్తాం.లోకేష్ బాబు చెప్పినట్లు యువత బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తాం.ఈరోజు మీ కళ్లలో కనిపిస్తున్న కసి,మీ గొంతులో వినిపిస్తున్న నినాదం చాలు. ఎర్రగొండ పాలెం టీడీపీకి ఎదురులేదు. మన జెండా ఆకాశమే హద్దుగా ఎగురుతుంది " అని హుంకరించారు.పార్టీ కోసం ప్రాణం ఇచ్చే కార్యకర్తలు,విజన్ ఉన్న నాయకుడు,యువతకు దారి చూపే యువనేత,సమర్థవంతమైన స్థానిక నాయకత్వం.ఈ నాలుగు స్తంభాల మీద నిలబడిన ఈ వర్చువల్ మహానాడు ఎర్రగొండపాలెం రాజకీయ చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయం లిఖించింది.ఇది ముగింపు కాదు.ఇది 2029 విజయయాత్రకు ఆరంభం మాత్రమే అంటూ ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి ఎర్రగొండపాలెం నియోజక



వర్గ వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ చేకూరి సుబ్బారావు చౌదరి,మండల తెదేపా కన్వీనర్ చిట్యాల వెంగళ్ రెడ్డి,సీనియర్ నాయకులు కామేపల్లి వెంకటేశ్వర్లు చౌదరి,మాజీ సర్పంచ్ కంచర్ల సత్యనారాయణ గౌడ్,తెలుగుదేశం పార్టీ తెలుగు యువత రాష్ట్ర నాయకులు నల్లగాటి చిన్న మల్లికార్జున నాయుడు,మాజీ మండల అధ్యక్షులు ఎం సి హెచ్ మంత్రు నాయక్,తెలుగుదేశం పార్టీ ఎస్టీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ చెవుల అంజయ్య,కొత్తమాసు సుబ్రహ్మణ్యం,నిమ్మల ఈదన్న,వెంకటాద్రిపాలెం మాజీ సర్పంచ్ బోడ శ్రీశైలపతి నాయుడు,పాలుట్ల తెదేపా సీనియర్ నాయకులు భష్య నాయక్, వెంకటాద్రిపాలెం నీటి ఆయకట్టు సంఘం అధ్యక్షులు బోడ చిన్న పాలంక వీరయ్య నాయుడు,ఒంగోలు పార్లమెంటు అధికార ప్రతినిధి పాలడుగు వెంకట కోటయ్య,తోట మహేష్ నాయుడు,తెలుగుదేశం పార్టీ ముస్లిం మైనార్టీ నియోజకవర్గ అధ్యక్షులు షేక్ ఇస్మాయిల్,తెదేపా క్లస్టర్ ఇంచార్జీలు షేక్ మస్తాన్ వలి,ఎర్రగొండ పాలెం తెదేపా పట్టణ అధ్యక్షులు పెరుమళ్ళ మల్లికార్జున,కో క్లస్టర్ ఇంచార్జి మల్లిపెద్ది రామకృష్ణ,మరియు తెదేపా నాయకులు,కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## గుండె పోటుతో సీనియర్ రిపోర్టర్ మృతి

### ఎమ్మెల్యే నాగరాజు సంతాపం

వర్ధన్నపేట, మే 27 (సాక్ష్యం):
వర్ధన్నపేట పట్టణ కేంద్రానికి చెందిన శ్రీరామ్ రమేష్ (60) ఓ పత్రికకు చెందిన రిపోర్టర్ గుండె పోటుతో మృతి చెందారు. గత 25 సంవత్సరాలుగా రిపోర్టర్ గా సేవలు చేస్తూ ప్రజల మన్ననలు పొందారు. చార్ధామ్ పర్యటన ముగించుకుని తిరిగి వస్తుండగా అస్వస్థతకు గురికావడంతో ఢిల్లీ వద్ద హాస్పిటల్ లో చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందిన శ్రీరాం రమేష్ మృతిపై పలువురు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. స్థానిక ప్రజలతో పాటు ప్రజాసంఘాలు పలు పార్టీలకు చెందిన నాయకులు అభిమానులు వారి సానుభూతిని వ్యక్తం చేశారు.



మీడియా రంగానికే తీరని లోటు
– వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

జర్నలిజం రంగంలో నిబద్ధతతో పనిచేస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చిన రమేష్ మరణం మీడియా రంగానికి తీరని లోటని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. వారి సేవలను ఎప్పటికీ మరువలేమని ఎమ్మెల్యే అన్నారు . శ్రీరాం రమేష్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కష్టకాలంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.


**CHANGE OF NAME**

**I, YAKKALURU NAGA LAKSHMAMMA, W/o. YAKKALURU NARAYANA REDDY**, R/o. H.No. 2-94, Martadu, Martadu Garladinne Thimmampeta, Anantapur, Andhra Pradesh-515731. I have changed my name from **YEKKULURI NAGALAKSHMI (OLD NAME)** to **YAKKALURU NAGA LAKSHMAMMA (NEW NAME)** for all future purposes.

**CHANGE OF NAME**

I, **YAKKALURU NARAYANA REDDY, S/o. YAKKALURU PEDDA YALLAREDDY**, R/o. H.No. 2-94, Martadu, Martadu Garladinne Thimmampeta, Anantapur, Andhra Pradesh-515731. I have changed my name from **YEKKULURI NARAYANA REDDY (OLD NAME)** to **YAKKALURU NARAYANA REDDY (NEW NAME)** for all future purposes.

**U GRO Capital Limited**
బి-17, నాల్గవ అంతస్తు, ఆర్ట్ గిల్డ్ హౌస్, ఫీనిక్స్ మార్కెట్ సిటీ, కుర్లా (వెస్ట్), ముంబయి-400070.

**స్వాధీనతా ప్రకటన (అనుబంధము-4 (రూల్ 8(1)ని చూడుము) (స్థిరాస్తి కొరకు)**

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (2002 యొక్క 54) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొనుచూ U GRO క్యాపిటల్ లిమిటెడ్, రిజిస్టర్డ్ ఆఫీస్: బి-17, నాల్గవ అంతస్తు, ఆర్ట్ గిల్డ్ హౌస్, ఫీనిక్స్ మార్కెట్ సిటీ, కుర్లా (వెస్ట్), ముంబయి- 400070 వారి అధీకృత అధికారి అయిన దిగువ సంతకముదారు జారీ చేసిన డిమాండ్ నోటీసు ప్రకారము నోటీసులో తెలిపిన బకాయి మొత్తము తదుపరి వడ్డీతో సహా నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించమని కోరడమైనది.
సదరు రుణగ్రహీతలు రుణ బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8తో చదవబడు చట్టం యొక్క సెక్షన్ 13 సబ్ సెక్షన్ (4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని ఈ క్రింద తెలియజేసిన ఆస్తిని ఈ దిగువ సంతకముదారు స్వాధీనము చేసుకున్నారని రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకమునకు తెలియజేయడమైనది. రోజు, నెల మరియు సంవత్సరం దిగువ తెలుపడమైనది.
కావున ప్రత్యేకించి రుణగ్రహీతలను మరియు సాధారణ ప్రజానీకమును హెచ్చరించడమేమనగా సదరు ఆస్తితో ఎటువంటి లావాదేవీలు జరుపకూడదనియు ఒక వేళ జరిపినట్లయితే U GRO క్యాపిటల్ లిమిటెడ్ వారికి చెందిన బకాయి మొత్తము మరియు దానిపై వడ్డీ క్రింద వర్తించును. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు గల సమయ లభ్యత కొరకు చట్టములోని సెక్షన్ 13 సబ్ సెక్షన్ (8)ని గమనించవలసిందిగా రుణగ్రహీతలను కోరడమైనది.

| రుణగ్రహీత వివరములు | డిమాండ్ నోటీసు | స్వాధీనతా తేది |
|---|---|---|
| 1. లెజెండ్ ఫాబ్‌టెక్ అండ్ ఇంజనీరింగ్ సర్వీసెస్ 2. సోమా దే, 3. నరేష్ మోటె రుణ ఖాతా నెం. UGBRPSS0000035614 | డిమాండ్ నోటీసు తేది: 18-నవంబర్-2025 తేది: 13/11/2025 నాటికి బకాయి మొత్తం: రూ. 2,94,90,698.00/- (రూపాయలు రెండు కోట్ల తొంభై నాలుగు లక్షల తొంభై వేల ఆరు వందల తొంభై ఎనిమిది మాత్రమే) | 25.05.2026 |

**తనఖాపెట్టబడిన ఆస్తి:** తెలంగాణ రాష్ట్రం, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, జిహెచ్‌ఎంసి కూకట్‌పల్లి సర్కిల్ క్రింద, కూకట్‌పల్లి మం॥, మూసాపేట గ్రా॥ వద్ద సర్వే నెం. 252/1లో 500 చ॥గ॥లు లేదా దానికి సమానమైన 416.74 చ॥మీ॥ల విస్తీర్ణములో కలిగి 2800 చ॥అ॥ల బిల్టప్ ఏరియా కలిగిన జిహెచ్‌ఎంసి ఇంటి నెం. 5-9-16/3 యావదాస్తి. సరిహద్దులు: ఉత్తరం: ఇంటి నెం. 9-16/4, దక్షిణం: ఇంటి నెం. 9-16/2, తూర్పు: 25'-0" అడుగుల వెడల్పు రోడ్డు, పడమర: శ్రీ పద్మారావు కు చెందిన భూమి.

తేది: 28/05/2026, ప్రదేశం: తెలంగాణ అధీకృత అధికారి-U GRO క్యాపిటల్ లిమిటెడ్

**నార్తర్న్ ఏఆర్‌సి క్యాపిటల్ లిమిటెడ్**
NORTHERN ARC
**రిజిస్టర్డ్ ఆఫీస్:** 10వ అంతస్తు, ఫేజ్-I, IIT-మద్రాస్ రీసెర్చ్ పార్క్, కనగం విలేజ్, తారామణి, చెన్నై - 600113, తమిళనాడు.

**రూల్ - 8(1) - స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కోసం)**

అయితే, క్రింద సంతకందారు నార్తర్న్ ఏఆర్‌సి క్యాపిటల్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 రూల్ 13(12)తో చదవబడిన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 క్రింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుంటూ, రుణగ్రహీత **(1) శ్రీ సర్దార్ తులసి సింగ్ (రుణగ్రహీత)** చిరునామా. ఇంటి నం. 5-97, గండి గూడెం, దయార్ అమీన్‌పూర్, సుల్తాన్‌పూర్, సంగారెడ్డి, తెలంగాణ - 502319 **(2) శ్రీమతి సర్దార్ దేవి (సహ-రుణగ్రహీత)** ఇంటి నం. 5-97, గండి గూడెం, దయార్ అమీన్‌పూర్, సుల్తాన్‌పూర్, సంగారెడ్డి, తెలంగాణ - 502319 **(3) M/s. శ్రీ సర్దార్ తులసి సింగ్ (సహ-రుణగ్రహీత)** ఇంటి నం. 5-97, గండి గూడెం, దయార్ అమీన్‌పూర్, సుల్తాన్‌పూర్, సంగారెడ్డి, తెలంగాణ - 502319 వారిని నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని **రూ. 26,62,007/- (రూపాయిలు ఇరవై ఆరు లక్షల అరవై రెండు వేల ఏడు మాత్రమే మాత్రమే) 11 జులై 2025** నాటికి మరియు **12 జులై 2025** నుండి వడ్డీతో పాటు **15 ఆగస్టు 2025** నుండి వడ్డీతో పాటు ఆ నోటీసు అందిన తేదీ నుండి 60 రోజుల్లోపు తిరిగి చెల్లించాల్సిందిగా **16 జులై 2025 తేదీన** డిమాండ్ నోటీసును జారీ చేయడం జరిగింది.
రుణగ్రహీత మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, క్రింద సంతకందారు **25/05/2026** నాటి ఈ స్వాధీన నోటీసులోని నిబంధన 8తో పాటు పేర్కొన్న చట్టంలోని సెక్షన్ 13(4) కింద అతనికి / ఆమెకు ఇవ్వబడిన అధికారాలను ఉపయోగించి క్రింద వివరించిన ఆస్తిని స్వాధీనం చేసుకోవడం జరిగిందని రుణగ్రహీత/ గ్యారెంటర్/ సహ-రుణగ్రహీత మరియు ప్రజలకు నోటీసు ఇవ్వబడింది,
రుణగ్రహీత/ గ్యారెంటర్/ సహ-రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలు ఆస్తితో వ్యవహరించవద్దని ఇందుమూలంగా హెచ్చరిస్తున్నారు మరియు ఆస్తితో ఏవైనా లావాదేవీలు **రూ. రూ. 26,62,007/- (రూపాయిలు ఇరవై ఆరు లక్షల అరవై రెండు వేల ఏడు మాత్రమే మాత్రమే) 11 జులై 2025** నాటికి మరియు **12 జులై 2025** నుండి వడ్డీతో పాటు ఖర్చులు, మొదలైనవి నార్తర్న్ ఏఆర్‌సి క్యాపిటల్ లిమిటెడ్ ఛార్జీకి లోబడి ఉంటాయి,

**స్థిరాస్తి యొక్క వివరణ**

తెలంగాణ - 502319, సంగారెడ్డి సబ్-రిజిస్ట్రార్ పరిధిలో, సంగారెడ్డి జిల్లా, అమీన్‌పూర్ మండలం, సుల్తాన్‌పూర్ గ్రామంలోని సర్వే నం. 330లో, 135 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న ఇంటి నం. 5-97 వద్ద గల ఆస్తి మొత్తం భాగం మరియు స్థలం. మరియు దీని సరిహద్దులు: **ఉత్తరం:** రహదారి; **దక్షిణం:** చింత యాదయ్య గారి ఇల్లు; **తూర్పు:** రోడ్డు; పడమర: రోడ్డు.

సం/-
అధీకృత అధికారి
నార్తర్న్ ఏఆర్‌సి క్యాపిటల్ లిమిటెడ్
ప్రదేశం: సంగారెడ్డి, తెలంగాణ
తేది : 25 మే 2026

FEDBANK FINANCIAL SERVICES LIMITED

**ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్**
రిజిస్టర్డ్ ఆఫీస్: యూనిట్ నం. 1101, 11వ అంతస్తు, సిగ్నస్, ప్లాట్ నం. 71ఏ, పోవై, పాస్పోలి, ముంబాయి-400087

**డిమాండ్ నోటీసు**

క్రింద పేర్కొన్న రుణగ్రహీత మరియు సహ రుణగ్రహీతలు (సమిష్టిగా "రుణగ్రహీతలు" అని పిలుస్తారు) వారి స్థిరాస్తిని (సెక్యూరిటీలు) ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ (ఇకపై "ఫెడ్‌ఫినా" అని పిలుస్తారు) కు తనఖా పెట్టి రుణాన్ని పొందారు. రుణగ్రహీతలు రుణ మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున ఈ రుణాన్ని నిరర్థక ఆస్తిగా వర్గీకరించారు. దీనికి సంబంధించి ఫెడ్‌ఫినా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 లోని సెక్షన్ 13(2) కింద చిరునామాదారునికి కింద పేర్కొన్న విధంగా వరుసగా డిమాండ్ నోటీసును జారీ చేసింది, ఈ వివరాలు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని సెక్షన్ 13(2) మరియు రూల్ 3(1) కింద ప్రత్యామ్నాయ సేవగా ఇక్కడ ప్రచురించబడ్డాయి. ఈ నోటీసు ప్రచురించబడిన 60 రోజులలోపు డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని మరియు దానితో పాటు వచ్చే వడ్డీని తిరిగి చెల్లించాలని కోరడం జరుగుతుంది. అలా చేయడంలో విఫలమైతే, చట్టంలోని సెక్షన్ 13(4) మరియు 14 ప్రకారం దిగువ సంతకందారు ఫెడ్‌ఫినా ఆ ఆస్తిపై తగిన చర్య తీసుకోవడం జరుగుతుంది. లోన్ నంబర్, రుణగ్రహీతలు, సెక్షన్ 13(2) కింద పంపిన డిమాండ్ నోటీసు, అభ్యర్థించిన మొత్తం మరియు స్థిరాస్తి వివరాలు క్రింద ఇవ్వబడ్డాయి.

| క్ర. సం. | రుణగ్రహీత / సహ రుణగ్రహీతల పేరు సందర్భానుసారంగా ప్రాపర్టీ హోల్డర్స్ | సెక్యూర్డ్ అసెట్స్ / తనఖా ప్రాపర్టీ వివరణ | డిమాండ్ నోటీసు తేదీ U/s. 13(2) & మొత్తం O/s. |
|---|---|---|---|
| 1 | లోన్ అకౌంట్ నం. LAP/ FEDHYCLAP0543345 1. మొహమ్మద్ ఆజాం అలీ (రుణగ్రహీత) 2. గిడ్డె షఫా (సహ-రుణగ్రహీత) | తెలంగాణ, హైదరాబాద్-500053, హాఫెజ్ బాబా నగర్, కంచన్ బాగ్ వద్ద మున్సిపల్ నెం. 18-12-419/672/1 గల ఇల్లు, 80 చదరపు గజాల స్థలం తాకట్టు పెట్టబడిన ఆస్తి యొక్క యావత్తు : సరిహద్దులు: తూర్పు: ఇంటి నెం. 18-12-419/671, పడమర: ఇంటి నెం. 18-12-419/671A, ఉత్తరం: 15 అడుగుల వెడల్పు రోడ్డు, దక్షిణం: పొరుగువారి ఇల్లు. | 19/5/2026 రూ. 3553536/- (రూపాయలు ముప్పై ఐదు లక్షల యాభై మూడు వేల ఐదు వందల ముప్పై ఆరు మాత్రమే) 19/5/2026 నాటికి ఎన్‌పిఏ : 15/5/2026 |
| 2 | లోన్ అకౌంట్ నం. STL/ FEDWARSTL0532479 1. మహమ్మద్ గౌస్ ఖురేషి (రుణగ్రహీత) 2. జీనత్ బేగం (సహ-రుణగ్రహీత) | గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాజీపేట, ఫాతిమా నగర్, శ్రీరామ్ నగర్ కాలనీ, వరంగల్ అర్బన్ రెవెన్యూ జిల్లా మరియు వరంగల్ రిజిస్ట్రేషన్ జిల్లా పరిధిలో, వరంగల్ అర్బన్ జాయింట్ సబ్-రిజిస్ట్రార్ అధికార పరిధిలో ఆర్‌సిసి పైకప్పు కలిగిన, 340 చదరపు గజాలు లేదా 284.27 చదరపు మీటర్లు విస్తీర్ణం గల ఖాళీ స్థలంతో కూడిన నివాస గృహం GWMC ఇంటి నంబరు 24-6-261/1 గల తాకట్టు ఉంచబడిన ఆస్తి యొక్క యావత్తు. ఆస్తి సరిహద్దులు: తూర్పు: : 4'-0" వెడల్పు లేన్; పడమర: ఎం సునీల్ గారి ఇంటి నంబరు 24-6-261; ఉత్తరం: 15 అడుగుల వెడల్పు రోడ్డు; దక్షిణం: డ్రైనేజీ. | 12/5/2026 రూ. 2573122/- (రూపాయలుఇరవై ఐదు లక్షల డెబ్బై మూడు వేల ఒక వంద ఇరవై రెండుమాత్రమే) 12/5/2026 నాటికి ఎన్‌పిఏ : 7/5/2026 |
| 3 | లోన్ అకౌంట్ నం. STL/ FEDSIDSTL0507800 1. బాల్‌రెడ్డి డెయిరీ ఫామ్ (రుణగ్రహీత) 2. నరెడ్ల బాల్ రెడ్డి తండ్రి నరెడ్ల వెంకట్ రెడ్డి (సహ-రుణగ్రహీత) 3. నరెడ్ల విజయలక్ష్మి భర్త నారెడ్ల బాల్ రెడ్డి (సహ-రుణగ్రహీత) | డోర్ నం. 4-5, విస్తీర్ణం 254-22 చదరపు గజాలు దానికి సమానమైన 212-52 చదరపు మీటర్లు గల, మరియు 800-00 చదరపు అడుగుల R.C.C. ప్లింత్ విస్తీర్ణం కలిగిన భవన యొక్క యొక్క యావత్తు. సరిహద్దులు: - ఉత్తరం: V. యధి రెడ్డి గారి ఇల్లు, దక్షిణం: G.P. రోడ్డు, తూర్పు: M.D. ఇక్బాల్ గారి ఇల్లు, పడమర: పాతూరి రాములు గారి ఇల్లు. ఈ ఆస్తి జనగాం జిల్లా, బచ్చన్నపేట మండలం, అలింపూర్ గ్రామంలో ఉంది. ఇది జనగాం సబ్-రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో మరియు వరంగల్ జిల్లా రిజిస్ట్రార్ పరిధిలో ఉంది. | 12/5/2026 రూ. 22,29,629/- (రూపాయలు ఇరవై రెండు లక్షల ఇరవై తొమ్మిది వేల ఆరు వందల ఇరవై తొమ్మిది మాత్రమే) 12/05/2026 నాటికి ఎన్‌పిఏ : 7/5/2026 |

రుణగ్రహీతలు డిమాండ్ నోటీసు(లు) కు కట్టుబడి ఉండాలని మరియు ఈ ప్రచురణ తేదీ నుండి 60 రోజులలోపు వర్తించే వడ్డీ, అదనపు వడ్డీ, బౌన్స్ ఛార్జీలు, ఖర్చు మరియు వ్యయాలతో పాటు చెల్లింపు జరిగే తేదీ వరకు చెల్లించాలని ఇందుమూలంగా సూచించబడింది. **ఫెడ్‌ఫినా** ఒక సెక్యూర్డ్ క్రెడిటర్ అని మరియు రుణగ్రహీతలు పొందిన రుణ సౌకర్యం అనేది స్థిరాస్తి/ఆస్తులపై సెక్యూర్డ్ రుణం అని రుణగ్రహీతలు గమనించవచ్చు. నిర్ణీత సమయంలోపు రుణగ్రహీతలు తమ బాధ్యతలను పూర్తిగా నిర్వర్తించడంలో విఫలమైతే, సెక్యూర్డ్ ఆస్తులను (ల) అమ్మకం ద్వారా లేదా చట్టం మరియు దాని కింద ఉన్న నియమాల ప్రకారం అందుబాటులో ఉన్న ఏదైనా ఇతర పరిష్కారాన్ని ఉపయోగించి బదిలీ చేయడంతో సహా కానీ పరిమితం కాకుండా ఫెడ్‌ఫినా సెక్యూర్డ్ ఆస్తులను (ల) స్వాధీనం చేసుకోవడానికి చట్టంలోని సెక్షన్ 13(4) కింద ఉన్న అన్ని హక్కులను వినియోగించుకునే హక్కును కలిగి ఉంటుంది. అమ్మకం లేదా బదిలీ హక్కును అమలు చేయడానికి ముందు సెక్యూర్డ్ ఆస్తులను (ల) అటాచ్ చేయడానికి మరియు / లేదా సీల్ చేయడానికి **ఫెడ్‌ఫినా**కు అధికారం ఉంది. సెక్యూర్డ్ ఆస్తుల(లు) అమ్మకం తర్వాత, తనఖా పెట్టిన ఆస్తుల విలువ **ఫెడ్‌ఫినా**కు చెల్లించాల్సిన బకాయిలను కవర్ చేయడానికి సరిపోకపోతే, మిగిలిన బకాయిలను తిరిగి పొందడానికి ఫెడ్‌ఫినాకు ప్రత్యేక చట్టపరమైన చర్యలను ప్రారంభించే హక్కు కూడా ఉంది. ఈ పరిహారం ఏదైనా ఇతర చట్టం కింద ఫెడ్‌ఫినాకు అందుబాటులో ఉన్న అన్ని ఇతర పరిష్కారాల కంటే అదనంగా మరియు స్వతంత్రంగా ఉంటుంది.

సెక్యూర్డ్ ఆస్తులను రీడీమ్ చేయడానికి అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి, చట్టంలోని సెక్షన్ 13(8) మరియు చట్టంలోని సెక్షన్ 13(13) రుణగ్రహీత(లు) దృష్టి సారించాల్సిందిగా కోరడం జరుగుతుంది, దీని ద్వారా రుణగ్రహీత(లు) సెక్యూర్డ్ ఆస్తి(లు)ను డిస్పోజింగ్ లేదా వాటితో వ్యవహరించడం లేదా అమ్మకం, లీజు లేదా ఇతరత్రా (సాధారణ వ్యాపార కోర్సులో కాకుండా) ఏదైనా సెక్యూర్డ్ ఆస్తి(లు) బదిలీ చేయకుండా నిరోధించబడ్డారు / నిషేధించబడ్డారు మరియు ఫెడ్‌ఫినా వారి ముందస్తు లిఖితపూర్వక అనుమతి లేకుండా మరియు పైన పేర్కొన్న వాటిని పాటించకపోవడం ఆ చట్టంలోని సెక్షన్ 29 ప్రకారం శిక్షార్హమైన నేరం. డిమాండ్ నోటీసు కాపీ దిగువ సంతకందారు వద్ద అందుబాటులో ఉంటుంది మరియు రుణగ్రహీతలు కోరుకుంటే, సాధారణ కార్యాలయ పనివేళల్లో ఏ పని దినంలోనైనా కింద సంతకం చేసిన వ్యక్తి నుండి దానిని తీసుకోవచ్చు.

ప్రదేశం: హైదరాబాద్, తేది: 28-05-2026 సం/- అధీకృత అధికారి, ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ కోసం

## దేశంలో 25శాతం పెట్టుబడులు ఎపికే

### రాజకీయాల్లో యువతకు పెద్దపీట వేస్తాం

### విశాఖ మహానాడు వేదికలో ఎంపి శ్రీభరత్

విశాఖపట్నం,మే27సాక్ష్యం: దేశంలో గత ఏడాది వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో 25 శాతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే వచ్చాయని విశాఖపట్నం లోక్‌సభ సభ్యుడు ఎం. భరత్ వెల్లడించారు. స్పీడ్ ఆఫ్ డ్యూయింగ్ బిజినెస్ నినాదంతో సక్సెస్ అయ్యామన్నారు. బుధవారం విశాఖపట్నం ఉత్తర నియోజకవర్గంలోని 42, 43వ వార్డుల క్లస్టర్‌లో ఏర్పాటు చేసిన మహానాడు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎంపీ శ్రీభరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీభరత్ మాట్లాడుతూ.. 20, 25 ఏళ్ల లోపు యువతకు పబ్లిక్ పాలసీ, రాజకీయాల్లో పెద్దపీట వేస్తామని స్పష్టం చేశారు. భవిష్యత్తులో మహిళా బిల్లు చట్టం అమలులోకి రావడం ఖాయమన్నారు. పార్టీలోకి పెద్ద ఎత్తున మహిళా శ్రేణులను తెలుగుదేశం పార్టీ ఆహ్వానిస్తోందని తెలిపారు.

టీడీపీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నారా లోకేష్ బాధ్యతలు స్వీకరించటం శుభసూచకమని ఎంపీ శ్రీభరత్ పేర్కొన్నారు. నారా లోకేష్ నాయకత్వంలో టీడీపీ మరింత బలంగా ముందుకు వెళ్లనుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. విశాఖపట్నం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 82 క్లస్టర్లు ఏర్పాటు చేశారు. ప్రతి క్లస్టర్‌లో మహానాడు ప్రత్యక్ష ప్రసారం వీక్షించేలా టీడీపీ నాయకులు, కార్యకర్తలు కోసం ప్రత్యేకంగా భారీ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా1,850 క్లస్టర్లలో మహానాడు సమావేశాల నిర్వహిస్తున్నారు. విశాఖపట్నంలోని 81 క్లస్టర్లలో వర్చువల్‌గా నిర్వహించిన మహానాడులో టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## మొదటిరోజు మహానాడు ముగింపు

### 12 కోట్ల విరాళాలు సమకూరినట్లు ప్రకటన

అమరావతి,మే27సాక్ష్యం: టీడీపీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మహానాడు తొలి రోజు బుధవారం ముగిసింది. తొలిరోజు మహానాడులో వివిధ తీర్మానాలపై 48 మంది నేతలు ప్రసంగించారు. ఈ రోజు తెలుగుదేశం పార్టీకి దాదాపు రూ.12 కోట్లు విరాళంగా నేతలు అందజేశారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి దంపతలు పార్టీకి రూ.5 కోట్లు విరాళంగా ఇచ్చారు. పార్టీకి మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి, ఎమ్మెల్యే భాష్యం రామకృష్ణలు రూ. కోటి చొప్పున విరాళంగా ఇచ్చారు.

అలాగే మహానాడులో తొలిసారి ట్రాన్స్‌జెండర్‌కు ప్రసంగించే అవకాశాన్ని పార్టీ కల్పించింది. ఈ మహానాడు వేదికగా గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి పీఏ ట్రాన్స్‌జెండర్ వర్షిణీ ప్రసంగించింది. పార్లమెంట్ బిల్లుతో సంబంధం లేకుండా వచ్చే ఎన్నికల్లో 33 శాతం సీట్లు మహిళలకు కేటాయిస్తామని టీడీపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. ఈ ప్రకటనపై సర్వత్రా చర్చ నడుస్తోంది. లోకేష్ తాజా ప్రకటనపై పార్టీలోని నేతలతో పాటూ కేడర్ కూడా స్వాగతిస్తున్నారు.

## విజయవాడలో సూపర్ ప్రెషర్ బెలూన్

### ప్రారంభించిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

విజయవాడ,మే27సాక్ష్యం: భారతదేశ అంతరిక్ష సాంకేతిక రంగంలో సరికొత్త అధ్యాయం లిఖించబడింది. విజయవాడ వేదికగా 'రెడ్ బెలూన్ ఏరోస్పేస్' సంస్థ ఆధ్వర్యంలో దేశంలోనే మొట్టమొదటిసారిగా రూపొందించిన 'సూపర్ ప్రెషర్ బెలూన్' ను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇది దేశ రక్షణ, ప్రగతి రంగాల్లో ఒక చరిత్రాత్మక ఘట్టమని అభివర్ణించారు. రెడ్ బెలూన్ ఏరోస్పేస్ ఫౌండర్లు కిరణ్, శిరీష్‌ల పట్టుదల, కృషిని మంత్రి అభినందించారు. ఈ సరికొత్త టెక్నాలజీ కేవలం శాస్త్ర సాంకేతిక రంగాలకే పరిమితం కాకుండా, సామాన్య ప్రజలకు, ముఖ్యంగా రైతులకు ఎంతగానో ఉపయోగపడనుందని రామ్మోహన్ నాయుడు తెలిపారు. పంటల స్థితిగతులను అంచనా వేయడం, భూమి సామర్థ్యాన్ని పరీక్షించడం, అత్యాధునిక ల్యాండ్ సర్వేలు నిర్వహించడం, మరియు అటవీ విస్తీర్ణాన్ని నిరంతరం పర్యవేక్షించడంలో ఈ సూపర్ ప్రెషర్ బెలూన్ కీలక పాత్ర పోషించనుంది. ప్రధాని నరేంద్ర మోదీ గత 12 ఏళ్లుగా అందిస్తున్న అపార ప్రోత్సాహం వల్లనే భారతదేశంలో స్పేస్ టెక్నాలజీ ఇవాళ 8 బిలియన్ డాలర్ల భారీ పరిశ్రమగా ఎదిగిందని మంత్రి గుర్తుచేశారు. రాబోయే పదేళ్లలో ఈ రంగం ఏకంగా 40 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించే దిశగా దూసుకుపోతోందన్నారు. చంద్రయాన్, మంగళ్యాన్, ఆదిత్య వంటి ప్రతిష్టాత్మక మిషన్ల విజయాలతో అంతరిక్ష రంగంలో భారత్ ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిచిందని కొనియాడారు. పీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదర్శవంతమైన నాయకత్వంలో అమరావతి సమీపంలో ఈ సంస్థ తన కార్యకలాపాలను విస్తరిస్తోందని, దీని ద్వారా భవిష్యత్తులో సుమారు 150 మంది స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని మంత్రి రామ్మోహన్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఏపీని సరికొత్త ఆవిష్కరణల హబ్‌గా మార్చేందుకు ఇటువంటి ప్రయోగాలు ఎంతగానో దోహదపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## మహిళలకు టిడిపి పెద్దపీట

అమరావతి,మే27సాక్ష్యం: మహానాడు వేదికగా టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ సంచలన ప్రతిపాదన చేశారు. పార్టీ పరంగా 33 శాతం మహిళా రిజర్వేషన్లు అమలు



చేయాలని ప్రతిపాదిస్తూ కీలక చర్చకు శ్రీకారం చుట్టారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత లోకేశ్ చేసిన ఈ ప్రతిపాదన రాష్ట్ర రాజకీయాల్లోనే కాక జాతీయస్థాయిలో కూడా ఆసక్తికర చర్చకు దారితీసింది. 2026 మహానాడును 'స్త్రీ శక్తి' థీమ్‌తో నిర్వహించాలని టీడీపీ తీసుకున్న నిర్ణయానికి ఈ ప్రతిపాదన మరింత ప్రాధాన్యాన్ని తీసుకువచ్చింది. మహిళల రాజకీయ భాగస్వామ్యాన్ని పెంచడం, నిర్ణయాత్మక స్థానాల్లో వారికి అవకాశాలు కల్పించడం లక్ష్యంగా ఈ నిర్ణయం ఉందని నాయకులు చెబుతున్నారు. మహిళా రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించే అంశంతో సంబంధం లేకుండా పార్టీ అంతర్గత వ్యవస్థలోనే 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని లోకేశ్ ప్రతిపాదించడం విశేషంగా మారింది. రాజకీయాల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా లోకేశ్ ప్రస్తావించారు. టీడీపీ భవిష్యత్తు కార్యాచరణలో మహిళలకు మరింత ప్రాధాన్యం కల్పించేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు. మహానాడు వేదికగా వచ్చిన ఈ ప్రతిపాదనపై రాజకీయ వర్గాల్లో విస్తృత చర్చ కొనసాగుతోంది.

# సంస్కరణలకు,విజన్ పాలిటిక్స్‌కు తెలుగుదేశం నాంది

- టిడిపి పుట్టుక, ప్రయాణం ప్రస్థానం అన్నీ అద్భుతాలే
- పసుపు జెండా తెలుగువారి ఆత్మవిశ్వాసం
- దేశ రాజకీయాలకు దిక్సూచిగా నిలిచిన పార్టీ టిడిపి
- మహిళా రిజర్వేషన్లు సాధించి చరిత్ర తిరగరాస్తాం
- 45 ఏళ్లుగా ప్రజా సమస్యలపై తెదేపా పోరాటం
- మహిళల రక్షణకు అత్యంత ప్రాధాన్యత
- ఈ మహానాడు మహిళలకు అంకితం ఇస్తున్నాం
- 23 నెలల్లో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు
- మహానాడు మోడల్ మారింది తప్ప..విధానం మారలే
- వైసిపి హయాంలో అణచివేతలను ఎదుర్కొని నిలబడ్డాం
- మహానాడు ప్రారంభోపన్యాసంలో టిడిపి అధినేత చంద్రబాబు

అమరావతి,మే27సాక్ష్యం: విజన్ పాలిటిక్స్‌కు తెలుగుదేశం పార్టీ నాంది అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. తెలుగుదేశం పుట్టుక, ప్రయాణం, ప్రస్థానం అన్ని అద్భుతాలేనని... ప్రతి అడుగు సంచలనమేనని పేర్కొన్నారు. బుధవారం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో మహానాడు వేడుకల్లో సీఎం చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు. 1875 క్లస్టర్‌ల వేదికగా ఈసారి మహానాడు జరుగుతోందని సీఎం చంద్రబాబు తెలిపారు. లక్షలాదిమంది కార్యకర్తలు తొలిరోజే అదరగొట్టారని ప్రశంసించారు. పశ్చిమాసియా యుద్ధవాతావరణం మూలంగా మహానాడును వర్చువల్‌గా నిర్వహిస్తున్నామని వెల్లడించారు. 'సమాజమే దేవాలయం – ప్రజలే దేవుళ్లు' అని 44 ఏళ్ల క్రితం పుట్టిన పార్టీ తెలుగుదేశం అని వ్యాఖ్యానించారు. సంక్షేమం, అభివృద్ధి సుపరిపాలనను టీడీపీ పరిచయం చేసిందని ప్రస్తావించారు. జెండర్ ఈ క్వాలిటీ, సామాజిక సమస్యలపై తెలుగుదేశం పోరాడిందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. జాతీయ జెండా దేశానికి గౌరవం.. పసుపు జెండా తెలుగువారి ఆత్మవిశ్వాసమని చంద్రబాబు అన్నారు. రెండ్రోజుల పాటు జరిగే మహానాడు ప్రారంభం సందర్భంగా ఆయనమాట్లాడారు. సంస్కరణలకు, విజన్ పాలిటిక్స్‌కు నాంది తెలుగుదేశమని తెలిపారు. దేశ రాజకీయాలకు దిక్సూచిగా నిలిచిన పార్టీ తెదేపా అని కొనియాడారు. జాతీయ రాజకీయాల్లో కీలకంగా వ్యవహరినీచిన ఏకైక ప్రాంతీయ పార్టీ మనదని గుర్తుచేశారు. మహిళా



రిజర్వేషన్లు సాధించి చరిత్ర తిరగరాస్తామని ధీమా వ్యక్తంచేశారు. కూడు, గూడు నీడ లాంటి సంక్షేమ విధానాలతో తెదేపా ఆవిర్భవించిందని గుర్తు చేశారు. 45 ఏళ్లుగా ప్రజా సమస్యలపై తెదేపా పోరాటం చేస్తూనే ఉ ందన్నారు. దాడులు, హింస, హత్యా రాజకీయాలు, అక్రమ కేసులు, వేధింపులు వచ్చినా ప్రజా పోరాటాలు ఆపలేదని గుర్తుచేశారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నాం. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాం. మహిళల వంటింటి కష్టాలు తగ్గేందుకు నాడు గ్యాస్ కనెక్షన్ ఉచితంగా ఇచ్చాం. నేడు ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. ఆడబిడ్డలకు ఆర్థిక, సామాజిక గౌరవమిస్తున్నాం. ఎన్టీఆర్ హయాంలో మహిళలకు ఆస్తి హక్కు కల్పించాం. తల్లికి వందనం వంటి అనేక పథకాలు అమలు చేస్తున్నాం. మహిళల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాం. ఆడబిడ్డల జోలికి వస్తే అదే చివరి రోజు అని నిరూపించాం. గంజాయి, డ్రగ్స్‌పై అత్యంత కఠినంగా ఉన్నాం. సోషల్ సైకోల తాటతీసి. మహిళల గౌరవాన్ని కాపాడుతాం. నాడు ఒక్క ఐటీనే.. యువత తలరాత మార్చింది. తలసరి ఆదాయం, జీవన ప్రమాణాలు పెరిగాయి. ఏఐ, క్వాంటమ్, డేటా సెంటర్లు వంటివన్నీ రాష్ట్రానికి వస్తున్నాయి. 23 నెలల్లో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు, 23 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. 20 లక్షల మందికి ఉద్యోగాలిస్తామని చెప్పాం. ఎంవోయూలన్నీ పూర్తయితే ఇది సాధ్యమే. ఒకప్పుడు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై మాట్లాడాం. ఇప్పుడు గేర్ మార్చాం.. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై మాట్లాడుతున్నాం. ఏ ప్రాజెక్టు వచ్చినా మాటల్లో కాదు.. చేతల్లో చూపిస్తున్నాం. 288 ప్రాజెక్టులు ప్రారంభించే రోజు కూడా నిర్ణయించేశాం అని సీఎం తెలిపారు. వర్చువల్ మహానాడు కారణంగా వాహనాల హోరు తగ్గిందేమో కానీ... కార్యకర్తల్లో జోరు మాత్రం తగ్గలేదని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. అన్ని క్లస్టర్లను అనుసంధానించి మహానాడును నిర్వహిస్తున్నామని తెలిపారు. యుద్ధం వల్ల మహానాడును హైబ్రిడ్ పద్ధతిలో నిర్వహిస్తున్నామని వివరించారు. మీటింగ్ మోడల్ మారిందే తప్ప.. మహానాడు విధానం మారలేదని అన్నారు. భవిష్యత్తు గురించి అన్ని విషయాలు చర్చించుకుందామని తెలిపారు. కూడు, గూడు, నీడ లాంటి సంక్షేమ విధానాలతో టీడీపీ ఆవిర్భవించిందని ప్రస్తావించారు.

జాతీయ జెండా దేశానికి గౌరవం, పసుపు జెండా తెలుగువారి గౌరవం, ఆత్మవిశ్వాసమని ఉద్ఘాటించారు. ప్రతీ ఒక్కరికీ తెలుగుదేశం జెండా చూస్తేనే నమ్మకం, భరోసా కలుగుతోందని తెలిపారు. నాటికి, నేటికి టీడీపీపై ప్రజలకు ఆదరణ చెక్కు చెదరలేదని చెప్పారు. 45 ఏళ్లుగా ప్రజాసమస్యల కోసం టీడీపీ నిరంతర పోరాటం చేస్తోందని పేర్కొన్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో దాడులు, హింస, హత్యా రాజకీయాలు, అక్రమ కేసులు, వేధింపులు వచ్చినా టీడీపీ నేతలు, కార్యకర్తలు ప్రజా పోరాటాలు ఆపలేదని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. 'వైసీపీ హయాంలో నరహంతకులు పీకలు కోస్తున్నా.. టీడీపీ కార్యకర్తలు తెలుగుదేశం జెండాను వీడలేదు. చంద్రయ్య లాంటి కార్యకర్తను నరుకుతున్నా.. జై చంద్రబాబు, జై తెలుగుదేశం అంటూ నినదించి అమరుడయ్యారు. ఆయన స్ఫూర్తి కలకాలం నిలుస్తోంది. అక్రమంగా నన్ను జైల్లో పెట్టారు, లోకేశ్ యువగళాన్ని అడ్డుకున్నారు. మన నేతలను అరెస్టు చేశారు. బాధితులనే నిందితులుగా చేశారు. అయినా టీడీపీ వెనకడుగు వేయలేదు. ప్రజాస్వామ్యం కోసం టీడీపీ నిలిచిందని అంటూ వివరించారు. ఎన్నికల్లో బీజేపీ, జనసేనతో కలిసి కూటమిగా ఏర్పడి రాష్ట్ర పునర్నిర్మాణం కోసం పనిచేస్తున్నాం. ప్రజలు ఆదరించి, ఆశీర్వదించి రాష్ట్రాన్ని నిలబెట్టే బాధ్యత అప్పగించారు. పాలనలో అగ్రెసివ్‌గా, ప్రోగ్రెసివ్‌గా ముందుకు వెళ్తున్నాం. మహిళా సాధికారిత, సామాజిక, ఆర్థిక రాజకీయ గౌరవం కోసం టీడీపీ పనిచేస్తోంది. ఆస్తి హక్కు నుంచి.. నేడు తల్లికి వందనం వరకూ అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించటంతో పాటు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు సాధించే వరకూ టీడీపీ వారి వెనుక ఉంటుంది. ఒకప్పుడు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌గా మార్చాం. ఇది చూసే నా చిన్నప్పుడు ఇష్టంగా నడిపిన రాయల్ ఎన్‌ఫీల్డ్ కూడా రాష్ట్రానికి వచ్చింది. 1875 ప్రాంతాల్లో మహానాడు హైబ్రిడ్ సమావేశం జరుగుతోంది. ఏ తీర్మానానికి ఎంతమంది ఆమోదం తెలిపారో రియల్ టైంలో వస్తున్నాయి. బెస్ట్ టెక్నాలజీ ప్లస్‌ని ఇక్కడికి తెస్తామని యువతకు విజ్ఞప్తి చేస్తున్నా' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# మోడీ 12 ఏళ్ల పాలనపై పెద్ద ఎత్తున ప్రచారం

- జూన్ 5 నుంచి 21 వరకు వివిధ కార్యక్రమాలు
- మోడీ నాయకత్వంలో ఆర్థికంగా బలపడ్డ భారత్
- జగన్ జనంలో లేకపోవడమే పెద్ద శాపం
- మీడియా సమావేశంలో మంత్రి సత్యకుమార్ యాదవ్

విజయవాడ,మే27సాక్ష్యం: ప్రధాని నరేంద్ర మోదీ దేశ పగ్గాలు చేపట్టి 12 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. మోదీ నాయకత్వంలో దేశం ఆర్థికంగా బలపడిందని, ప్రతి వర్గం అభివృద్ధి చెందేలా అనేక సంస్కరణలు తీసుకొచ్చారని అన్నారు. పేదరిక నిర్మూలన, ఉచిత బియ్యం పంపిణీ, భీమా పథకాలు, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాల ద్వారా ప్రజలకు పెద్ద ఎత్తున ప్రయోజనం కలిగిందన్నారు.

జూన్ 5 నుంచి 21 వరకు వివిధ కార్యక్రమాల ద్వారా మోదీ పాలనలో సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. జూన్ 8 నుంచి 14 వరకు కేంద్ర నిధులతో నిర్మాణం అవుతున్న ప్రాజెక్టులను సందర్శిస్తామని, జూన్ 12 నుంచి 14 వరకు మీడియా సమావేశాల ద్వారా మోదీ ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరిస్తామని తెలిపారు. అలాగే కేంద్ర ప్రభుత్వ పథకాలు, సేంద్రీయ వ్యవసాయం ప్రాముఖ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఎక్స్‌ప్రెస్ హైవేలు, గ్రీన్ కారిడార్లు, రైల్వే అభివృద్ధి పనుల వల్ల ఉద్యోగ అవకాశాలు పెరిగాయని మంత్రి పేర్కొన్నారు. దేశ జీడీపీ గణనీయంగా పెరిగిందని, భారత్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో నాలుగో స్థానానికి చేరుకుందని తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జూన్ 21న ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను భాగస్వామ్యం చేస్తామని చెప్పారు. ప్రపంచ దేశాల్లో భారత్‌కు, ప్రధాని మోదీకి గౌరవం పెరిగిందని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఇకపోతే జనంలో లేకపోవడమే జగన్‌కున్న అసలు సమస్య అని, ఏపీ వ్యాప్తంగా నిరసనలకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ పిలుపునివ్వడంపై మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అసలు జగన్ ఈ నిరసనలు ఎందుకు చేస్తున్నారో ఆయనకైనా స్పష్టత ఉందా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఎలాంటి హామీలనూ అమలు చేయలేదని జగన్ విమర్శిస్తున్నారని, అలా మాట్లాడే ముందు ఆయన క్షేత్రస్థాయి సమాచారాన్ని తెలుసుకోవాలని హితవుపలికారు. విజయవాడలో మీడియాతో మాట్లాడిన సత్యకుమార్, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమ పథకాలను పక్కాగా అమలు చేస్తోందని స్పష్టం చేశారు.ఇందులో భాగంగానే ప్రతి నెలా ఒకటో తారీఖునే లబ్దిదారులకు సామాజిక పింఛన్లు ఇస్తున్నామని, ఇందుకోసం నెలకు దాదాపు 33 వేల కోట్ల రూపాయలను నేరుగా అందిస్తున్నామని తెలిపారు. అలాగే 'అన్నదాత సుఖీభవ' కింద కేంద్ర ప్రభుత్వ పీఎం కిసాన్ నిధులతో కలిపి రాష్ట్రంలోని రైతులకు నిబంధనల ప్రకారం రూ.20,000లను వారి అకౌంట్లలో జమ చేయడం జరిగిందన్నారు. దీంతో పాటూ 'తల్లికి వందనం' కార్యక్రమం ద్వారా ఏడాదికి పదివేల కోట్ల రూపాయలు లబ్దిదారుల ఖాతాల్లోకి వెళ్తున్నాయని వివరించారు. మహిళల కోసం ప్రవేశపెట్టిన 'స్త్రీ శక్తి' ఉచిత బస్సు పథకం ద్వారా ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా మహిళలందరూ రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా ప్రయాణాలు సాగిస్తున్నారని గుర్తుచేశారు. గతంలో కూడా జగన్ ఒక కోటరీని ఏర్పాటు



చేసుకొని, కేవలం వాళ్లు చెప్పిన విషయాలనే వింటూ 'క్లౌడ్ నైన్' లో తిరిగేవారని.. ఇప్పుడు కూడా అదే పరిస్థితి ఉన్నట్టు తనకు అనిపిస్తోందని మంత్రి సత్యకుమార్ యాదవ్ విమర్శించారు. 'పచ్చకామెర్లవాడికి లోకమంతా పచ్చగా కనిపిస్తుంది' అన్న చందంగా జగన్ వైఖరి ఉందన్న సత్యకుమార్.. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగినప్పుడు ఎటువంటి అరాచకాలు జరిగాయో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్నారు. మొన్నటి ఎన్నికల్లోనే రాష్ట్ర ప్రజలు మీ అరాచకాలను చూసి కేవలం 11 సీట్లకే పరిమితం చేశారని గుర్తుచేశారు. ఇక ఎన్నికల సంఘం చేపట్టే 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' ప్రక్రియ గురించి జగన్‌కు కనీస అవగాహన ఉందో లేదో తెలియదని మంత్రి వ్యాఖ్యానించారు. ఇది రాజ్యాంగబద్ధంగా ఎప్పటికప్పుడు జరిగే ప్రక్రియ అని, ఓటర్లు ఎవరికీ అన్యాయం జరగకుండా, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు వచ్చేలా చేసేందుకే ఈ సవరణలు ఉంటాయన్నారు. ఎవరైనా ఓటు మార్చుకోవాలన్నా, డూప్లికేషన్ లేదా దొంగ ఓట్లను తొలగించాలన్నా ఈ ప్రక్రియ ద్వారానే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ఈ బాధ్యతాయుతమైన ప్రక్రియలను పక్కనబెట్టి, అసలు ఆంధ్రప్రదేశ్‌ను పశ్చిమ బెంగాల్‌తో జగన్ ఎందుకు పోలుస్తున్నారో ఆయనకే తెలియాలని మంత్రి సత్యకుమార్ ప్రశ్నించారు.

## అట్టహాసంగా టిడిపి మహానాడు ప్రారంభం

### పార్టీ జెండా అవిష్కరించిన సిఎం చంద్రబాబు

### పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌కు ఘనంగా నివాళి

### హాజరైన పార్టీ ప్రముఖులు, పోలిట్ బ్యూరో సభ్యులు

అమరావతి,మే27సాక్ష్యం: తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న మహానాడు–2026 వేడుకలు అమరావతిలో ఘనంగా ప్రారంభమయ్యాయి. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , పార్టీ జాతీయ వర్కింగ్



ప్రెసిడెంట్, ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పార్టీ కేంద్ర కార్యాలయానికి చేరుకుని మహానాడు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. టీడీపీ జెండాను ఆవిష్కరించి, జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం టీడీపీ వ్యవస్థాపకులు, మాజీ సీఎం నందమూరి తారక రామారావుకు నివాళులు అర్పించారు. ఈసారి మహానాడును పూర్తిగా సాంకేతికత ఆధారంగా వర్చువల్ విధానంలో నిర్వహిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1875 క్లస్టర్లలో 1851 క్లస్టర్లను పార్టీ కేంద్ర కార్యాలయంతో అనుసంధానం చేశారు. ప్రతి నియోజకవర్గం నుంచి ఒక క్లస్టర్‌ను ÷లినీ–చిజా కమ్యూనికేషన్ సిస్టమ్ ద్వారా నేరుగా అనుసంధానిస్తూ నాయకులు, కార్యకర్తలతో మమేకం కానున్నారు. కార్యక్రమాన్ని వీక్షించేందుకు ప్రతి క్లస్టర్‌లో భారీ ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది మహానాడు ప్రత్యేకంగా 'స్త్రీ శక్తి' థీమ్‌తో నిర్వహిస్తున్నారు. మహిళా సాధికారత, పార్టీ నిర్మాణంలో మహిళల పాత్ర, సామాజిక సేవలో మహిళల భాగస్వామ్యంపై ప్రధానంగా చర్చలు జరగనున్నాయి. అదేవిధంగా 'కార్యకర్తే అధినేత, యువగళం, పేదల సేవలో టీడీపీ' వంటి అంశాలపై కూడా కీలక చర్చలు జరుగనున్నాయి. మహానాడులో మొత్తం 10 కీలక తీర్మానాలపై చర్చించి ఆమోదం తెలపనున్నారు. పార్టీ కేంద్ర కార్యాలయానికి పొలిట్‌బ్యూరో సభ్యులు, జాతీయ, రాష్ట్ర కార్యవర్గ ప్రతినిధులు, పలువురు సీనియర్ నేతలు హాజరయ్యారు. ఇప్పటికే మహానాడు కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన పార్టీ శ్రేణులు, పసుపు జెండాలతో కేంద్ర కార్యాలయాన్ని అలంకరించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ మహాసభలను పార్టీ శ్రేణులు 'పసుపు పండుగ'గా అభివర్ణిస్తున్నాయి. ఉదయం 10:40 గంటలకు చంద్రబాబు నాయుడు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తూ ప్రారంభ ఉపన్యాసం ఇచ్చారు. అనంతరం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ ప్రసంగించారు. రాబోయే రాజకీయ వ్యూహాలు, ప్రభుత్వ పనితీరు, పార్టీ బలోపేతం, యువత, మహిళల పాత్రపై పలువురు నేతలు కీలక సందేశాలు ఇచ్చారు. మహానాడు–2026 ద్వారా పార్టీ భవిష్యత్తు కార్యాచరణపై స్పష్టమైన దిశానిర్దేశర ఇవ్వడంతో పాటు, గ్రామస్థాయి కార్యకర్తలతో ప్రత్యక్ష అనుసంధానం పెంచడంపై టీడీపీ హై కమాండ్ ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.

# ఓటరు జాబితా సవరణకు సుప్రీం గ్రీన్ సిగ్నల్!

మొదటిపేజీ తరువాయి..

రద్దు చేయలేమని స్పష్టం చేసింది. మే 30 నుంచి దేశవ్యాప్తంగా మూడో విడత సవరణలు ప్రారంభం కానున్న తరుణంలో అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన ఈ తీర్పు ప్రాధాన్యం సంతరించుకుంది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ కీలక తీర్పును వెలువరించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 326తో పాటు 1950 ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం ఈ తరహా ప్రత్యేక సవరణలు చేపట్టే అధికారం ఎన్నికల సంఘానికి ఉందని కోర్టు స్పష్టం చేసింది. ఈ ప్రత్యేక సవరణ ద్వారా ఓటరు జాబితా పారదర్శకతను పెంచొచ్చని, ఇది రాజ్యాంగం నిర్దేశించిన ఉచిత, పక్షపాతరహిత ఎన్నికల లక్ష్యానికి లోబడే ఉందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ ప్రత్యేక సవరణ ప్రక్రియ ప్రస్తుతం ఉన్న ఎన్నికల చట్టాలను ఎక్కడా అతిక్రమించడం లేదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 21(3) పరిధిలోనే ఎన్నికల సంఘం తన విధులను నిర్వర్తించిందని, అందువల్ల అధికారులు తమ పరిధి దాటి ప్రవర్తించారని చెప్పలేమని కోర్టు తేల్చిచెప్పింది. తొలుత బిహార్‌లో ప్రారంభమైన ఈ విధానాన్ని ఆ తర్వాత ఎన్నికల సంఘం ఇతర రాష్ట్రాలకు కూడా విస్తరింపజేసింది.కొన్ని నెలలుగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై ఎన్నికల సంఘానికి, ప్రతిపక్ష పార్టీలకు మధ్య తీవ్ర స్థాయిలో వివాదం నడుస్తోంది. ఈ సవరణల వల్ల అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోతున్నాయని విపక్షాలు ఆరోపిస్తూ వచ్చాయి. అయితే తాజాగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో ఈ వివాదానికి తెరపడినట్లయింది. మే 30 నుంచి 16 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో చివరి విడత ఓటరు వెరిఫికేషన్ ప్రక్రియ యథావిధిగా సాగనుంది.

## స్టెల్త్ ఫైటర్ జెట్ ప్రాజెక్టు రేసులో 3 ప్రైవేట్ దిగ్గజాలు!

న్యూఢిల్లీ,మే27(సాక్ష్యం): భారత వాయుసేన సామర్థ్యాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే ఐదో తరం స్వదేశీ స్టెల్త్ యుద్ధ విమానం అమ్కా అభివృద్ధిలో కీలక అడుగు పడింది. ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు రక్షణ మంత్రిత్వ శాఖ అధికారికంగా రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ జారీ చేసింది. ఇప్పటివరకు ప్రభుత్వ రంగానికే పరిమితమైన యుద్ధ విమానాల తయారీని, మోదీ ప్రభుత్వం తొలిసారిగా ప్రైవేట్ రంగానికి అప్పగించబోతోంది. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్‌ను పక్కన పెట్టి ప్రైవేట్ రంగానికి కేంద్రం పెద్దపీట వేసింది. అత్యంత ప్రతిష్టాత్మకమైన 15 వేల కోట్ల విలువైన ఈ మెగా ప్రాజెక్ట్ రేసులో మూడు ప్రైవేట్ దిగ్గజాలు నిలిచాయి. శత్రువుల రాడార్లకు చిక్కకుండా దాడి చేయగల అత్యంత అధునాతన స్టెల్త్ యుద్ధ విమానాన్ని సొంతంగా తయారుచేసుకునేందుకు భారత్ వేగంగా అడుగులు వేస్తోంది. ఇప్పటివరకు దేశంలో తేజస్ వంటి ఫైటర్ జెట్లను ప్రభుత్వ రంగ సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ మాత్రమే తయారు చేస్తూ వచ్చింది. కానీ, అమ్కా ప్రాజెక్ట్ నుంచి నాహానుు పక్కన పెట్టి, ప్రైవేట్ రంగానికి రక్షణ శాఖ పెద్దపీట వేసింది. మొత్తం 7 కంపెనీలు పోటీ పడగా, సాంకేతిక పరిశీలన అనంతరం మూడు ప్రైవేట్ సంస్థలను ప్రభుత్వం షార్ట్‌లిస్ట్ చేసింది. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, ఎల్ అండ్ టీ – బెల్ కన్సార్టియం, భారత్ ఫోర్జ్ – బిఇఎంఎల్ కూటమి ఇందులో ఉన్నాయి. ఈ మూడు సంస్థలకు రక్షణ శాఖ టెండర్ పత్రాలను అందించింది. రాబోయే 2–3 నెలల్లో ఇవి తమ తుది బిడ్లను దాఖలు చేయాల్సి ఉంటుంది. 2027 మార్చి నాటికి కాంట్రాక్ట్ ఎవరికి దక్కుతుందనేది ఖరారు కానుంది. ఈ ఐదో తరం యుద్ధ విమానంలో రెండు ఇంజన్లు ఉంటాయి. ఇది సింగిల్ సీటర్. అంతర్గతంగా 1500 కిలోలు, బాహ్యంగా 5,500 కిలోల ఆయుధాలను ఇది మోసుకెళ్లగలదు. ఇంధన సామర్థ్యం 6,500 కిలోలు. 55,000 అడుగుల ఎత్తులో ఇది ప్రయాణించగలదు. ఈ ప్రాజెక్ట్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు భారీ పారిశ్రామిక ప్రాధాన్యం దక్కబోతోంది. టెండర్ గెలుచుకున్న ప్రైవేట్ భాగస్వామి ఆంధ్రప్రదేశ్‌లోని పుట్టపర్తిలో కొత్తగా ఏర్పాటు చేయబోయే 650 ఎకరాల గ్రీన్‌ఫీల్డ్ ఫెసిలిటీలో ఈ యుద్ధ విమానాల నమూనాలను తయారు చేయాల్సి ఉంటుంది. పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులు 15 వేల కోట్లతో ఈ ప్రాజెక్ట్ నడుస్తుంది. ఇ=ఇూ పరిధిలోని ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ పర్యవేక్షణలో ప్రైవేట్ సంస్థ 5 అధునాతన యుద్ధ విమాన నమూనాలను, ఒక స్ట్రక్చరల్ టెస్ట్ ఎయిర్‌క్రాఫ్ట్‌ను ఇక్కడే నిర్మిస్తుంది. అమ్కా అనేది కేవలం ఒక యుద్ధ విమానం కాదు, భారత వైమానిక దళానికి వెన్నుముక కాబోయే అస్త్రం. శత్రువుల రాడార్ల కళ్లు కప్పి లోపలికి దూసుకెళ్లేలా దీనికి ప్రత్యేక 'స్టెల్త్ కోటింగ్, ఆయుధాలు లోపలే దాగి ఉండేలా అమరుస్తున్నారు.

# పిట్టకాయగుల్ల గిరిజన కుటుంబాలలో గాలివానతో విధ్వంసం

**రోడ్డున పడ్డ ఎస్టీ కుటుంబాలు,నత్తనడక సహాయ చర్యలు**
**తహసీల్దార్ సందర్శనతో సరిపెట్టిన అధికార యంత్రాంగం**
**ఇప్పటికీ మౌలిక వసతులు కరువు,పీపఎఫ్ ఇండియా ఆగ్రహం**

మార్కాపురం జిల్లా బ్యూరో, సాక్ష్యం: ఇటీవల వీచిన పెనుగాలులతో కూడిన వర్షానికి బేస్తవారిపేట మండలం పిట్టకాయగుల్ల గ్రామ సమీపంలోని ఎస్టీ కాలనీ పూర్తిగా నాశనమైంది.గాలివాన దెబ్బకు పూరి గుడిసెల పై కప్పులు గాల్లోకి ఎగిరిపోయాయి.పలు నివాసాలు పూర్తిగా నేలమట్టమయ్యాయి.దీంతో నిరుపేద ఎస్టీ కుటుంబాలు కట్టుబట్టలతో బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నాయి. ఘటన జరిగి రెండు రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు తాత్కాలిక షెల్టర్ కానీ, తాగునీరు,ఆహారం వంటి మౌలిక సదుపాయాలు కానీ సమకూరలేదని గిరిజన బాధితులు వాపోతున్నారు. బాధితుల దుస్థితి పై పీపుల్స్ యాక్షన్ ఫోరం ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు కొత్తపల్లి విజయకుమార్ తీవ్రంగా స్పందించారు. వెంటనే శాశ్వత పరిష్కారం చూపాలని,పక్కా గృహాలు,ఇంటి స్థలాల పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్‌కు ఇప్పటికే పలుమార్లు వినతిపత్రం అందజేశారు.ఈ యొక్క వినతిపత్రాల పై



స్పందించిన మార్కాపురం జిల్లా కలెక్టర్ విజయ సునీత హుటాహుటిగా సంబంధిత పలు శాఖల అధికారులకు ఇచ్చిన ఆదేశాలతో మంగళవారం బేస్తవారిపేట మండల తహసీల్దార్ జితేంద్ర,ఆయా సిబ్బందితో కలిసి పిట్టకాయగుల్ల ఎస్టీ కాలనీని స్వయంగా సందర్శించారు. దెబ్బతిన్న గుడిసెలను పరిశీలించి,బాధిత కుటుంబాల వివరాలు సేకరించారు.రెండు రోజుల్లో నివేదిక పంపాలని వీఆర్వోను ఆదేశించి,"అర్హులందరికీ ఇంటి స్థలాలు ఇప్పిస్తాం " అని బాధిత కుటుంబాలకు ఆయన హామీ ఇచ్చి వెళ్లిపోయారు. అయితే అధికారులు కేవలం సందర్శనలకు, హామీలకే పరిమితమవుతున్నారని, క్షేత్రస్థాయిలో సహాయ చర్యలు మాత్రం నత్తనడకన సాగుతున్నాయని పీఏఎఫ్ ఇండియా నాయకులు మండిపడుతున్నారు. "ఘటన జరిగి రెండు రోజులు అవుతున్నా ఇప్పటివరకు ఒక్క టార్పాలిన్ కూడా ఇవ్వలేదు.పిల్లలు,వృద్ధులు ఆరుబయట నిద్రపోతున్నారు.తాగునీటికి కూడా కిలోమీటర్ దూరం వెళ్లాలి.సందర్శనలు కాదు,సత్వరం చర్యలు కావాలి " అని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా పీఏఎఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు కొత్తపల్లి విజయకుమార్ మాట్లాడుతూ " అధికారులు స్పందిస్తున్నారు కానీ బాధితులకు మౌలిక సదుపాయాల కల్పనలో తీవ్ర జాప్యం జరుగుతోంది.ఇది ఆమోదయోగ్యం కాదు.వెంటనే తాత్కాలిక షెడ్లు,మంచినీటి సరఫరా,ఆహార పంపిణీ చేపట్టాలి.పక్కా ఇళ్లు,ఇంటి స్థలాల పట్టాల ప్రక్రియను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి. సమస్య పూర్తిగా పరిష్కారం అయ్యేవరకు పీపుల్స్ యాక్షన్ ఫోరం ఇండియా ఎస్టీల పక్షాన పోరాడుతుంది " అని ఆయన రాష్ట్ర ప్రభుత్వ పరిపాలన యంత్రాంగానికి హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పీఏఎఫ్ రాష్ట్ర మీడియా ఇన్చార్జి కంచర్ల నాగేశ్వరరావు గౌడ్,ఇండియా జిల్లా కార్యదర్శి బింగి బుజ్జి,నియోజకవర్గ ఇంచార్జి వినుకొండ ప్రభాకర్,పూసలపాటి కేశవ పాల్,యువ నాయకుడు చాట్ల పవన్,కాకర్ల పాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ సతర్క్ – నార్కోస్‌లో ఆర్పీఎఫ్ ఘన విజయం

**రూ.1.22 కోట్ల అక్రమ నగదు స్వాధీనం.. రూ.41.5 లక్షల గంజాయి రాకెట్ ఛేదన**

సికింద్రాబాద్, మే 27 (సాక్ష్యం): దక్షిణ మధ్య రైల్వేకు చెందిన రైల్వే రక్షణ దళం (ఆర్‌పీఎఫ్) 'ఆపరేషన్ సతర్క్', 'ఆపరేషన్ నార్కోస్' కింద చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో విశేష



ఫలితాలు సాధించింది. మే 25, 26 తేదీల్లో నిర్వహించిన ఈ ఆపరేషన్లలో భారీ మొత్తంలో అక్రమ నగదు, మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు నిందితులను అదుపులోకి తీసుకుంది. 'ఆపరేషన్ సతర్క్'లో భాగంగా హైదరాబాద్ డివిజన్ ఆర్పీఎఫ్ సిబ్బంది రైలు నం.17057 దేవగిరి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేశారు. క్లెయిమ్ ప్రివెన్షన్ అండ్ డిటెక్షన్ స్క్వాడ్ (సీపీడీఎస్) అధికారులు అతని ప్రవర్తనలో అసాధారణతను గమనించి తనిఖీలు నిర్వహించగా, రెండు సంచుల్లో రూ.1,22,70,000 విలువైన లెక్కచూపని నగదు లభ్యమైంది. ప్రాథమిక విచారణలో ఈ నగదును ముంబై జవేరీ బజార్ నుంచి సికింద్రాబాద్‌కు తరలిస్తున్నట్లు గుర్తించారు. అనంతరం నగదు, అనుమానితుడిని తదుపరి విచారణ నిమిత్తం జీఆర్పీకి అప్పగించారు. ఈ విషయాన్ని ఆదాయపు పన్ను శాఖ, ఇంటెలిజెన్స్ బ్యూరో దృష్టికి కూడా తీసుకెళ్లారు. ఐసీజేఎస్, ఆర్పీఎఫ్ సైబర్ సెల్ ద్వారా డిజిటల్ విశ్లేషణ కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.ఇక 'ఆపరేషన్ నార్కోస్'లో భాగంగా హైదరాబాద్ డివిజన్ ఆర్పీఎఫ్ మరో కీలక విజయాన్ని నమోదు చేసింది. రైలు నం.20809 నాగావళి ఎక్స్‌ప్రెస్‌లో సాధారణ నిఘా తనిఖీల సమయంలో ఓ ప్రయాణికుడి అనుమానాస్పద ప్రవర్తనను



గమనించిన సీపీడీఎస్ బృందం తనిఖీలు చేపట్టింది. ప్రారంభంలో వ్యక్తిగత తనిఖీగా ప్రారంభమైన ఈ చర్య, భారీ అంతర్రాష్ట్ర మాదకద్రవ్యాల ముఠా బట్టబయలుకి దారి తీసింది. మొదట నిందితుడి వద్ద నుంచి రూ.24 లక్షల విలువైన 48 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న అధికారులు, విచారణలో అతడు పెద్ద ముఠాకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. వెంటనే నిఘా సమాచారాన్ని విస్తరించి, చర్లపల్లిలో సమాంతర ఆపరేషన్ నిర్వహించారు. సీసీటీవీ ఫుటేజ్ విశ్లేషణ, కదలికల ట్రాకింగ్ ఆధారంగా మరో ముగ్గురు నిందితులను, వారిలో ఒక మహిళను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఈ ఆపరేషన్‌లో మొత్తం రూ.41.5 లక్షల విలువైన 83 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, నలుగురు నిందితులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్ సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ దేబాష్మిత సి బెనర్జీ మాట్లాడుతూ, సంఘటిత నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై సమాచార ఆధారిత పోలీసింగ్, సాంకేతిక నిఘా, ప్రవర్తనా విశ్లేషణలతో ఆర్పీఎఫ్ చర్యలు మరింత బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ఆర్పీఎఫ్ సిబ్బంది పనితీరును అభినందిస్తూ, నిఘా ఆధారిత పోలీసింగ్ ద్వారా రైల్వే నెట్వర్క్ భద్రతకు కొత్త ప్రమాణాలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు.

# కల్లాల్లో కల్లోలం

మొదటిపేజీ తరువాయి..

వాతావరణ శాఖ ప్రజలను అప్రమత్తం చేసింది. ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే ధాన్యం తడిసిపోయి నష్టపోతున్నామని రైతులు ఆరోపించారు. డిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెక్కలు ముక్కలు చేసుకొని, అప్పులు జేసి ఇంటిల్లిపాది ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తే.. అన్నదాతలకు చివరకు కన్నీళ్లే మిగిలాయి. ప్రభుత్వ నిర్లక్ష్యంతో కాంటా పెట్టాల్సిన వడ్లు అకాల వర్షాలకు కండ్ల ముందే నీళ్లలో కొట్టుకుపోతుంటే రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. అష్టకష్టాలు పడి రైతులు కష్టాలను దిగమింగుకొని ధాన్యపు సిరులు పండించారు. పుట్లకొద్దీ పండిస్తే ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా, ధాన్యం కొనుగోలు చేయకపోవడం, అరకొరా కొన్నా కాంటాలు పెట్టకపోవడం, నెలల తరబడి గన్నీ సంచులు అందక, మద్దతు ధర లభించక, తరుగు పేరుతో మిల్లర్ల దోపిడీ, తీరా కాంటాలు పెట్టాక లారీల కొరతతో లోడింగ్ చేయకపోవడంతో కల్లాల్లోనే ధాన్యం పంటలు తడిసి ముద్దయ్యింది. సకాలంలో కొనుగోలు చేసి ఉంటే తమకు నష్టం జరిగేది కాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరతో కొనాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు. మెదక్ జిల్లాలో ఈదురు గాలులు బీభత్సం సృష్టించింది. మంగళవారం రాత్రి నుంచి ఈదురు గాలులతో భారీ వర్షం పడడంతో కొనుగోలు కేంద్రాల్లో ఉన్న వరి ధాన్యం వర్షానికి తడిసిపోయింది. ఈదురు గాలులు భారీగా వీచడంతో చెట్లు కరెంటు స్తంభాలు కూలిపోయాయి. మెదక్ జిల్లాలోని మెదక్, హవేలీ ఘనాపూర్, పాపన్నపేట, కుల్చారం, కౌడిపల్లి, చిలిపిచెడ్, చిన్న శంకరంపేట్, రామాయంపేట, చేగుంట తో పాటు పలు మండలాల్లో కల్లాల్లోని ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో దాన్యం బస్తాలు తడిచిపోవడంతో రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. ప్రభుత్వం సకాలంలో ధాన్యం కొని ఉంటే తమకు నష్టం జరిగేది కాదని రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. కొన్నిచోట్ల వడ్ల కుప్పలు ఉండగా మరికొన్ని చోట్ల వరి ధాన్యం బస్తాలో నింపించారు. కాంటజేసిన లారీలు సకాలంలో రాకపోవడంతో ధాన్యం బస్తాలు కొనుగోలు కేంద్రాలలో నిలువ చేశారు. అకాల వర్షానికి వరి ధాన్యం తడిచిపోవడంతో తమకు తీవ్ర నష్టం జరిగిందని రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు.

## రెవెన్యూ శాఖలో పలువురు బదిలీ

మొదటిపేజీ తరువాయి..

సంబంధించిన పూర్తి నివేదికను, అధికారులు విధుల్లో చేరిన వివరాలను ప్రభుత్వానికి తక్షణమే సమర్పించాలని భూపరిపాలన ప్రధాన కమిషనర్ తో పాటు సంబంధిత జిల్లా కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. ఉత్తర్వుల ప్రకారం బదిలీ అయిన వారిలో నిర్మల్ తహశీల్దార్ మోతీరామ్ ఎ. ను మంచిర్యాల డీఆర్ఓగా, కరీంనగర్‌కు చెందిన బి. రాజేశ్వరిని పెద్దపల్లి డీఆర్ఓగా, పెద్దపల్లికి చెందిన కె.వై. ప్రసాద్‌ను జగిత్యాల డీఆర్ఓగా నియమించారు. అలాగే వనపర్తి నుంచి ఆర్. పాండును నాగర్‌కర్నూల్ డీఆర్ఓగా, ఖమ్మం నుంచి వి. రవికుమార్‌ను ములుగు డీఆర్ఓగా, మేడ్చల్–మల్కాజిగిరి నుంచి జె. స్వామిని కరీంనగర్ డీఆర్ఓగా, నాగర్‌కర్నూల్ నుంచి ఎ. పాండును కామారెడ్డి డీఆర్ఓగా బదిలీ చేశారు. వీరితో పాటు జనగామ తహశీల్దార్ సిహెచ్. శ్రీకాంత్‌ను మహబూబ్‌నగర్ స్పెషల్ కలెక్టర్ పీఏగా నియమించగా, ఎం. సుదర్శన్ రెడ్డి (సూర్యాపేట) ను సిద్దిపేట ఎస్డీసీగా, ఎం. రమాదేవి (ఖమ్మం) ను నల్గొండ ఎస్డీసీగా, జి. కుమారస్వామి (పెద్దపల్లి) ను సిరిసిల్ల ఎస్డీసీగా , ఎన్. వెంకట్ రెడ్డి (కరీంనగర్) ను కరీంనగర్ ఎస్డీసీ (ఎల్ఏ) గా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

## సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అదనపు పని వేళలు

మొదటిపేజీ తరువాయి..

ఇబ్బందులు కలగకుండా స్లాట్ బుకింగ్‌ల సంఖ్యను కూడా పెంచాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అవసరమైతే మరికొన్ని రోజులు కూడా అదనపు సేవలు కొనసాగించే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. రిజిస్ట్రేషన్ పక్రియలో వేగం, పారదర్శకత పెంచడంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. అలాగే తహసీల్దార్ కార్యాలయాలతో సమన్వయం పెంచి, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సౌకర్యమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

## పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ

మొదటిపేజీ తరువాయి..

వీచే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు హైదరాబాద్ సహా పలు జిల్లాలకు అలర్ట్ జారీ చేశారు. జనగామ, మహబూబ్‌నగర్, మేడ్చల్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో రానున్న మూడు గంటల్లో వర్షాలు కురవనున్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అలాగే రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలకు ఈదురుగాలుల



హెచ్చరికలు జారీ చేశారు. ఈ మేరకు ఆయా జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెలుగు రాష్ట్రాల్లో రెండు, మూడు రోజులుగా ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. కొన్ని నెలలుగా ఎండలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఇది ఉపశమనం కలిగించినట్లు అయ్యింది. మరోవైపు అకాల వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వర్షాల దృష్ట్యా రైతులు అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధికారులు సూచిస్తున్నారు. వాతావరణ శాఖ పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలులపై అలర్ట్‌గా ఉండాలని దిశానిర్దేశం చేశారు. ప్రత్యేకంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అదనపు ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా చూడాలని అధికారులకు మార్గనిర్దేశం చేశారు. కల్లాల్లో నిల్వ ఉంచిన ధాన్యం వర్షానికి తడవకుండా అవసరమైన టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని సీఎం సూచించారు. ఇప్పటికే కొనుగోళ్లు పూర్తయిన కేంద్రాల నుంచి టార్పాలిన్లను ఇతర అవసరమైన ప్రాంతాలకు తరలించాలని పేర్కొన్నారు. రైతుల ధాన్యం భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు. అలాగే వాతావరణ కేంద్రం బలమైన ఈదురుగాలుల హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో అధికారులు వెంటనే స్పందించేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు అవసరం లేకుండా బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

# త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమం

మొదటిపేజీ తరువాయి..

పొన్నం ప్రభాకర్, అజహరుద్దీన్‌తో కలిసి పొంగులేటి మీడియా సమావేశం నిర్వహించారు. తొలిదశలో హైదరాబాద్‌లో లక్ష ఇళ్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. దీనికి అవసరమైన కార్యాచరణ కోసం క్షేత్రస్థాయిలోకి వెళ్లాం. 13 చోట్ల స్థలాలు పరిశీలించాం. జీహెచ్‌ఎంసీలో స్థలం కొరతతో 18వేల ఇళ్లే ఇచ్చాం. పేదల ఇళ్ల కోసం విలువైన ప్రభుత్వ భూములను కేటాయిస్తున్నాం. జీవనోపాధికి అనుగుణంగా ఉండే ప్రాంతాల్లో, నివాసయోగ్యమైన ప్రదేశాల్లో ఇళ్లు నిర్మించి ఇస్తాం అని వివరించారు. పేదల ఆలోచనలు, సూచనలకు అనుగుణంగానే యుద్ధ ప్రాతిపదికన ఇళ్లు నిర్మిస్తాం. ఒక్క రూపాయి ఫీజు కూడా తీసుకోకుండా మహిళల పేరుమీద రిజిస్ట్రేషన్ న్ చేస్తాం. సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఇళ్ల పంపిణీ జరుగుతుంది. బీఆర్ఎస్ ప్రభుత్వం నియోజకవర్గానికి 10 ఇళ్లు కూడా నిర్మించలేదు. మా ప్రభుత్వం వచ్చాక ఒక్కో నియోజకవర్గానికి 3,500కు పైగా ఇళ్లు ఇచ్చాం. రెండో విడతలో 2వేల ఇళ్లు కేటాయిస్తాం అని పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇదిలావుంటే ఇందిరమ్మ ఇళ్లపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు, తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం హైదరాబాద్‌లో సవాల్ విసిరారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిర్మించిన ఇళ్ల కంటే ఎక్కువ కడితేనే తాను వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. లేదంటే ఎమ్మెల్యేగా కూడా పోటీ చేయనని పేర్కొన్నారు. మీకంటే ఎక్కువ ఇళ్లు నిర్మిస్తే.. మీరు పోటీకి దూరంగా ఉంటారా? అంటూ కేటీఆర్‌ను పొంగులేటి శ్రీనివాసరెడ్డి సవాల్ విసిరారు. వీరిద్దరి మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. తెలంగాణ రాజధాని హైదరాబాద్ మహానగరంలో ఒక్క ఇందిరమ్మ ఇల్లు కట్టినట్లు నిరూపించినా.. తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ సవాల్ విసిరారు. ఈ సవాల్‌పై మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ట్విట్టర్ వేదికగా స్పందించారు.




మే 23వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో హైదరాబాద్‌లోని మూడు కార్పొరేషన్ల పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చిన తొలి రెండున్నర ఏళ్లలోనే రాష్ట్రంలో 4.5 లక్షల ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు. ఇందిరమ్మ పాలన అంటే ఏమిటో గ్రామాల్లోకి వెళ్లి ఆ ఇళ్లు కట్టుకున్న కుటుంబాలను అడిగితే తెలుస్తుందని కేటీఆర్‌కు ఆయన స్పష్టం చేశారు. ఫామ్‌హౌస్‌లలో ఉంటే ఏం తెలుస్తుందంటూ కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి చురకలంటించారు. అలాగే జూన్ 1వ తేదీన మరో 2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టనున్నారని వివరించారు. అసెంబ్లీ ఎన్నికల నుంచి నిన్న మొన్నటి వరకు జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటిందని కేటీఆర్‌కు పొంగులేటి గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు వీఆర్ఎస్ ఇచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని కేటీఆర్‌కు పొంగులేటి స్పష్టం చేశారు. దాంతో మీరు ప్రత్యేకంగా రాజకీయ సన్యాసం తీసుకోనక్కర్లేదరటూ కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి వ్యంగ్యంగా అన్నారు.

# పిడుగు పడి మృతిచెందిన తిప్పారపు నాగరాజు

– కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే జీఎస్సార్

**(సాక్ష్యం) న్యూస్ రేగొండ , మే 27 :** పిడుగు పడి మృతిచెందిన తిప్పారపు నాగరాజు కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే జీఎస్సార్. భూపాలపల్లి నియోజకవర్గంలోని రేగొండ మండలం లింగాల గ్రామంలో మంగళవారం నాడు తిప్పారపు నాగరాజు అనే వ్యవసాయ కూలీ వ్యవసాయ పనుల నిమిత్తం పొలం దగ్గరకి వెళ్లి పని చేస్తుండగా పిడుగు పడి ప్రమాద వశాత్తు మృతి చెందడం జరిగింది. ఇట్టి విషయం తెలుసుకున్న భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు వారి ఇంటికి వెళ్లి నాగరాజు మృతదేహానికి పూల మాల వేసి నివాళులు అర్పించినారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటువంటి సంఘటన జరగడం చాలా దురదృష్టకరం. నాగరాజు కుటుంబానికి




ప్రభుత్వం నుండి సహకారాలు అందిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట స్థానిక ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబాన్ని పరామర్శించిన

# టీపీసీసీ మాజీ సెక్రెటరీ బిల్లా సుదీర్ రెడ్డి

**రాయపర్తి, మే 27 (సాక్ష్యం):** రాయపర్తి మండల కేంద్రంలోనీ ఎస్సీ కాలనికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు గౌరీ ఉప్పలయ్య ఇటీవల మరణించగా పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి ల ఆదేశాల మేరకు టిపిసిసి మాజీ సెక్రెటరీ బిల్లా సుదీర్ రేడ్డి, కాంగ్రెస్ మండల నాయకులు బుధవారం ఉప్పలయ్య చిత్రపటానికి నివాళు లర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించినారు. ఈ కార్యక్రమంలో బిళ్ళ సుదీర్ రెడ్డి వెంట మండల కాంగ్రెస్ పార్టీ నాయకుడు, ఆకుల సురేందర్ రావు, రాయపర్తి గ్రామ శాఖ అధ్యక్షుడు ఉప సర్పంచ్ మచ్చ రమేష్, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు మాచర్ల ప్రభాకర్, వర్ధన్నపేట ఏఎంసి మాజీ వైస్ చైర్మన్ ఎండి నయీమ్, మండల పార్టీ నాయకులు రామారావు, కుంట మధు, రాయపర్తి పట్టణ యూత్ అధ్యక్షుడు పీరని ప్రవీణ్, గౌరీ ఎల్లయ్య,





గౌరీ ఉప్పలయ్య, ఐత శివ, పరుశురామ్, తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

# దుర్గమ్మ గుడికి మైక్ సెట్ బహుకరణ

– దాతృత్వం చాటుకున్న ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి

**రాయపర్తి, మే 27(సాక్ష్యం):** రాయపర్తి మండలం బురాన్ పల్లి గ్రామం నాను తండా కు చెందిన స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు మైక్ సెట్ కోసం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకు విన్నవించగా ఆయన ఆదేశాలతో దుర్గమ్మ పండుగ వేడుకలకు మైక్ సెట్ ను ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి బహుకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాయపర్తి మండల పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి పూస మధు, మండల పార్టీ నాయకులు కర్ర రవీందర్ రెడ్డి, లేతకుల రంగా రెడ్డి, గజావెల్లి



ప్రసాద్, పుల్ల ఎల్లగౌడ్, సోమన్న స్థానిక నాయకులు అయిన మాజీ సర్పంచ్ గొల్లపల్లి రమేష్, కిషన్, దేవా, తండా పెద్ద మనుషులు, తదితరులు పాల్గొన్నారు.

# పండుగలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి

– సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత

**హనుమకొండ 27 మే (సాక్ష్యం)** శాంతియుత వాతావరణంలో పండుగలను ప్రజలు ఆనందంగా జరుపుకోవాలని సెంట్రల్ జోన్ డీసీపీ తెలిపారు. బక్రీద్ పండుగ సందర్భంగా బుధవారం వరంగల్ కమిషనరేట్ కార్యాలయంలో మతపెద్దలతో పీస్ కమిటీ మీటింగ్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా స్వేచ్ఛాయుత





వాతావరణంలో ప్రశాంతంగా పండగలను ప్రతి ఒక్కరూ జరుపుకోవాలని డీసీపీ ఆకాంక్షించారు. ప్రజలంతా పండుగలను మతసామరస్యంతో జరుపుకునే విధంగా ఆయా మతాల పెద్దలు ప్రజల్లో సమన్వయం ఏర్పడేలా చేయాలన్నారు. పండుగ ఏ మతానిది అయిన సామరస్యత చాలా మంచి సంబంధాలను పెంపొందిస్తుందన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా శాంతియుత వాతావరణంలో జరిగేలా మత పెద్దలు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే అసాంఘిక శక్తులపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని, ఎవరైనా గొడవలు సృష్టించేలా వ్యవహరిస్తే వెంటనే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో కాజీపేట, హన్మకొండ ఏసీపీలు ప్రశాంత్ రెడ్డి, నర్సింహారావు తో పాటు సెంట్రల్ జోన్ పరిధిలోని ఇన్స్ స్పెక్టర్లు అన్ని మతాల పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పీపీసీ సెంటర్లను సందర్శించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్, 27 మే(సాక్ష్యం)** బుదవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద నర్సంపేట మండలంలోని మక్దుంపురం, పాత మక్దుంపురం, జోజిపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన పీపీసీ సెంటర్లను సందర్శించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ, రైతులకు అందుతున్న సౌకర్యాలు, తూకం, రవాణా ఏర్పాట్లు తదితర అంశాలను పరిశీలించారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం తరలింపులో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని, రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడాలని సూచించారు. ఈ సందర్భనలో నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, డీసీఓ నీరజ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన బీజేపీ నాయకులు

**భూపాలపల్లి ,మే 27.( సాక్ష్యం) న్యూస్** రైతు గోస బీజేపీ భరోసా యాత్ర భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూరు రైతు వేదిక వద్ద వరి ధాన్యం కొనుగోలు కేంద్రం చేరుకొని అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన బిజెపి పార్టీ నాయకులు రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్న బీజేపీ పార్టీ నాయకులు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఐకేపీ కేంద్రాల వద్ద రైతులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ట్రార్పాలిన్ , గన్ని సంచులు సకాలంలో రైతులకు అందివ్వాలి తేమ పేరుతో రైతులను ఇబ్బంది పెట్టకుండా ధాన్యానికి మద్దతు ధర కల్పించి కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే రైతుల నుండి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని వారు



డిమాండ్ చేశారు పౌరసరఫరాల శాఖ మంత్రి శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి రెండు రోజుల్లో రైతు భరోసా యాత్ర ముగుస్తుంది రైతుల ఇచ్చిన హామీలను అలాగే ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నిలువ ఉన్న ధాన్యం ఎంత మీరు కొన్న ధాన్యం ఎంత అన్ని విషయాలపై హైదరాబాద్ లో మేము చర్చకు సిద్ధం మీరు చర్చలకు రండి ఎక్కడైనా చర్చించడానికి మేము సిద్ధం అని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఎంపీలు ఈటెల రాజేందర్, రఘునందన్ రావుఎమ్మెల్యేలు పైడి రాకేష్ రెడ్డి, కాటిపల్లి వెంకట రమణా రెడ్డి , రామారావు పటేల్ ఎమ్మెల్సీ అంజి రెడ్డి కిసాన్ మూర్చ రాష్ట్ర అధ్యక్షులు బసవ తారక రావు రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భూపాలపల్లి ఇంచార్జి చందుపట్ల కీర్తి రెడ్డి,జిల్లా అధ్యక్షులు నిషిదర్ రెడ్డి పాపన్న అరుణ్ రావు రాకేష్ రెడ్డి దొంగల రాజేందర్ కన్నం జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యాన్ని ఆలస్యం లేకుండా మిల్లులకు తరలించాలి

– కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు

**ఏటూరునాగారం, మే 27, (సాక్ష్యం) :** రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. బుధవారం ములుగు జిల్లాలోని ప్రతీ మండలం గ్రామంలోని పి.ఏ.సి.ఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిస్థితి జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి. హెచ్. మహేందర్ జి తో కలిసి ఆయన దాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న ధాన్యం సేకరణ ప్రక్రియ, రైతులకు అందుతున్న సౌకర్యాలు, ధాన్యం తూకం విధానం, తేమ శాతం నమోదు, రికార్డుల నిర్వహణ, ధాన్యం నిల్వ విధానం తదితర అంశాలను జిల్లా కలెక్టర్ క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు



తాగునీరు, నీడ, వంటి మౌలిక సౌకర్యాలు తప్పనిసరిగా కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం, జాప్యం చోటు చేసుకోకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని నాణ్యత ప్రమాణాల ప్రకారం వేగంగా కొనుగోలు చేసి, కొనుగోలు అనంతరం ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అకాల వర్షాలను దృష్టిలో ఉంచుకొని కొనుగోలు కేంద్రాల్లో తగిన టార్పాలిన్లు, కవర్లు సిద్ధంగా ఉంచాలని, ధాన్యం తడవకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వర్షం కారణంగా రైతులు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, రైతులకు డబ్బుల చెల్లింపులు సమయానికి జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులు ఎటువంటి మధ్యవర్తుల పై ఆధారపడకుండా నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకురావాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రైతులు ఇబ్బందులు పడకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డిఎం క్రిష్ణవేణి,సంబంధిత శాఖల అధికారులు, పి.ఏ.సి.ఎస్ ప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, కొనుగోలు కేంద్ర సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# గుట్టకింది సికెఎం దవాఖాన రోడ్డుని క్లియర్ చేసిన పోలీసులు

– ఊపిరి పీల్చుకున్న పేద రోగులు

**వరంగల్, 27 మే(సాక్ష్యం)** నగరంలోని అత్యంత రద్దీ ప్రాంతమైన వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ పరిసరాలు, సికెఎం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే ప్రధాన రహదారిపై నెలకొన్న ట్రాఫిక్ సమస్యలకు ఎట్టకేలకు ఉపశమనం లభించింది. గత కొంతకాలంగా సికెఎం హాస్పిటల్ మార్గంలో చిరు వ్యాపారులు, పూల దుకాణాల నిర్వాహకులు రోడ్డును ఆక్రమించి శాశ్వత, తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాజాగా పోలీసులు రంగంలోకి దిగి ఆక్రమణలను తొలగించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**అంబులెన్సులకు ఆటంకం కలిగించిన ఆక్రమిత దుకాణాలు**

సికెఎం హాస్పిటల్ వరంగల్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు కీలక వైద్య కేంద్రంగా కొనసాగుతోంది. ప్రతిరోజూ వందలాది మంది రోగులు, గర్భిణీలు, అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారు ఆసుపత్రికి



చేరుకుంటుంటారు. అయితే హాస్పిటల్ ప్రవేశ ద్వారం వద్ద పూల దుకాణాలు, బండ్లు, ఇతర వ్యాపారాలు రహదారిని ఆక్రమించడంతో వాహనాల రాకపోకలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ముఖ్యంగా అంబులెన్సులు సైతం ట్రాఫిక్‌లో చిక్కుకుని ఆలస్యంగా ఆసుపత్రికి చేరుతున్న ఘటనలు చోటుచేసుకున్నాయి.

**ప్రజల ఇబ్బందులు గ్రహించిన రక్షక భటులు**

స్థానిక ప్రజలు, రోగుల బంధువులు పలుమార్లు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ట్రాఫిక్‌కు ఆటంకంగా మారిన ఆక్రమణలను తొలగిస్తూ రహదారిని ఖాళీ చేయించారు. దీంతో ప్రస్తుతం వాహనాల రాకపోకలు సాఫీగా సాగుతున్నాయి.

**నిరంతరం పర్యవేక్షించాలి**

ప్రాణాలతో పోరాడే రోగులకు ప్రతి నిమిషం విలువైనదని, అలాంటి ప్రాంతాల్లో రోడ్ల ఆక్రమణలు అసలు అనుమతించకూడదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. సమయానికి స్పందించి చర్యలు తీసుకున్న పోలీసు అధికారులను స్థానికులు అభినందిస్తున్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఆక్రమణలు మళ్లీ జరగకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని కోరుతున్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

– రైతులు ఎలాంటి అధైర్యానికి గురి కావొద్దు – ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే అయిలయ్య

**తుర్కపల్లి సాక్షి న్యూస్..** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని లితెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. మంగళవారం కురిసిన అకాల వర్షాలకు కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉంచిన ధాన్యం తడవడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బుధవారం రోజు వెంటనే కొనుగోలు కేంద్రానికి చేరుకుని రైతులతో మాట్లాడి వీరి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తడిసిన ధాన్యాన్ని స్వయంగా పరిశీలించిన ఎమ్మెల్యే రైతులు ఎలాంటి అధైర్యానికి గురికావద్దని, ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడి ప్రతి గింజ ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని భరోసా ఇచ్చారు. అకాల వర్షాల వల్ల రైతులు ఎన్నో కష్టాలు పడుతున్నారని, రైతు శ్రమ వృథా కాకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరగకుండా వెంటనే అదనపు లారీలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని తరలించే చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. అదేవిధంగా నూతనంగా వంగపల్లి గోదాములో ధాన్యాన్ని నిల్వ చేసేందుకు వేసులు బాటు





కల్పించడం జరిగిందని లారీ కాంట్రాక్టర్ తో మాట్లాడి బొమ్మలరామారం తుర్కపల్లి మండలం లో ఉన్న ధాన్యాన్ని అదనపు లారీలతో లోడ్ చేసి వంగపల్లి గోదాంలో అన్లోడ్ చేయవలసిందిగా తెలిపారు. రైతులు రోజులు తరబడి కొనుగోలు కేంద్రాల వద్ద నిరీక్షించాల్సిన పరిస్థితి రాకూడదని, ధాన్యం త్వరితగతిన కొనుగోలు చేసి మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. రైతుల ధాన్యం కొనుగోలు ప్రక్రియలో. గోదాం వద్ద అన్లోడ్ విషయంలో ఏ అధికారి, ఏ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహించిన చర్యలు తప్పవని తెలిపారు. వర్షాలకు తడిసిన ధాన్యం విషయంలో కూడా రైతులకు ఎటువంటి అన్యాయం జరగకుండా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతులు ఎమ్మెల్యేకి తమ సమస్యలను వివరించగా, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, రైతులు నష్టపోకుండా అన్ని విధాలుగా అండగా ఉంటామని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు. వీరి వెంట ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య రెడ్డి, రైతులు తదితరులు ఉన్నారు.

# అక్రమ మట్టి దందా భండారం బట్టబయలు

– మూడు టిప్పర్లు అదుపులోకి తీసుకున్న పోలీసులు

**హనుమకొండ 27 మే (సాక్ష్యం)** నగర పరిధిలోని చెరువుల నుంచి అక్రమంగా మట్టి తవ్వి జనావాసాలు, నూతన నిర్మాణాలకు విక్రయిస్తూ దందా చేస్తున్న టిప్పర్ డ్రైవర్లను కేయూ పోలీసులు మంగళవారం అర్ధరాత్రి అదుపులోకి తీసుకున్నారు. కేయూ సీఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం నగర చుట్టుపక్కల చెరువుల నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మూడు టిప్పర్లను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. వాటిలో ఒక టిప్పర్ మట్టితో నిండుగా ఉండగా, రెండు టిప్పర్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. టిప్పర్ డ్రైవర్లు, యజమానులపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. అదే సమయంలో బుధవారం పెగడపల్లి ప్రాంతంలో మరో అక్రమ మట్టి డంప్‌పై సమాచారం అందింది. ట్రాక్టర్ల ద్వారా రైతులకు ఒక ట్రాక్టర్ మట్టిని రూ.1500 నుంచి రూ.2000 వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకున్నారు. పోలీసులు వచ్చే సమాచారం ముందుగానే తెలిసిపోవడంతో మట్టి దందా నిర్వహిస్తున్న వారు ట్రాక్టర్లతో సహా అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు.



## ఎస్ఎమ్ కొత్తపల్లి గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు
### కేంద్రంను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి పరిశీలించిన ఎమ్మెల్యే జీఎస్సార్

**(సాక్ష్యం) న్యూస్ జయశంకర్ – భూపాలపల్లి, మే 27 :** భూపాలపల్లి రూరల్ మండలంలోని ఎస్.ఎం కొత్తపల్లి గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి పరిశీలించిన భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు . మంగళవారం కురిసిన అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని పరిశీలించి లారీల కొరత లేకుండా చూడాలని త్వరితగతిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని, ధాన్యం కొనుగోలు ప్రక్రియలో కటింగ్ లేకుండా చూడాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సంబంధిత అధికారులకు సూచించారు. మిల్లు యజమానులు ధాన్యం కట్టింగ్ అక్రమంగా



చేసినట్లయితే వారి పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట అడిషనల్ కలెక్టర్ అశోక్ కుమార్ డి.సి.ఓ మాలోతు వాళ్య నాయక్ రైతులు పాల్గొన్నారు.

## బాల్క సుమన్ తన వైఖరి మార్చుకోవాలి
### – కాంగ్రెస్ పార్టీ నాయకులు రాయపూడి వెంకట నారాయణ

**కోదాడ మే 27, (సాక్ష్యం)**
రైలు పట్టాలు కోసేయండి ఆస్తులను తగలబెట్టండి అని ఉన్మాదిలా మాట్లాడిన చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ మాట్లాడిన మాటలను ఉమ్మడి నల్లగొండ జిల్లా మలిదశ ఉద్యమకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాయపూడి వెంకట నారాయణ ఖండించినారు. బుధవారం యన మాట్లాడుతూ అసెంబ్లీకి రాకుండా నెల జీతం తీసుకుంటున్న బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ ఆస్తులను ఫామ్ హౌస్ లను తగల పెట్టు అంతేకానీ తెలంగాణ ప్రజల ఆస్తులు జోలికి వస్తే సహించేది లేదని ఇటువంటి వ్యాఖ్యలు మానుకోవాలని ఆయన అన్నారు ఉద్యమము సమయంలో బాల్క సుమన్ ఆంధ్ర వాళ్ళని బెదిరించి విపరీతంగా డబ్బులు పోగు చేసినాడు అని ఆయన ఆరోపించారు ఏమైనా ఇబ్బందులు ఉంటే ప్రభుత్వానికి సలహాలు సూచనలు ఇవ్వవలెను కానీ ఇటువంటి మాటలు మాట్లాడటం ఆయన అవివేకానికి నిదర్శనం అన్నారు. ఈరోజుకి రాష్ట్రంలో 8,575 కొనుగోలు కేంద్రాల ద్వారా 50 లక్షల మెట్రిక్ టన్నుల వరి సేకరించారు. ఇది మార్కెట్‌కు వచ్చిన ధాన్యంలో 86%. 7 లక్షల మందికి పైగా రైతుల ఖాతాల్లో మీఁరా విలువ రూ.8,700 కోట్లు జమ చేశారు.



దొడ్డు రకం 38 సన్న రకం 12 కొన్నారు. ధాన్యం తరలింపునకు 13,200 లారీలు, డీసీఎంలు, ట్రాక్టర్లు వినియోగించారు. నిజామాబాద్ 6.70 తో అగ్రస్థానంలో ఉండగా, నల్గొండ, కామారెడ్డి, సూర్యాపేట, పెద్దపల్లి తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. నిరంతరం తెలంగాణ ప్రజల బాగోగుల కోసం కృషి చేస్తున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని ఆయన అభినందించారు.

### ముస్లిం సోదరసోదరీమణులకు
## బక్రీద్ పండుగ శుభాకాంక్షలు
### – దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్

**దేవరకొండ: మే 27 (సాక్ష్యం)**
భక్తికి, త్యాగానికి, సహనానికి బక్రీద్ పండుగ ప్రతీక అని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పేర్కొన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరసోదరీమణులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. భక్తి, శ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండుగను జరుపుకోవాలని సూచించారు. దైవ ప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ ముస్లింలు బక్రీద్ పండుగను జరుపుకుంటారని అన్నారు. పేదల పట్ల జాలి, దయ కలిగి ఉండటమే బక్రీద్ ఇచ్చే సందేశమన్నారు. అల్లాహ్ ఆశీస్సులు ప్రజలందరికీ ఎల్లప్పుడూ ఉండాలని ఆయన ఆకాంక్షించారు.



## న్యాయం చేయాలని డీఎస్పీకి వినతి

**కోదాడ, మే 27,( సాక్ష్యం)**
తన తండ్రిని కొట్టి, డబ్బులు తీసుకెళ్లిన వారిపై చర్యలు తీసుకొని, మాకు న్యాయం చేయాలని డీఎస్పీ శ్రీనివాసరెడ్డికి అమరవరం గ్రామానికి చెందిన పి కావ్య బుధవారం వినతి పత్రం అందజేశారు. బల్లునూరి సాంబిరెడ్డి, బల్లునూరి ఉపేందర్ రెడ్డిలు అక్రమంగా మా ఇంట్లోకి ప్రవేశించి తన తండ్రి కొప్పుల కృష్ణారెడ్డిని కొట్టి, ఇంట్లో ఉన్న డబ్బులు రూ.7 లక్షలు తీసుకెళ్లారని



ఫిర్యాదు పత్రంలో పేర్కొన్నారు. ఈ ఘటనపై విచారణ చేసి న్యాయం చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

## స్వామివారి సేవలో తెలంగాణ గవర్నర్ కుటుంబ సభ్యులు

**యాదగిరి కొండ సాక్ష్యం న్యూస్..**
యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారిని దర్శించుకున్న తెలంగాణ రాష్ట్ర గవర్నర్ వీరి సతీమణి జానకి శుక్లా, కుమార్తె నీతి శుక్లా కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఈవో భవాని శంకర్ ఆలయ సంప్రదాయ ప్రకారం స్వాగతం పలికారు. వీరు





ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వీరికి ఆలయ ముఖమండపం లో వేద పండితులు, అర్చకులు వేద ఆశీర్వచనం, వేద పారాయణం గావించుట జరిగినది. వీరికి ఆలయ ఈవో భవాని శంకర్ స్వామివారి తీర్థ ప్రసాదం, చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం కొండపైన శ్రీ పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు.



## పాఠశాల విద్యను గాలికి వదిలేసిన రాష్ట్ర ప్రభుత్వం: ఎబివిపి

**దేవరకొండ: మే.27 (సాక్ష్యం)**
అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ దేవరకొండ నగర శాఖ ఆధ్వర్యంలో బుధవారం రోజున ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి అనంతరం ఏబీవీపీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు తెలంగాణ రాష్ట్ర విద్యా విధానంపై ప్రెస్ నోట్ ఇవ్వడం జరిగింది. నీళ్లు నిధులు నియామకాల కోసం ఆనాడు ప్రత్యేక తెలంగాణ కొరకు ఎంతోమంది విద్యార్థులు బలిదానాలు అర్పించి విద్యార్థుల భవిష్యత్తు కోసం కోరుకున్న ప్రత్యేక తెలంగాణ లో ఈరోజు చూసుకున్నట్లయితే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యను పూర్తిగా గాలికి వదిలేసింది ఎబివిపి రాష్ట్ర హాస్టల్స్ కో కన్వీనర్ యలమల గోపీచంద్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్ విద్యాసంస్థలు బ్రాండ్ల పేరిట ఫీజు నియంత్రణ చట్టాన్ని తుంగలో తొక్కుతూ నర్సరీ విద్యార్థులకు లక్షల్లో ఫీజులను వసూలు చేస్తున్నారని పుస్తకాలు యూనిఫాం ల పేరిట ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థుల నుండి ఫీజు దోపిడీకి పాలు పడుతున్నారని, బస్సు సౌకర్యం పేరిట అడ్డదారిన వేలు రూపాయలను




వసూళ్లు చేస్తున్నారని, ఫిట్నెస్ లేని బస్సులను నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని, మరోవైపు ప్రభుత్వ పాఠశాలల్లో, గురుకులాల్లో, వసతి గృహాలు మాత్రం అరకొర వసతులు, సౌకర్యాలతో నరక కూపాల్లా ఉన్నాయి అని మరో రెండు వారాల్లో పాఠశాలలు పునః ప్రారంభం కాబోతున్న ఇంకా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ఇచ్చే పాఠ్య పుస్తకాల ఊసు అసలే లేదని, రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రమాణాలు పడిపోతూ రోజు రోజుకు విద్యార్థుల సంఖ్య పడిపోతుంటే మరో వైపు ప్రైవేట్ పాఠశాలలు పుట్టగొడుగుల్లా విస్తరించి విద్యను వ్యాపారం చేస్తున్నాయి అని ఈ విషయంలో పట్టించుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ప్రేక్షక పాత్ర పోషిస్తుందని, వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ విద్యా సంస్థల విద్యా వ్యాపారని అరి కట్టి, ప్రభుత్వ పాఠశాలను మెరుగు పరుస్తూ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలను, వసతి గృహాల వసతులను అభివృద్ధి పరిచి పాఠశాల విద్యలోని ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని లేని పక్షాన రాష్ట్ర వ్యాప్తంగా ఎబివిపి భారీ విద్యార్థి ఉద్యమం చేస్తుందని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఎబివిపి నగర కార్యదర్శి పగిళ్ల విక్రం, నగర జాయింట్ సెక్రెటరీ రాకేష్, గుండాల శివరామరాజు, అరవింద్, శంకర్, కైలాష్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకొని మహిళలు ఆర్థికంగా వ్యాపారవేత్తలుగా ఎదగాలని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణరావు

**(సాక్ష్యం) న్యూస్ జయశంకర్ – భూపాలపల్లి, మే 27 :**
రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకొని మహిళలు ఆర్థికంగా, వ్యాపారవేత్తలుగా ఎదగాలని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ధాన్యం కొయ్యకాలు మక్కల వ్యర్థాలు కాల్చకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.



మహిళల ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, మహిళా స్వయం సహాయ సంఘాలకు రుణాలు బ్యాంకు లింకేజీలు అందిస్తున్నామన్నారు. అలాగే మహిళా సంఘాలకు సోలార్ విద్యుత్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆదాయం పెరిగి ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. మహిళలు గోదాములు, బియ్యం మిల్లులు నిర్మాణానికి ముందుకొస్తే రుణాలు అందిస్తామని తెలిపారు. గాంధీ పురం లో 55 కోట్లతో మోడరన్ మార్కెట్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. మండలాల్లో మహిళా సంఘాల భవనాలు నిర్మాణానికి 10 లక్షలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. పాడిపరిశ్రమ ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. ఎన్నో ఏండ్లుగా భూమి సాగు చేస్తున్నప్పటికి భూ హక్కు పత్రాలు రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, సాగు అర్హులైన రైతుల

## ఆరవ రోజు దీక్షలో వంటవార్పుతో వివోఏల నిరసన

**సాక్ష్యం మే 27 పాలేరు**
సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం పనికి తగ్గ కనీస వేతనం అమలు చేయాలని మే 18 నుంచి వివోఏ లు చేస్తున్న సమ్మెలో భాగంగా మండల కేంద్రంలో వివోఏ లు రోజుకొక విన్నూత రీతిలో నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఆరవ రోజు దీక్షలో రోడ్డుపై వంట వార్పు చేసి వివోఏలు అంతా దీక్షా శిబిరంలోనే భోజనాలు చేసి తమ నిరసన వ్యక్తాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా వివోఏ ల జేఏసీ జిల్లా అధ్యక్షురాలు వేల్పుల సుశీల మాట్లాడుతూ వివోఏల బతుకులు రోడ్డుపై పడవేయకుండా వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి వివోఏలకు కనీస వేతనం అమలు అమలుచేసి తమను ఆదుకోవాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం నిత్యం స్వయం సహాయక సంఘాల సభ్యుల జీవితాల్లో వెలుగులు నింపే వివోఏ లకు మాత్రం కనీస వేతనం





ఇవ్వకుండా వారితో వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారని తమ ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివోఏల పట్ల సానుకూలంగా స్పందించి వివోఏ లకు 20 వేల రూపాయల వేతనం అమలు చేసి నేరుగా వారి వ్యక్తిగత గతాల్లో వేతనాన్ని జమ చేయాలని ఆమె కోరారు. 57 ఏళ్లు దాటిన వివోఏ లకు పెన్షన్లు, ఇన్సూరెన్స్ లు, బీమా సౌకర్యం, వివోఏ ల కుటుంబాలకు హెల్త్ కార్డులు ఉద్యోగ భద్రత హెచ్ఆర్పీ పాలసీ అమలు చేయాలని పని భారాన్ని తగ్గించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివోఏల జేఏసీ జిల్లా అధ్యక్షురాలు వేల్పుల సుశీల,గుగ్గిళ్ళ ఉమా, మండాది కళమ్మ, పోలూరి విజయలక్ష్మి బొడ్డు కుసుమ,మాధురి, మేకల కృష్ణవేణి, ధనలక్ష్మి, మెట్టు స్వరూప రాణి, గుంటెటి విజయ కుమారి, కవిత, కుమారి, రమణ, పద్మ సామినేని కరుణ, సుజాత, మంజుల, జయ, గోపోజి ఉపేంద్ర, విజయలక్ష్మి,సిహెచ్ జ్యోతి ధనలక్ష్మి, జయ, జర్పుల సరిత బోడ సునీత బోడ అనుష తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ దీపికల పోరాటానికి సిఐటియు సంఘీభావం
### – ఆరవ రోజు నిరసన దీక్షకు మద్దతు ప్రకటించిన సిఐటియు మండల కార్యదర్శి వశపొంగు వీరన్న

**సాక్ష్యం మే 27 పాలేరు**
వివో ఏ ల జేఏసీ ఆధ్వర్యం లో కొనసాగుతున్న గ్రామ దీపికల నిరవధిక నిరసన దీక్షలు ఆరవ రోజుకు చేరుకున్నాయి. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం మండల కేంద్రంలో ఆందోళన కొనసాగిస్తున్న గ్రామ దీపికలకు సిఐటియు జిల్లా కమిటీ నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ నాయకుడు వశపొంగు వీరన్న మాట్లాడుతూ గ్రామ దీపికలు గ్రామ స్థాయిలో ప్రభుత్వ పథకాల అమలులో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, వారికి తగిన గౌరవం, భద్రత, సరైన వేతనాలు కల్పించకపోవడం దురదృష్టకరమన్నారు. పొట్టకూటి కోసమే గ్రామ దీపికలు సేవలు అందిస్తున్నారని, కానీ ఇప్పటికీ చాలీచాలని జీతాలతో కుటుంబాలను పోషించడం కష్టంగా మారిందన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా గ్రామ దీపికల తలరాతలు మాత్రం మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో ప్రజలకు సేవలు అందిస్తూ అధికార యంత్రాంగానికి అండగా నిలుస్తున్న మహిళలను





చిన్నచూపు చూడడం సరికాదన్నారు. వెట్టి చాకిరి మాకు వేతనాలు వారిక అన్న పరిస్థితి కొనసాగుతోందని విమర్శించారు. గ్రామ దీపికల అమూల్యమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని వారికి శాశ్వత ఉద్యోగ భద్రతతో పాటు గౌరవ వేతనం పెంచాలని డిమాండ్ చేశారు. గత ఆరు రోజులుగా మండుటెండలో దీక్షలు చేస్తున్న మహిళల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ దీపికల జేఏసీ నాయకులు,సిఐటియు మండల కార్యదర్శి వశపొంగు వీరన్న వివోఏల జేఏసీ జిల్లా అధ్యక్షురాలు వేల్పుల సుశీల,గుగ్గిళ్ళ ఉమా, మండాది కళమ్మ, పోలూరి విజయలక్ష్మి బొడ్డు కుసుమ,మాధురి, మేకల కృష్ణవేణి, ధనలక్ష్మి, మెట్టు స్వరూప రాణి, గుంటెటి విజయ కుమారి, కవిత, కుమారి, రమణ, పద్మ సామినేని కరుణ, సుజాత, మంజుల, జయ, గోపోజి ఉపేంద్ర, విజయలక్ష్మి,సిహెచ్ జ్యోతి, షేక్ జానీ, బేగం, సువర్ణ, ఉష, ఇందిరా, రాంబాయి సుజాత, మంజుల, శ్రావణి, స్రవంతి ధనలక్ష్మి, జయ, జర్పుల సరిత బోడ సునీత బోడ అనుష గ్రామ దీపికలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దేవరకొండలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు

**దేవరకొండ: మే 27 (సాక్ష్యం)**
తెలుగుదేశం వ్యవస్థాపకులు నందమూరి ఎన్టీ రామారావు జయంతి సందర్భంగా దేవరకొండ నియోజకవర్గం ఇన్చార్జ్ వస్కుల కృష్ణయ్య. తెలుగుదేశం పార్టీ జెండా ఆవిష్కరించడం జరిగింది. వస్తువుల కృష్ణయ్య మాట్లాడుతూ. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు జయంతి వేడుకలను మహానాడు వేదికగా ప్రతి సంవత్సరం మే 27, 28, 29 తేదీలలో ఘనంగా నిర్వహించుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎప్పటిలాగే ఈసారి కూడా జన్మదిన వేడుకలను నిర్వహించుకోవడానికి కొన్ని కారణాల దృష్ట్యా ఘనంగా నిర్వహించలేక వర్చువల్ కార్యక్రమాల ద్వారా నిర్వహించుకుంటున్నామని, దానిలో భాగంగా బుధవారం దేవరకొండ లో పార్టీ జెండా ఆవిష్కరణ చేసి పార్టీ సంబరాలు నిర్వహించుకోవడం జరిగిందని, రేపు ఎన్టీఆర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకోవడం జరుగుతుందని తెలిపారు.నందమూరి తారరామారావు . తెలుగుదేశం పార్టీని ఏ ఆశయంతో స్థాపించారో, ఆ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడానికి ప్రస్తుత జాతీయ



పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు నిరంతరం కృషి చేస్తున్నారని, తెలుగుదేశం పార్టీని తెలుగు ప్రజలే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలందరూ గర్వించదగ్గ విధంగా నడిపిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, బ్రహ్మచారి. రమేష్. నేరడుగోమ్ము. సీనియర్ నాయకులు. బోడదనయ్య యాదవ్. గుడిపల్లి సీనియర్ నాయకులు. ఆలేటి నరసింహ. పీఏ పల్లి సీనియర్ నాయకులు. సీతారాములు. దేవరకొండ సీనియర్ నాయకులు. శ్రీను. చందంపేట సీనియర్ నాయకులు. శ్రీను. వస్కుల రాజేష్. కార్యకర్తలు పాల్గొన్నారు.

# గుడిబండలో బోర్లకు మరమ్మతులు

- సర్పంచ్ మందుల నాగయ్య



**కోదాడ మే 27, (సాక్ష్యం)**
గుడిబండ గ్రామం లో వేసవి కాలం దృష్టిలో పెట్టుకుని మంచినీటి సమస్య ఉన్నందున మన గ్రామం లోని బోర్ లు అన్నీ గ్రామ సర్పంచ్ మందుల నాగయ్య బుధవారం రిపేర్ చేపించినారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామం లో మంచినీటి సమస్య ఎక్కడ ఉన్న తమ దృష్టికి తీసుకు వస్తే వెంటనే పరిష్కరిస్తానని వాగ్దానం ఇచ్చినారు. ఇట్టి కార్యక్రమం లో గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సతీష్‌ను పరామర్శించిన వెంకటేష్



**యాదగిరిగుట్ట సాక్ష్యం న్యూస్**
ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన యాదగిరిగుట్టకు చెందిన యువ నాయకుడు కల్వకొలను సతీష్ బట్ ను వైయస్సార్సీపి యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు టిటిడి లోకల్ అడ్వైజర్ బోర్డు మాజీ మెంబర్ ఒడ్లోజి వెంకటేష్ బుధవారం పరామర్శించారు. ఇంటికి వెళ్లి సతీష్ ను యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల యాదగిరిగుట్ట పట్టణ సమీపంలో రోడ్డు ప్రమాదంలో స్కూటీపై నుండి పడి తీవ్ర ప్రమాదాల బారినపడిన సతీష్ ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరుకున్నారు. ఈ సందర్భంగా పుట్టినరోజు వెంకటేష్ ఆయన ఇంటికి చేరుకుని ప్రమాదం ఎలా జరిగింది. అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి ఎలా ఉంది అని అడిగారు. తామంతా అండగా ఉన్న అంటూ ఆయనకు భరోసా ఇచ్చారు. ఆయన వెంట పలువురు స్థానిక నాయకులు ఉన్నారు.

# ఆలయంలో ఏకాదశి లక్ష పుష్పార్చన పూజలు

**యాదగిరి కొండ సాక్ష్యం న్యూస్**
ఏకాదశి పర్వదినం సందర్భంగా బుధవారం యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహా స్వామి ఆలయంలో లక్ష్మీ నరసింహులకు లక్ష పుష్పార్చన ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు.





ప్రధానాలయం లోని ముఖమండపంలో నయన మనోహరంగా అలంకరించిన ఉత్సవ మూర్తులకు వేద మంత్రాలు,మంగళ వాయిద్యాల నడుమ



సహస్రనామలతో లక్ష పుష్పార్చన అత్యంత వైభవంగా చేపట్టారు.పాంచ రాత్ర ఆగమ శాస్త్రోక్తంగా లక్ష్మీ నరసింహుడికి వివిధ రకాల పుష్పాలతో లక్ష పుష్పార్చన నిర్వహించారు.లక్ష పుష్పార్చన విశిష్టతను ఆలయ అర్చకులు భక్తులకు తెలియజేసారు.లక్ష పుష్పార్చనలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

# ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్పీ జానకి

- పండుగ సందర్భంగా శాంతియుత వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలని పిలుపు



**మహబూబ్‌నగర్, మే 27 (సాక్ష్యం బ్యూరో)**
బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ దరావత్ జానకి జిల్లా ముస్లిం సోదరులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బక్రీద్ పండుగ త్యాగానికి, ప్రేమకు, మానవత్వానికి ప్రతీకగా నిలిచే పవిత్రమైన పర్వదినమని పేర్కొన్నారు. ప్రజలంతా పరస్పరం మతాలను గౌరవించుకుంటూ సోదరభావంతో పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. పండుగ సందర్భంగా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ శాఖ తరఫున పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈద్గాలు, మసీదులు మరియు ప్రార్థనా స్థలాల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. అలాగే సోషల్ మీడియాలో వచ్చే వదంతులు, అసత్య ప్రచారాలను నమ్మవద్దని సూచించిన ఎస్పీ, ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా పోస్టులు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 8712659360 లేదా డయల్-100ను సంప్రదించాలని జిల్లా ఎస్పీ జానకి కోరారు.

# నేడే బక్రీద్ పండుగ

- సమాయత్తమవుతున్నా ముస్లింలు

**రాయపర్తి, మే 27(సాక్ష్యం):**
ముస్లింలు ఎంతో పవిత్రంగా భక్తి శ్రద్దలతో జరుపుకునే ప్రధాన పండుగల్లో బక్రీద్ (ఈద్ అల్-అధా) ఒకటి. ఈ పండుగను హొత్యాగాల పండుగ" అని కూడాముస్లిం లు పిలుస్తారు. ఈ పండుగ నేడు గురువారం నిర్వహిస్తున్నట్లు ముస్లిం పెద్దలు తెలిపారు. తెలంగాణ లోని అన్ని ప్రాంతాల్లో ఈ రోజున బక్రీద్ జరుపుకోనున్నారు.

ఈ బక్రీద్ పండుగ ప్రముఖ్యత గురించి ఇలా వివరించారు. అల్లాహ్ ఆదేశాను సారం ఇబ్రహీం ప్రవక్త తన కుమారుడిని బలి ఇవ్వడానికి సిద్ధపడిన గొప్ప త్యాగాన్ని స్మరిస్తూ, ముస్లింలు ఈ పండుగను జరుపుకుంటారు. ఈ రోజున ఆరాధనగా మేక, గొర్రె లేదా ఇతర జంతువులను బలి ఇస్తారు. ఆ మాంసాన్ని మూడు భాగాలుగా చేసి, ఒక భాగం పేదలకు, మరో భాగం బంధుమిత్రులకు, ఇంకో భాగం తమ కుటుంబానికి ఉంచుకుంటారు. బక్రీద్ రోజు ఉదయాన్నే ముస్లిం సోదరులు ఈద్గా లేదా (మసీదు)ల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు (నమాజ్) చేస్తారు. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం జిల్హిజా మాసంలో ఈ పండుగ వస్తుంది. ఇదే సమయంలో ముస్లింలు మక్కాకు పవిత్ర యాత్ర (హజ్) ముగింపును కూడా జరుపుకుంటారు. త్యాగ నిరతిని పెంపొందించు కోవడమే ఈ పండుగ యొక్క ముఖ్య ఉద్దేశ్యమని వివరించారు.



# ఆడబిడ్డల సంక్షేమం - రైతుల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- 160 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



**మహబూబ్‌నగర్, మే 27 ( సాక్ష్యం బ్యూరో )**
కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండు సంవత్సరాలు పూర్తయ్యాయని, ఈ కాలంలో ప్రజా సంక్షేమానికి విశేష ప్రాధాన్యతనిస్తూ అనేక సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మహబూబ్‌నగర్ నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టణానికి చెందిన 160 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తన నియోజకవర్గంలో ఇప్పటివరకు సుమారు 2,500 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులు అందజేసినట్లు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని స్థాయిలో లబ్ధిదారులకు ఈ పథకం చేరువైందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మరింత మంది అర్హులైన వారికి ఈ పథకం అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆడబిడ్డల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, మహిళల విద్య, ఉపాధి, స్వయం సమృద్ధి కోసం పలు కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. స్కూల్స్, కాలేజీల్లో మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. మహిళల కోసం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం ద్వారా వారు విద్య, ఉపాధి, వ్యాపార రంగాల్లో మరింత ముందుకు సాగేందుకు అవకాశం లభిస్తోందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు సుమారు 4.5 లక్షల ఇళ్లు నిర్మించామని, వచ్చే ఏడాది జూన్ 2 నుంచి మరో 2 లక్షల ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు. రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, సుమారు 25 లక్షల రైతు కుటుంబాలు అప్పుల భారం నుంచి విముక్తి పొందాయని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఇప్పుడు రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ప్రతి వర్గం ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, మహిళలు, రైతులు, విద్యార్థులు అభివృద్ధి చెందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని అన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ నగర మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, కార్పొరేటర్లు భాను చందర్, కిషన్ నాయక్, అనుప ఆంజనేయులు, తాహేర్, ఫయాజ్, శేఖర్, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సంజీవరెడ్డి, నాయకులు రాములు యాదవ్, టంకర కృష్ణయ్య యాదవ్, రఘు, జాజిమొగ్గ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహరహిత గ్రామంగా చేయడానికి తమ వంతు కృషి చేస్తాం

- సర్పంచ్ అండెం రేణుక



**మాడుగులపల్లి మే 27 సాక్ష్యం;**
దామరచర్ల ప్రాజెక్టు పరిధిలో గల మాడుగులపల్లి మండలం ఆగమోత్కూరు గ్రామ పంచాయతీలో బుధవారం 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మహిళా వారోత్సవాలు 25 మే నుండి జూన్ 1 వరకి జరిగే కార్యక్రమాల్లో భాగంగా మహిళా వారోత్సవాలు అంగన్వాడీ పరిధిలో సిడిపిఓ ఆదేశాల మేరకు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐసిపిఎస్ రమణి మాట్లాడుతూ బాలవివాహము బతుకు ఆగము అనే నినాదం సోషల్ మీడియా,పోస్టర్,అవగాహన కార్యక్రమాలు చేయడం బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించారు.గ్రామపంచాయాతీ నుండి బాల్య వివాహాలు చేయరాదు అనే తీర్మానం ఇవ్వాలని కూడా చెప్పటం జరిగింది. గ్రామ సర్పంచ్ అండెం రేణుక మాట్లాడుతూ బాల్య వివాహరహిత గ్రామంగా చేయడానికి తమ వంతు కృషి చేస్తాం అని అన్నారు.ఈ ప్రోగ్రాం కి అంగన్వాడీ సూపర్వైజర్ జ.నాగమణి, ఐసిపిఎస్ కౌన్సిలర్ రమణి,హెడ్మాస్టర్ వినోదుకుమార్, హెల్త్ సూపర్వైజర్ నర్సయ్య, ఏఎన్ఎం వనజాత,అంగన్వాడి టీచర్ హేమలత, శకీరాబాను, ఆశ వర్కర్స్, కిషోర్ బాలికలు గ్రామ పెద్దలు గర్భిణీ బాలింతలు తల్లులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు

- చౌటుప్పల్ మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు ఎండి బాబా షరీఫ్



**చౌటుప్పల్ మే 27 (సాక్షం)**
బక్రీద్ పర్వదినం సందర్భంగా ముస్లిం సోదరులకు చౌటుప్పల్ మున్సిపాలిటీ పోప్షన్ సభ్యులు ఎండి బాబా షరీఫ్ శుభాకాంక్షలు తెలిపారు. స్వార్థం, అసూయ, రాగద్వేషాలను విడిచిపెట్టి మానవుల్లో త్యాగాన్ని వ్యాపింపచేయడమే బక్రీద్ పండుగ ముఖ్య ఉద్దేశమని ఉద్ఘాటించారు.హజ్రత్ ఇబ్రహీం త్యాగానికి ప్రతీకగా నిర్వహించుకునే బక్రీద్ సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులకు ఈద్ ముబారక్ తెలియజేశారు. త్యాగబుద్ధిని, నిజమైన భక్తిప్రపత్తులు కలిగి ఉన్నవారే దైవకృపకు పాత్రులు అవుతారు అనే సూక్తిని బక్రీద్ మనకు తెలియజేస్తోందని, నేటి ఆధునిక కాలంలో సాటి మనిషిని ప్రేమించేవారే నిజమైన దైవభక్తులుగా చెప్పొచ్చు. హజ్రత్ ఇబ్రహీం స్ఫూర్తిగా అందరూ సాటివారిని ఆదరిస్తూ సహృదయంతో ముందుకు సాగాలని బక్రీద్ సందర్భంగా కోరుకుంటున్నాను' అని ఎండి బాబా షరీఫ్ పేర్కొన్నారు.

## ఏడుపాయల వన దుర్గా భవాని అమ్మవారిని దర్శించుకున్న మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ దంపతులు



**మెదక్ జిల్లా ప్రతినిధి (సాక్ష్యం న్యూస్) 27 మే**
మెదక్ శాసనసభ్యులు డా. మైనంపల్లి రోహిత్ గారు తమ సతీమణితో కలిసి దర్శించుకున్నారు. ఆలయంలో అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందించారు.ఈ సందర్భంగా డా. మైనంపల్లి రోహిత్ గారు మాట్లాడుతూ, "ఏడుపాయల అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని, జిల్లా అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని కోరుకుంటున్నాను. దేవస్థాన అభివృద్ధికి, భక్తుల సౌకర్యాలకు ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తాం" అని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మరియు మండల అధ్యక్షులు మున్సిపల్ చైర్మన్ లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్స్ దేవస్థాన కార్యనిర్వహణాధికారి, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం

- రైతులు అధైర్య పడొద్దు.. పుకార్లు నమ్మొద్దు - జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్ జిల్లా ప్రతినిధి ( సాక్ష్యం న్యూస్ ) 27 మే**
అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని, రైతులు పూకార్లను నమ్మి మోసపోవద్దని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ రైతులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం నర్సాపూర్ మండలం తుల్జారంపేట్ గ్రామంలోని ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆర్డిఓ రామకృష్ణ తాసిల్దార్ శ్రీనివాస్ తో కలిసి పరిశీలించారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని పరిశించారు.ఈ సందర్భంగా మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. నిన్న పడిన అకాల వర్షాలకు జిల్లా వ్యాప్తంగా 400 మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసిందని రిపోర్ట్ ఉందని, వరి ధాన్యం కింది భాగం నడిపోయిందని దాని ఆరబెట్టి తడిసిన ధాన్యాన్ని బాయిల్డ్ రైస్ మిల్లులకు పంపించి రైతులకు న్యాయం చేస్తామన్నారు.మధ్యానం సివిల్ సప్లై అధికారులు ఇచ్చిన రిపోర్టు ప్రకారం 250 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని బాయిల్డ్ రైస్ మిల్లు కు తరలించామన్నారు. మిగతా తడిసిన ధాన్యాన్ని ఈరోజు సాయంత్రం కల్లా బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలిస్తామన్నారు. అకాల వర్షాల వల్ల ధాన్యం తడిసిన రైతులు అధైర్య పడద్దని ప్రభుత్వ శాఖలన్నీ ధాన్యం కొనుగోలుపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉన్నాయి అన్నారు. రైతులు ఎవరు పుకార్లను నమ్మి మధ్యవర్తులను ఆశ్రయించద్దని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్, ఇతర శాఖల అధికారులు ఉన్నారు.



## చివరి గింజ వరకూ కొనుగోలు చేయాలి


- జిల్లా అదనపు కలెక్టర్ నగేష్



**మెదక్ జిల్లా ప్రతినిధి (సాక్ష్యం న్యూస్) 27 మే**
ధాన్యాన్ని చివరి గింజ వరకూ కొనుగోలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అధికారులకు సూచించారు.బుధవారం మెదక్ మండలంలోని రాయలపూర్, కొడిపల్లి మండలం కుల్చారం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అధికారులకు సూచించారు. అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసే బాయిల్డ్ మిల్లులకు తరలిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు.సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో ఘనంగా మహిళా భద్రత, రక్షణ వారోత్సవాలు

- లైంగిక వేధింపుల నిరోధక చట్టం 2013 మీద మహిళా ఉద్యోగులకు అవగాహన
- స్వయంగా చట్టంలో ఉన్న అంశాలను వివరించిన జిల్లా అదనపు కలెక్టర్ నగేష్
- ప్రతీ కార్యాలయంలో ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీల నియామకం తప్పనిసరి
- మహిళలకు సురక్షితమైన వాతావారణం ఉండడమే ప్రధాన లక్ష్యం
- జిల్లా అదనపు కలెక్టర్ నగేష్



**మెదక్ జిల్లా ప్రతినిధి ( సాక్షి న్యూస్ ) 27 మే**
ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 కార్యక్రమాల నేపథ్యంలో...నిర్వహిస్తున్న మహిళా భద్రత, రక్షణ వారోత్సవాలలో భాగంగా...బుధవారం లైంగిక, వేధింపుల నిరోధక చట్టం 2013 మీద కలెక్టరెట్ లోని కాన్ఫెరెన్స్ హాల్ లో... మహిళా ఉద్యోగులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమాన్ని లిజిల్లా అదనపు కలెక్టర్ నగేష్, ఇన్చార్జి ఐబొ స్వరూప జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.. ముందుగా.. ఈ చట్టం లో ఉన్న ప్రతీ అంశాన్ని,ఇంటర్నల్ కమిటీ అవశ్యకత ను స్వయం గా కలెక్టర్ సవివరంగా వివరించారు అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ..పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల (నివారణ, నిషేధం, సంస్కరణ) చట్టం, 2013 అనేది మహిళలకు కార్యాలయాల్లో లైంగిక వేధింపుల నుంచి రక్షణ కలిగించటానికి ఏర్పడ్డ చట్టమని.... దీనిపైన మహిళా ఉద్యోగులు తప్పనిసరిగా పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు ప్రతీ కార్యాలయంలో స్త్రీలకు భయరహితమైన, సమానమైన, గౌరవప్రదమైన పని వాతావరణం ఉండాలన్నారు ప్రతీ ఆఫీస్ లో ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ ఉండాలని... లైంగిక వేధింపులు ఎదుర్కొనే బాధితులు మౌనం గా ఉండకూడదని... ఈ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు ఒకవేళ సంస్థలో అంతర్గత కమిటీ లేకపోతే లేదా ఉన్నతాధికారులపై ఫిర్యాదు చేయాల్సి వస్తే, భారత ప్రభుత్వం షీ-బాక్స్ పోర్టల్ (లైంగిక వేధింపుల ఎలక్ట్రానిక్ బాక్స్) ద్వారా నేరుగా ఫిర్యాదు చేసే సదుపాయాన్ని కల్పించిందన్నారు .మన జిల్లా కి సంబందించిన కమిటీ లను ఆన్లైన్ లో అప్లోడ్ చేయడం జరిగిందన్నారు సకాలంలో బాధిత మహిళ తన ఫిర్యాదు ను ఇవ్వాలని...నిష్పక్షపాతంగా, గోప్యంగా విచారణ జరుగుతుందన్నారు మహిళలపై జరిగే లైంగిక వేధింపుల చర్యలను నివారించడం, నిషేధించడం, పరిష్కరించడం ద్వారా కార్యాలయాలను మహిళలకు సురక్షితంగా మార్చే లక్ష్యంతో రూపొందించిన ఈ చట్టం మహిళలకు ఒక మంచి అవకాశమన్నారు పని ప్రదేశాల్లో మహిళ లు ప్రశాంతం గా తమ విధులు ను నిర్వర్తించి నప్పుడే... కుటుంబ బాధ్యతలలో పూర్తి స్థాయిలో నిమగ్నమవుతారన్నారు ఇన్చార్జ్ డి డబ్ల్యు ఓ స్వరూప మాట్లాడుతూ... సమాజ అభివృద్ధి కి,మహిళల భద్రత,గౌరవం, స్వేచ్ఛ చాలా కీలకమని తెలిపారు మహిళలు భయభ్రాంతులు లేకుండా జీవించే వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు మహిళను గౌరవించడం మన సంస్కృతి, మహిళలు సురక్షితంగా ఉంటేనే కుటుంబం సురక్షితంగా సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు అందుకే ప్రతి ఒక్కరు..మహిళల పట్ల గౌరవభావంతో ప్రవర్తించి వేధింపులను అరికట్టేందుకు ముందుకు రావాలన్నారు. ఈ సమావేశం లో డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్ , ఇన్చార్జి జిల్లా సంక్షేమ అధికారి స్వరూప, వివిధ శాఖలకు చెందిన జిల్లా, మండల, గ్రామ స్థాయి మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.



# సన్‌రైజర్స్ పై రాజస్థాన్ 'రాయల్స్' విక్టరీ

- ముగిసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ పోరాటం
- అనూహ్య పరాజయంతో ఇంటిబాట
- ఎలిమినేటర్ మ్యాచ్‌లో సమష్టిగా విఫలం
- 47 పరుగుల భారీ తేడాతో ఎస్‌ఆర్‌ హెచ్ ఓటమి



ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ పోరాటం ముగిసింది. అనూహ్య పరాజయంతో ఇంటిబాట పట్టింది. రాజస్థాన్ రాయల్స్‌తో బుధవారం ముల్లాన్‌పూర్ వేదికగా జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో సమష్టిగా విఫలమైన సన్‌రైజర్స్ హైదరాబాద్ 47 పరుగుల భారీ తేడాతో ఓటమిపాలైంది. అభిమానులు ఏదైతే జరగకూడదని కోరుకున్నారో అదే జరిగింది. యూనివర్సల్ బేబీ బాస్ వైభవ్ సూర్యవంశీ(29 బంతుల్లో 5 ఫోర్లు, 12 సిక్సర్లతో 97) విధ్వంసకర బ్యాటింగ్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ పతనాన్ని శాసించాడు.

ఈ విజయంతో రాజస్థాన్ రాయల్స్ క్వాలిఫయర్–2కు అర్హత సాధించింది. శుక్రవారం ముల్లాన్‌పూర్ వేదికగా జరిగే ఈ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్‌తో రాజస్థాన్ రాయల్స్ అమీతుమీ తేల్చుకోనుంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ రాయల్స్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 243 పరుగుల భారీ స్కోర్ చేసింది. వైభవ్ సూర్యవంశీతో పాటు ధ్రువ్ జురెల్(21 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 50) హాఫ్ సెంచరీతో రాణించాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలర్లలో ప్రఫుల్ హింగే(3/54) మూడు వికెట్లు తీయగా.. ఇషాన్ మలింగా, శివాంగ్ కుమార్, నితీష్ కుమార్ రెడ్డి తలో వికెట్ పడగొట్టారు. అనంతరం సన్‌రైజర్స్ హైదరాబాద్ 19.1 ఓవర్లలో 196 పరుగులకు ఆలౌటై ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. ఇషాన్ కిషన్(11 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సలతో 33), నితీష్ కుమార్ రెడ్డి(20 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సలతో 38), సలీల్ అరోరా(21 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సలతో 35) రాణించగా మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. రాజస్థాన్ రాయల్స్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్(3/58) మూడు వికెట్లు తీయగా.. నండ్రే బర్గర్, సుశాంత్ మిశ్రా, రవీంద్ర జడేజా రెండేసి వికెట్లు పడగొట్టారు. యశ్‌రాజ్ పుంజా ఒక వికెట్ తీసాడు. భారీ లక్ష్యఛేధనలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఆదిలోనే గట్టి షాక్ తగిలింది. జోఫ్రా ఆర్చర్ వేసిన తొలి ఓవర్‌లోనే అభిషేక్ శర్మ సిల్వర్ డకౌట్‌గా వెనుదిరిగాడు. ఆర్చర్ మరుసటి ఓవర్‌లో దూకుడుగా ఆడిన ఇషాన్ కిషన్ క్యాచ్ ఔటయ్యాడు. రవిచంద్రన్ స్మరణ్(1)ను అప్‌ది ఆర్డర్ పంపిస్తూ ఆరెంజ్ ఆర్మీ చేసిన ప్రయోగం విఫలమైంది. బర్గర్ బౌలింగ్‌లో స్మరణ్ వెనుదిరగ్గా.. ట్రావిస్ హెడ్(17)ను ఆర్చర్ క్లీన్ బౌల్డ్ చేశాడు. దాంతో పవర్ ప్లేలోనే సన్‌రైజర్స్ హైదరాబాద్ 4 వికెట్లు కోల్పోయి ఓటమికి తల వంచింది. హెన్రీచ్ క్లాసెన్, నితీష్ కుమార్ రెడ్డి ఇన్నింగ్స్ నిలబెట్టే ప్రయత్నం చేసినా.. యశ్‌రాజ్ పుంజా దెబ్బకొట్టాడు. డేంజరస్ క్లాసెన్(18)ను వికెట్ల ముందు బోల్తా కొట్టించాడు. ఈ పరిస్థితుల్లో సలీల్ అరోరాతో కలిసి నితీష్ కుమార్ రెడ్డి పోరాడాడు. ఆచితూచి ఆడిన ఈ జోడీ వీలుచిక్కిన బంతిని బౌండరీకి తరలించింది. కానీ ఛేదించాల్సిన రన్‌రేట్ పెరిగిపోతుండటంతో దూకుడుగా ఆడాలనే ఒత్తిడిలో ఈ ఇద్దరూ వరుస ఓవర్లలో పెవిలియన్ చేరారు. ఈ ఇద్దర్నీ జడేజా తన వరుస ఓవర్లలో క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. ప్యాట్ కమిన్స్(1)ను మిశ్రా పెవిలియన్ చేర్చడంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓటమి ఖాయమైంది. రాజస్థాన్ బౌలర్ల సహనాన్ని శివాంగ్ కుమార్(27) పరీక్షించాడు. అతన్ని మిశ్రా ఔట్ చేసి రాజస్థాన్ విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు.

## అందుకే ప్రఫుల్ హింగేను తీసుకున్నాం: ప్యాట్ కమిన్స్

ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా రాజస్థాన్ రాయల్స్‌తో జరుగుతున్న ఎలిమినేటర్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. పిచ్ కండిషన్స్ నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నానని ా=ఎ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ అన్నాడు. తుది జట్టులో ఒక మార్పు చేశామని చెప్పిన ప్యాట్ కమిన్స్.. ప్రఫుల్ హింగే తుది జట్టులోకి వచ్చాడని చెప్పాడు. టీమ్ వ్యూహంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పాడు. 'మేం ముందుగా బౌలింగ్ చేస్తాం. ఫైనల్స్ ఆడిన అనుభవం ఈ మ్యాచ్‌లో ఉపయోగపడుతుందా? అంటే అవునని చెప్పలేను. కానీ ఆ అనుభవంతో కాస్త రిలాక్స్ అవ్వచ్చు. కానీ అత్యుత్తమ క్రికెట్ ఆడాల్సిందే. మేం మా జోరును కొనసాగించాలనుకుంటున్నాం. మేం మా వ్యూహాలను అమలు చేసే ప్రయత్నం చేస్తాం. మా సహజమైన బలాలపైనే ఆధారపడుతాం. తుది జట్టులో ఒక మార్పు చేశాం. ప్రఫుల్ హింగే తుది జట్టులోకి వచ్చాడు. టాస్ గెలిస్తే బౌలింగ్ ఎంచుకోవాలని ముందుగా ఏం అనుకోలేదు. ఇక్కడ ఛేజింగ్‌కు అనుకూలంగా ఉంటుందని ఈ నిర్ణయం తీసుకున్నాం. టాస్‌కు అంత ప్రాధాన్యత ఇవ్వలేదు. టాస్ ఓడినా మాకు జరిగే నష్టం ఏం ఉండేది కాదు. మేం బంతితో ఈ మ్యాచ్‌ను ప్రారంభించాలనుకుంటున్నాం.'అని ప్యాట్ కమిన్స్ చెప్పుకొచ్చాడు. మరోవైపు టాస్ గెలిస్తే ఏం ఎంచుకోవాలనే విషయంలో తాము కూడా గందరగోళంగా ఉన్నామని రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ అన్నాడు. కానీ ముందుగా బౌలింగ్ ఎంచుకునేవాళ్లమని చెప్పాడు. 'ఈ మైదానంలో ఛేజింగ్ రికార్డ్ బాగుంది. ఆ రికార్డ్‌ను మార్చేందుకు ఇది మంచి సమయమని భావిస్తున్నా. ఈ



మైదానంలో మాకు మంచి రికార్డు ఉంది. ఇక్కడ ఆడిన మూడు మ్యాచ్‌లకు మూడు గెలిచాం. ఇక్కడ లక్ష్యాలను ఛేదించడంతో పాటు డిఫెండ్ కూడా చేసుకున్నాం. ఈ సెంటిమెంట్‌ను అలానే కొనసాగించాలనుకుంటున్నాం. ఈ మ్యాచ్ ఆడటానికి నేను ఫిట్‌గా ఉన్నాను. తప్పక గెలవాల్సిన పరిస్థితి కాబట్టి కసిని పెంచవచ్చు. మ్యాచ్ గెలవడం మినహా మాకు మరో ఆప్షన్ లేదు. గెలుపు కోసం మా సాయశక్తులా ప్రయత్నిస్తాం. మా 100 శాతం పోరాడిన తర్వాత గెలిచినా.. ఓడినా సంతోషంగా ఉంటాను. విన్నింగ్ కాంబినేషన్‌తో బరిలోకి దిగుతున్నాం.'అని రియాన్ పరాగ్ చెప్పుకొచ్చాడు.



## చరిత్ర సృష్టించిన వైభవ్ సూర్యవంశీ

రాజస్థాన్ రాయల్స్ చిచ్చర పిడుగు వైభవ్ సూర్యవంశీ మరో సంచలనం నమోదు చేశాడు. చండీగఢ్ వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరుగుతున్న ఎలిమినేటర్ మ్యాచ్‌లో 14ఏళ్ల రికార్డ్‌ను బద్దలుకొట్టాడు. ఈ మ్యాచ్‌లో తొలి నుంచే సిక్సర్లతో విరుచుకుపడ్డ వైభవ్ 16 బంతుల్లోనే హాఫ్ సెంచరీ చేశాడు. ఇందులో 8 సిక్స్‌లు ఉండడం విశేషం. ఈ క్రమంలోనే ఐపీఎల్‌లో సింగిల్ సీజన్‌లో అత్యధిక సిక్స్‌లు బాదిన బ్యాటర్‌గా వైభవ్ తన పేరును రికార్డుల్లోకెక్కించుకున్నాడు. ఇప్పటిదాకా ఈ సీజన్‌లో వైభవ్ 61లి సిక్స్‌లు బాదాడు. దీంతో మాజీ క్రికెటర్ క్రిస్ గేల్ రికార్డ్ తుడిచిపెట్టుకుపోయింది. అతడు 2012 ఎడిషన్‌లో 59 సిక్స్‌లు కొట్టాడు. ప్రస్తుత సీజన్‌లో వైభవ్ ఆ రికార్డును బ్రేక్ చేసి సరికొత్త రికార్డ్ సృష్టించాడు. ఇదే మ్యాచ్‌లో క్రిస్ గేల్ పేరిట ఉన్న మరో రికార్డ్‌ను కూడా వైభవ్ బ్రేక్ చేసేలా కనిపించాడు. హాఫ్ సెంచరీ తర్వాత ఆకాశమే హద్దుగా చెలరేగిన అతడు ఎడాపెడా ఫోర్లు, సిక్స్‌లు బాదేశాడు. 28 బంతుల్లోనే 97 పరుగులు చేశాడు. దీంతో గేల్ పేరిట ఉన్న ఐపీఎల్ చరిత్రలో అత్యంత వేగవంతమైన సెంచరీ (30 బంతుల్లో) రికార్డ్‌ను బ్రేక్ చేస్తాడని అనుకున్నారంతా. వైభవ్ ఊపు చూస్తే చేసేలాగే కనిపించాడు. కానీ ప్రఫుల్ హింగే వేసిన ఓ చక్కటి బంతికి భారీ షాట్ ఆడబోయి ఫీల్డర్‌కు చిక్కాడు. దీంతో 97 వ్యక్తిగత స్కోర్ వద్ద వైభవ్ పెవిలియన్‌కు చేరాడు. ఈ ఇన్నింగ్స్‌లో 5 ఫోర్లు, 12 సిక్స్‌లు ఉన్నాయి. స్ట్రైక్ రేట్ 334.48 కావడం మరో విశేషం. రాజస్థాన్ ఇన్నింగ్స్ విషయానికొస్తే, తొలుత ధారాళంగా పరుగులిచ్చినా డెత్ ఓవర్లలో సన్‌రైజర్స్ కట్టుదిట్టంగా బంతులేసింది. చివరి నాలుగు ఓవర్లలో 36 రన్స్ మాత్రమే ఇచ్చారు. ఇక 20 ఓవర్లలో రాజస్థాన్ 8వికెట్ల నష్టానికి 243 పరుగులు చేసింది. వైభవ్ (97)తోపాటు ధ్రువ్ జురెల్ (50) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. రియాన్ పరాగ్ (26 పరుగులు) ఫర్వాలేదనిపించాడు. సన్ రైజర్స్ బౌలర్లలో ప్రఫుల్ హింగే 3, శివాంగ్ కుమార్, నితీశ్ కుమార్ రెడ్డి, ఇషాన్ మలింగ తలో వికెట్ పడగొట్టారు.

## రాజా రణధీర్ కన్నుమూత


భారత మాజీ షూటర్, ఒలింపియన్ రణధీర్ సింగ్ (79) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రణధీర్ బుధవారం దిల్లీలోని ఆయన నివాసంలో తుదిశ్వాస విడిచారు. రణధీర్ మరణాన్ని నేషనల్ రైఫిల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా కార్యదర్శి రాజీవ్ భాటియా ధ్రువీకరించారు. భారత క్రీడా రంగంలో రాజా రణధీర్ చెరగని ముద్ర వేశారు. ఆయన మరణంతో క్రీడా లోకం దిగ్భ్రాంత్రికి గురైంది. పంజాబ్‌లోని పాటియాలా రాజ కుటుంబంలో రణధీర్ సింగ్ జన్మించారు. ఆయనకు భార్య వినిత, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. అందులో చిన్న కుమార్తె రాజేశ్వరి కూడా ఒక షూటర్ కావడం విశేషం.



అయితే కొంతకాలంగా వృద్ధాప్య సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆరోగ్య సమస్యల కారణంగానే ఇటీవల ఒలింపిక్ కౌన్సిల్ ఆఫ్ ఆసియా (రాజూా) అధ్యక్ష పదవికి ఆయన రాజీనామా చేశారు. ఇక బుధవారం దిల్లీలోని ఆయన నివాసంలోనే కన్నుమూశారు. రణధీర్ తన కెరీర్‌లో అనేక ప్రధాన మైలురాళ్లు సాధించారు. 1978 ఆసియా క్రీడల్లో ట్రాప్ ఈవెంట్‌లో అగ్రస్థానంలో నిలిచారు. దీంతో భారత్ తరఫున స్వర్ణ పతకం గెలిచిన భారత తొలి షూటర్‌గా రణధీర్ సింగ్ చరిత్ర సృష్టించారు. బ్యాంకాక్ వేదికగా జరిగిన ఈ క్రీడల్లో ట్రాప్ ఈవెంట్‌లో చరిత్రాత్మక స్వర్ణ పతకం గెలిచి దేశానికి గర్వకారణంగా నిలిచారు. ఆ తర్వాత క్రమంగా గొప్ప షూటర్లలో ఒకరిగా ఎదిగారు. ఆయన రికార్డు స్థాయిలో ఐదు ఒలింపిక్ క్రీడల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించారు. ఒలింపిక్ కౌన్సిల్ ఆఫ్ ఆసియాకు రణధీర్ 1991 నుంచి 2015 వరకు సెక్రటరీ జనరల్‌గా సేవలందించారు. ఇక 2024 సెప్టెంబర్‌లో దిల్లీలో జరిగిన ఒలింపిక్ కౌన్సిల్ ఆఫ్ ఆసియా 44వ సర్వసభ్య సమావేశంలో రణధీర్ సింగ్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. దీంతో అధ్యక్షుడిగా ఎన్నికైన తొలి భారతీయుడిగానూ నిలిచారు. ఈ పదవిలో రణధీర్ 2028 దాకా ఉండాల్సింది. అయితే, ఈ ఏడాది ప్రారంభంలో ఆరోగ్యం క్షీణించడం వల్ల ఆయన పదవికి రాజీనామా చేశారు. రణధీర్ సింగ్ భారత, ఆసియా క్రీడా సంస్థలలో వివిధ పరిపాలనా పదవులను కూడా నిర్వహించారు. ఆయన 1987 నుంచి 2012 వరకు ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ సెక్రటరీ జనరల్‌గా పనిచేశారు. అదనంగా, రణధీర్ 2001 నుంచి 2014 వరకు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ లో సభ్యుడిగా ఉన్నారు. రణధీర్ సింగ్ షూటింగ్ క్రీడల అభివృద్ధికి, ఒలింపిక్ ఉద్యమానికి అమూల్యమైన కృషి చేశారు. రణధీర్ విశిష్ట క్రీడా జీవితంలో 5 ఒలింపిక్ క్రీడలలో పాల్గొనడం, 1978లో బ్యాంకాక్‌లో జరిగిన ఆసియా క్రీడలలో ట్రాప్ ఈవెంట్‌లో స్వర్ణ పతకం సాధించడం వంటివి ఆయన కెరీర్‌లో అత్యుత్తమ మైలురాళ్లు.

## సీఎస్కే కోచ్‌గా ఎంఎస్ ధోనీ?

సీఎస్కేను 5 సార్లు ఐపీఎల్ ఛాంపియన్‌గా నిలిపిన లెజెండరీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ భవిష్యత్తుపై ఆ జట్టు సీఈవో కాశీ విశ్వనాథన్ సంచలన ప్రకటన చేశారు. మోకాలి గాయం కారణంగా ఎంఎస్ ధోనీ ఐపీఎల్ 2026 సీజన్లో ఒక్క మ్యాచ్‌లో కూడా స్టేడియంలోకి దిగలేకపోయాడు. దీంతో ధోనీ ఐపీఎల్ కెరీర్ ముగిసిపోయిందనే చర్చలు జోరందుకున్న తరుణంలో కాశీ విశ్వనాథన్ స్పందిస్తూ.. ధోనీ జట్టులో ఏ పాత్రలో ఉండాలనుకున్నా తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, అది పూర్తిగా ధోనీ వ్యక్తిగత నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుందని స్పష్టం చేశారు. ఓ ప్రత్యేక ఇంటర్వ్యూలో సీఎస్కే సీఈవో కాశీ విశ్వనాథన్ మాట్లాడుతూ.. ధోనీ సీఎస్కే జట్టులోనే శాశ్వతంగా కొనసాగాలని తాము కోరుకుంటున్నట్లు వెల్లడించారు. "ధోనీ సీఎస్కేలో ఏ పాత్రలో ఉన్నా మేము సంతోషిస్తాం. ధోనీ ఆటగాడిగా ఉంటాడా, కోచ్‌గా మారతాడా లేదా మెంటార్‌గా సేవలందిస్తాడా అనేది పూర్తిగా ఆయన ఇష్టం. సీఎస్కేకు సంబంధించిన ఏ నిర్ణయమైనా ధోనీ అభిప్రాయం పైనే ఆధారపడి ఉంటుంది" అని సీఈఓ పేర్కొన్నారు. ధోనీ అధికారికంగా రిటైర్మెంట్



ప్రకటించనప్పటికీ.. వచ్చే సీజన్ నాటికి ఎంఎస్ ధోనీ సీఎస్కే మేనేజ్‌మెంట్‌లో కీలక బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందనే ఊహాగానాలకు ఈ కామెంట్స్ మరింత బలాన్ని చేకూర్చాయి. ధోనీ తర్వాత సీఎస్కే సారథ్య బాధ్యతలు చేపట్టిన రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్సీపై వస్తున్న విమర్శలకు కాశీ విశ్వనాథన్ అడ్డుకట్ట వేశారు. "రుతురాజ్ దాదాపు మూడు, నాలుగు ఏళ్ల పాటు ధోనీని చాలా దగ్గరగా గమనించిన తర్వాతే కెప్టెన్సీని అందుకున్నాడు. ఎంఎస్ ధోనీ, కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్‌లు రుతురాజ్‌ను ఎంతో ప్రశాంతంగా ఉండే కెప్టెన్‌గా తీర్చిదిద్దారు. రాబోయే రోజుల్లో సీఎస్కేలోకి వచ్చే యువ క్రికెటర్లలో కూడా రుతురాజ్ ఇదే నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాడనే పూర్తి నమ్మకం మాకుంది" అని ఆయన వెల్లడించారు. ఈ ఐపీఎల్ 2026 సీజన్‌లో సీఎస్కే ప్రదర్శన అభిమానులను తీవ్రంగా నిరాశపరిచింది. ధోనీ మైదానంలో లేకపోవడం జట్టుపై స్పష్టమైన ప్రభావాన్ని చూపింది. లీగ్ దశలో ఆడిన 14 మ్యాచ్‌లలో సీఎస్కే కేవలం 6 మ్యాచ్‌లలో మాత్రమే విజయం సాధించి, 12 పాయింట్లతో పట్టికలో 8వ స్థానానికి పరిమితమై ప్లేఆఫ్స్ రేసు నుంచి తప్పుకుంది. సీజన్ మధ్యలో జట్టు పుంజుకోవడానికి ప్రయత్నించినప్పటికీ.. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోవడంతో లీగ్ దశలోనే సీఎస్కే ప్రయాణం ముగిసింది.

# అనవసర నిర్ణయమే గుజరాత్ కొంపముంచింది

### టీమిండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్

గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో పాటు టీమ్ మేనేజ్‌మెంట్‌పై టీమిండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ విమర్శలు



గుప్పించాడు. వారు తీసుకున్న పనికిమాలిన నిర్ణయమే గుజరాత్ టైటాన్స్ విజయవకాశాలను దెబ్బతీసిందన్నాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా మంగళవారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ)తో జరిగిన క్వాలిఫయర్–1లో సమష్టిగా విఫలమైన గుజరాత్ టైటాన్స్ 92 పరుగుల భారీ తేడాతో ఓటమిపాలైంది. ఈ భారీ విజయంతో ఆర్‌సీబీ ఫైనల్‌కు దూసుకెళ్లగా.. గుజరాత్ టైటాన్స్‌కు క్వాలిఫయర్–2 ఆడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ మ్యాచ్ గురించి తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడిన అశ్విన్.. కీలకమైన క్వాలిఫయర్–1లో కుల్వంత్ ఖేజ్రోలియాను ఎందుకు ఆడించారో తనకు అర్థం కావడం లేదన్నాడు. అతను ఒకే ఓవర్‌లో 28 పరుగులు ఇచ్చాడని, అది మ్యాచ్ మూమెంటమ్‌ను మార్చేసిందని అభిప్రాయపడ్డాడు. కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ తీసుకున్న నిర్ణయాలు, బౌలింగ్ మార్పులు కూడా సరిగ్గా లేవని విమర్శించాడు.'రషీద్ ఖాన్‌కు ఈ సీజన్ అంత బాగా సాగలేదు. ఐపీఎల్ 2026 సీజన్ మొత్తం స్పిన్నర్లకు అంత గొప్పగా ఏమీ లేదు. కానీ మిగతా స్పిన్నర్లతో పోలిస్తే రషీద్ ఖాన్‌కు ఇది కాస్త మెరుగైన సీజన్ అని చెప్పవచ్చు. అయితే, ఏడో ఓవర్‌లోనే రషీద్‌ను బౌలింగ్‌కు దించకుండా శుభ్‌మన్ గిల్ ఒక మంచి అవకాశాన్ని చేజార్చుకున్నాడనేది నా వ్యక్తిగత అభిప్రాయం. ఈ ఐపీఎల్‌లో శుభ్‌మన్ గిల్ అత్యుత్తమ కెప్టెన్లలో ఒకడిగా కాకపోయినా.. మెరుగైన కెప్టెన్లలో ఒకడిగా రాణించాడు. ముఖ్యంగా అతను తన బ్యాటింగ్ శైలిని మార్చుకున్న విధానానికి నేను హాట్సాఫ్ చెప్తాను. అయితే వారి జట్టులో కొన్ని బలహీనతలు, లోపాలు ఉన్నాయి. వాటిని వారు హోమ్ అడ్వాంటేజ్‌ను ఉపయోగించుకుని కవర్ చేశారు. తటస్థ వేదికలో ఆర్‌సీబీ.. గుజరాత్ టైటాన్స్ లోపాలను బట్టబయలు చేసింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలవడం చాలా కీలకం. శుభ్‌మన్ టాస్ గెలిచి ముందుగా ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. కానీ ఈరోజు వారు కుల్వంత్ ఖేజ్రోలియాను ఎందుకు ఆడించారో నాకు అస్సలు అర్థం కాలేదు. మీరు ఎవరినైనా ఆడించాలనుకుంటే, వారి బౌలింగ్‌లో ఏదైనా మిస్టరీ ఉండాలి. అతనేమీ మిస్టరీ స్పిన్నర్ లేదా మిస్టరీ బౌలర్ కాదు. ఇప్పటికే కొన్ని మ్యాచ్‌లు ఆడాడు. 15వ ఓవర్‌లో ఏకంగా 28 పరుగులు వచ్చాయి. అది ఆటను పూర్తిగా మార్చేసింది.'అని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఆర్‌సీబీ 255 పరుగుల భారీ లక్ష్యాన్నినిర్దేశించగా.. గుజరాత్ టైటాన్స్ 162 పరుగులకే కుప్పకూలింది. సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ మధ్య జరిగే ఎలిమినేటర్ విజేతతో గుజరాత్ టైటాన్స్ క్వాలిఫయర్–2 ఆడనుంది.

# సాక్ష్యం

CINEMA

హైదరాబాద్
గురువారం 28 మే 2026



## 'సందిగ్ధం' చిత్రం మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను..

### ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో తమ్మారెడ్డి భరద్వాజ్

సంధ్య తిరువీధుల నిర్మాణంలో తీర్థ క్రియేషన్స్ బ్యానర్‌పై పార్థసారధి కొమ్మోజు దర్శకత్వంలో రానున్న చిత్రం 'సందిగ్ధం'. ఈ మూవీలో నిహాల్, ప్రియా దేశ్ పాగ్, అర్జున్ సిహెచ్, కాజల్ తివారి మెయిన్ లీడ్స్‌లో




నటించగా, విలన్ రోల్ లో తెర చేప ఫేమ్ నవీన్ సంకరపు నటించారు. ఈ సినిమాని మే 29న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో ఇప్పటికే రిలీజ్ చేసిన టీజర్, సాంగ్స్, ట్రైలర్ అందరినీ ఆకట్టుకున్నాయి. ఇక ప్రమోషన్స్‌లో భాగంగా మంగళవారం నాడు ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తమ్మారెడ్డి భరద్వాజ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ ఈవెంట్‌లో.. తమ్మారెడ్డి భరద్వాజ్ మాట్లాడుతూ .. ''సందిగ్ధం' అనే టైటిల్ చాలా బాగుంది. ఈ మధ్య అసలు టైటిల్స్ ఎలా ఉంటున్నాయో అందరం చూస్తున్నాం. ఈ సినిమాకి మాత్రం అచ్చమైన తెలుగులో టైటిల్ పెట్టారు. అడవుల్లో ఎంతో కష్టపడి మూవీని చేశారని టీజర్, ట్రైలర్ చూస్తేనే తెలుస్తోంది. ప్రస్తుతం ప్రమోషన్స్ విషయంలో పద్దతి అంతా మారింది. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా నుంచి సోషల్ మీడియా వరకు వచ్చింది. అసలు చేసే ప్రమోషన్ ఎవరి వరకు రీచ్ అవుతోంది.. అనేది కూడా తెలీడం లేదు. నాలాంటి వాడికి ఇన్ స్టాగ్రాం ఉండదు. మరి నాకు ఎలా తెలుస్తుంది.

ఇలాంటి చిన్న సినిమాని అందరూ ముందుండి ప్రమోట్ చేయాలి. సినిమా ఆడుతుందో లేదో తర్వాత విషయం.. అసలు మూవీ ఒకటి వస్తుందనే విషయాన్ని అందరికీ తెలియజేయాలి. అందరూ ఈ సినిమాని వీలైనంతగా ప్రమోట్ చేయాలని, ఈ చిత్రం మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. దర్శకుడు పార్థసారథి మాట్లాడుతూ .. ''సందిగ్ధం' విషయంలో మీడియా మాకు ఎప్పుడూ సపోర్ట్‌గా నిలుస్తూనే ఉంది. మా కోసం ఇక్కడకు వచ్చిన తమ్మారెడ్డి గారికి థాంక్స్. ఈ ప్రయాణంలో నిర్మాత, నా భార్య సంధ్య గారు ఎంతో సహకరించారు. ప్రతీ ఒక్క ఆర్టిస్ట్ ఈ చిత్రంలో అద్భుతంగా నటించారు. సినిమాకు పని చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. ఎడిటర్ విశ్వన్ రాజ్ గారు నాకెంతో సపోర్ట్ చేశారు.

గౌతమ్ గారు మాకు మంచి పాటల్ని ఇచ్చారు. 'సందిగ్ధం'తో మేం ఆశించిన విజయం దక్కుతుందని నమ్ముతున్నాను. చిన్న సినిమాల్ని తీయడం కంటే ప్రమోట్ చేయడం, రిలీజ్ చేయడం చాలా కష్టం. మే 29న మా చిత్రం రాబోతోంది. అందరూ ఎంజాయ్ చేసేలా మా సినిమా ఉంటుంది. మాకు ఆడియెన్స్ నుంచి సపోర్ట్ లభిస్తుందని ఆశిస్తున్నాను' అని అన్నారు. నిహాల్ మాట్లాడుతూ .. ''సందిగ్ధం'లో అవకాశం ఇచ్చిన పార్థు గారికి థాంక్స్. మే 29న మా సినిమా రిలీజ్ అవుతోంది. అందరూ తప్పకుండా చూడండి' అని అన్నారు.



## పవన్ కళ్యాణ్ తో సినీ నిర్మాతలు భేటీ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారితో మంగళవారం రాత్రి రాజమహేంద్రవరంలో పలువురు తెలుగు సినీ నిర్మాతలు భేటీ అయ్యారు. ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో చలన చిత్ర పరిశ్రమ అభివృద్ధి, సంబంధిత విషయాలపై చర్చించారు. ఈ సమావేశంలో నిర్మాతలు శ్రీ వై. రవిశంకర్, శ్రీ సూర్యదేవర నాగవంశీ, శ్రీ సాహు గారపాటి, శ్రీ కిలారు వెంకట సతీష్, శ్రీ చెరుకూరి సుధాకర్ పాల్గొన్నారు.

## సినిమా ఒక అద్భుతమైన మీడియం

### దాన్ని బాధల వేదికగా మార్చొద్దు

### ప్రతి మంచి చిత్రానికి ప్రేక్షకుల మనసుల్లో స్థానం ఉంటుంది

### దర్శక నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి

ఇటీవల సినిమా ఈవెంట్స్, ఇతర వేదికలపై చిత్ర పరిశ్రమలో సమస్యల్లో ఉన్నాం, ఇబ్బందులు పడుతున్నాం అంటూ ఫిలింమేకర్స్ చెప్పడం చూస్తున్నాం. ఇలా టాలీవుడ్ లోని కొందరు ప్రతిసారీ చేస్తున్న వ్యాఖ్యలపై దర్శక నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి స్పందించారు. సినిమా అనేది అద్భుతమైన మీడియం అని, దాన్ని బాధల వేదికగా మార్చొద్దని ఆయన సోషల్ మీడియా పోస్ట్ చేశారు. ఏ రంగంలో అడుగుపెట్టాలన్నా కష్టాలు, ఒత్తిడులు, లాభనష్టాలు ముందే అంచనా వేసుకుని, అర్థం చేసుకుని వస్తారని, సినిమా ఇండస్ట్రీ కూడా



అంతేనని మధుర శ్రీధర్ రెడ్డి తన పోస్ట్ లో పేర్కొన్నారు. మంచి చిత్రానికి ప్రేక్షకుల ఆదరణ తప్పకుండా ఉంటుందని ఆయన అన్నారు. దర్శక నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి స్పందిస్తూ - బిజినెస్‌లోనైనా రిస్కులు, ఒత్తిడులు, నష్టాలు సహజం. వాటిని ముందే అర్థం చేసుకుని రంగంలోకి వస్తారు... సినిమా కూడా అంతే. నిజంగా పరిస్థితులు అనుకూలంగా లేవనిపిస్తే సినిమాలు తీయకండి. ఇండస్ట్రీ నుంచి బయటకు వెళ్లిపోండి. కానీ ప్రతిసారి మైకు ముందు వచ్చి "సమస్యలు... సమస్యలు..." అంటూ ఏడవడం వల్ల ఇండస్ట్రీ పరువు మాత్రమే పోతుంది... ! ఇదేదో ప్రపంచ సమస్య అయినట్టు... భారతదేశం ఎదుర్కొంటున్న అతిపెద్ద సంక్షోభం అయినట్టు. సినిమా ఒక బిజినెస్... ఛారిటీ కాదు! . సిన్సియర్‌గా సినిమాలు తీయండి. వర్కౌట్ అయితే ఉండండి... వర్కౌట్ కాకపోతే బయటికి వెళ్లి వేరే బిజినెస్ చేసుకోండి. ఒక సినిమాలో నష్టం వస్తే... ఆ నష్టాన్ని తట్టుకునే శక్తి ఉంటే ఇంకో సినిమా తీయండి. లేకపోతే ఆగిపోండి. మీ సమస్యలు, మీ కంపెనీ సమస్యలు, మీ వ్యక్తిగత సమస్యలు అన్నీ కూడా సినిమా ప్రాజెక్ట్‌పై రుద్దకండి. నిమా ఒక అద్భుతమైన మీడియం. దాన్ని బాధల వేదికగా మార్చొద్దు. సిన్సియర్‌గా సినిమాలు తీయండి... ప్రతి మంచి సినిమాకి ప్రేక్షకుల్లో ఒక మంచి స్థానం తప్పకుండా ఉంటుంది. అన్నారు.

## చిల్డ్రన్ ఫిలిం "సమ్మర్ హాలిడేస్" అందరినీ ఎంటర్ టైన్ చేయాలి

### టీజర్ లాంఛ్ ఈవెంట్ లో నిర్మాత దిల్ రాజు

### పిల్లలు, ఫ్యామిలీస్ థియేటర్స్ కు వెళ్లి ఎంజాయ్ చేయాలని "సమ్మర్ హాలిడేస్" సినిమా ప్రొడ్యూస్ చేశా: నిర్మాత ధీరజ్ మొగిలినేని

### మంచి కథల్ని నమ్మి ప్యాషనేట్ గా సినిమాలు ప్రొడ్యూస్ చేస్తున్న గట్స్ ఉన్న ప్రొడ్యూసర్ ధీరజ్ కు హ్యాట్సాఫ్ : డైరెక్టర్ సాయి రాజేశ్

కథా బలమున్న చిత్రాలను ప్రేక్షకులకు అందిస్తూ సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ గా, డిస్ట్రిబ్యూటర్ గా పేరు తెచ్చుకున్నారు ధీరజ్ మొగిలినేని. ఆయన తన ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై "సమ్మర్ హాలిడేస్" అనే చిల్డ్రన్ మూవీని త్వరలో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. "సమ్మర్ హాలిడేస్" సినిమాను మన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసే ఒక సందర్భంలో సినిమా ఇండస్ట్రీకి రావాలనే తన ఆలోచన నాతో షేర్ చేసుకున్నాడు. రెస్టారెంట్ బిజినెస్ లో బాగున్నావు కదా సినిమా ఇండస్ట్రీ రిస్క్ అని చెప్పాను. అయినా పట్టుదలగా ఇండస్ట్రీకి వచ్చాడు ధీరజ్..తనదైన దారి వేసుకుంటూ ఈ రోజు హిట్స్ మీద హిట్స్ అందుకున్నాడు. మనకు చిల్డ్రన్ ఫిలిం వచ్చి చాలా కాలమవుతోంది. పిల్లలతో చేసిన ఈ



అందమైన కథతో దర్శకుడు శ్రీకర్ రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో మాస్టర్ రోహన్, మాస్టర్ అరుణ్, బేబి ఖుషి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. త్వరలోనే "సమ్మర్ హాలిడేస్" సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు ఈ చిత్ర టీజర్ లాంఛ్ ఈవెంట్ ను ప్రముఖ నిర్మాత దిల్ రాజు ముఖ్య అతిథిగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ – ఇటీవల కాలంలో ఇంత సందడిగా మరే సినిమా ఈవెంట్ జరగలేదు. ధీరజ్ వంశీ పైడిపల్లి కజిన్. రెస్టారెంట్ బిజినెస్ రన్ చేసేవాడు. ఒక సినిమా ఈ సమ్మర్ లో అందరినీ ఎంటర్ టైన్ చేయాలి, ఫ్యామిలీ ఆడియెన్స్ ఈ సినిమాకు రావాలని కోరుకుంటున్నా. ధీరజ్ తో పాటు ఈ సినిమా చేసిన గిరికి కూడా ఆల్ ది బెస్ట్. ఇవాళ ఇండస్ట్రీ బ్యాడ్ పొజిషన్ లో ఉంది. కొత్త దర్శకులు చాలా మంది ఈ ఈవెంట్ కు వచ్చారు. చిన్న చిత్రాలతో వారు సాధిస్తున్న విజయాలు ఇండస్ట్రీకి బలంగా నిలబడుతున్నాయి. వాళ్లు చిన్న చిత్రాలతో మరిన్ని విజయాలు సాధించాలి, ఇండస్ట్రీ పచ్చగా ఉండేలా చేయాలని కోరుకుంటున్నా. అన్నారు.

### మా ఊరి వాతావరణమే ఎల్లమ్మకు చేరువ చేసింది

బలగం వేణు దర్శకత్వం వహిస్తున్న ఎల్లమ్మలో హీరోగా దేవిశ్రీప్రసాద్ నటిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పార్ట్ మొదలయ్యింది.

తాను కథానాయకుడిగా 'ఎల్లమ్మ' సినిమాని చేయడానికి స్ఫూర్తినిచ్చిన విషయాల్ని ఓ వీడియోతో పంచుకున్నారు దేవిశ్రీప్రసాద్. సంగీత దర్శకుడిగా సుపరిచితమైన ఆయన కథానాయకుడిగా 'ఎల్లమ్మ' సినిమాతో తెరకు పరిచయం అవుతున్న సంగతి తెలిసిందే. వేణు ఎల్దండి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై శిరీష్ నిర్మిస్తున్నారు. తెలుగుతోపాటు, తమిళ, హిందీ, మలయాళ, కన్నడ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవల దేవిశ్రీ ప్రసాద్ తన స్వగ్రామమైన వెదురుపాకని సందర్శించి, ఆ ఊరి జాతర వేడుకల్లో భాగమయ్యారు. అందుకు సంబంధించిన వీడియోను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు.

## కమల్‌హాసన్‌ను కలిసిన భాగ్యశ్రీ భోర్సే

కోలీవుడ్ నటుడు శివ కార్తికేయన్ 'సెయాన్'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. కమల్ హాసన్ సొంత నిర్మాణసంస్థపై ఈ సినిమా రానుంది. ఇందులో హీరోయిన్‌గా నటిస్తోన్న భాగ్యశ్రీ బోర్సే తాజాగా కమల్‌ను కలిశారు. ఆయనతో దిగిన ఫొటోలను పంచుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. డియర్ కమల్ హాసన్ సర్.. చిన్నప్పటినుంచి మిమ్మల్ని చూస్తూ పెరిగాను. ఇప్పుడు ఆ చిన్న అమ్మాయి మీ సినిమాలో నటిస్తోంది. మీరు నా తలపై చేయి వేసి



ఆశీర్వదించిన క్షణాలను వర్ణించడానికి మాటలు సరిపోవు. మీరు గర్వపడేలా చేస్తానని ప్రామిస్ చేస్తున్నా అని భాగ్యశ్రీ పోస్ట్ పెట్టారు. ప్రస్తుతం ఈ ఫొటో, ఆమె పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 'అమరన్' విజయం తర్వాత శివకార్తికేయన్.. కమల్‌హాసన్ సొంత నిర్మాణసంస్థలో చేస్తున్న రెండో చిత్రమిది. శివకుమార్ మురుగేశన్ తెరకెక్కిస్తున్నారు. 'ఇది గ్రామీణ నేపథ్యంలో సాగే సినిమా. కుటుంబ ప్రేక్షకుల్ని అలరించే భావోద్వేగాలు, మాస్ యాక్షన్, వినోదాన్ని మిళితం చేసుకుని ఉంటుందని టీమ్ తెలిపింది. ఈ సినిమా అక్టోబరులో థియేటర్లలోకి రానుంది.

## పెద్ది'లో చేసిన అప్పలసూరి పాత్ర నా కెరీర్ లో నెంబర్ వన్ గా నిలుస్తుంది

### పెద్ది ప్రేక్షకులకు గుర్తుండిపోతుంది

### పెద్దితో పరిశ్రమ గట్టిగా ఊపిరి పీల్చుకుంటుంది

### వెర్సటైల్ స్టార్ జగపతి బాబు

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ రూరల్ యాక్షన్ డ్రామా 'పెద్ది'. బుచ్చి బాబు సానా దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ఇప్పటికే చార్ట్ బస్టర్ పాటలు, అద్భుతమైన ట్రైలర్ తో సినిమాపై అంచనాలు భారీ స్థాయికి చేరుకున్నాయి. ఈ చిత్రం జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించిన వెర్సటైల్ స్టార్ జగపతి బాబు విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**'పెద్ది'లో అప్పలసూరి పాత్ర చాలా కొత్తగా కనిపిస్తోంది.. అది ఎలా సాధ్యమైంది?**

–ఆ క్రెడిట్ మొత్తం డైరెక్టర్ బుచ్చిబాబుకే దక్కుతుంది.



ఆయన ఆ పాత్రను అలా ఉండాలని కోరుకున్నారు. నేషనల్ అవార్డు విన్నింగ్ మేకప్ ఆర్టిస్ట్ రషీద్‌తో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అప్పలసూరి లుక్ ని డిజైన్ చేశారు. మొదటిసారి ఆ గెటప్ వేసుకున్నప్పుడే ఈ పాత్ర అద్భుతంగా ఉంటుందని అర్థమైంది. గెటప్ విషయంలో నేను చాలా పర్టిక్యులర్‌గా ఉంటాను. ఈ సినిమా మొత్తం జగపతి బాబు కాకుండా అప్పలసూరి మాత్రమే కనిపిస్తాడు.

–నాకు ఈ పాత్ర రావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఎమోషనల్‌గా, పెర్ఫార్మెన్స్ పరంగా, గెటప్ పరంగా అన్నింటిలోనూ నాకు చాలా నచ్చిన పాత్ర ఇది. రామ్ చరణ్ సినిమాలో ఈ పాత్ర చేయడం మరింత ఆనందాన్ని ఇచ్చింది. చరణ్ అంటే మా ఇంట్లో అందరికీ ఇష్టం.

**ఇందులో మీది తండ్రి పాత్రనా?**

– తండ్రి పాత్ర కాదు. చాలా ప్రేమతో, అనుబంధంతో కూడిన పాత్ర చేశాను. నాకు, రామ్ చరణ్ పాత్రకు మధ్య బ్యూటీఫుల్ ఎమోషనల్ బాండింగ్ ఉంటుంది.

**అప్పలసూరి పాత్రకు డబ్బింగ్ కూడా చాలా ప్రత్యేకంగా అనిపిస్తోంది కదా?**

–నిజంగా ఈ సినిమాకు డబ్బింగ్ చెప్పడం ఒక ఛాలెంజ్. కానీ ప్రతి క్షణాన్ని ఆస్వాదించాను. ఆ పాత్రలో మ్యాజిక్ ఉంది. ఆ యాసలో కూడా మ్యాజిక్ ఉంది. అలాంటి పాత్ర దొరికినప్పుడు నా బెస్ట్ ఇవ్వడానికి ప్రయత్నించాను.

–ఈ సినిమాకు డబ్బింగ్ చాలా ప్రత్యేకంగా ఉంటుంది. ఒకరోజంతా కూర్చుని రెండు డైలాగులు మాత్రమే చెప్పిన సందర్భాలు ఉన్నాయి. అప్పలసూరి బయటకు రావాలంటే అతని వాయిస్ తోనే రావాలి. ఆ పాత్ర మాట్లాడుతున్నప్పుడు ఇంకెవ్వరూ కనిపించకూడదు అనేది నా ప్రయత్నం. ఇప్పటి వరకు నేను చేసిన సినిమాలన్నీ ఒక ఎత్తు అయితే 'పెద్ది' మరో ఎత్తు.

–నిజంగా ఆయనకు ఎలా తెలిసిందో ఇప్పటికీ అర్థం కాదు. డబ్బింగ్ థియేటర్‌లో నడవడం కుదరదు. కానీ చివరకు ఒక మైక్ తీసుకొచ్చి నేను నడుస్తూ ఉండగా రికార్డ్ చేశారు. అక్కడ ఒక కొత్త విషయం నేర్చుకున్నాను. డబ్బింగ్‌లో కూడా మనం పాత్రలో జీవించాలి. బుచ్చిబాబు, సుకుమార్ ఇద్దరూ పూర్తి క్లారిటీతో ఉంటారు. దర్శకుడికి క్లారిటీ ఉంటే నటుడి పని చాలా సులభమవుతుంది.

**అప్పలసూరి పాత్రలో ప్రత్యేకత ఏమిటి?**

–ఇప్పటివరకు నేను చేసిన పాత్రల్లో 'పెద్ది'లోని అప్పలసూరి లాంటి ఎమోషన్, లుక్, డెప్త్ ఏ పాత్రలోనూ లేదు. నేను ఎందుకు ఇంత బలంగా చెబుతున్నానో మీరు సినిమా చూసినప్పుడు అర్థమవుతుంది. ఈ సినిమా చేస్తూ ప్రతి క్షణాన్ని ఆస్వాదించాను.

–పాత్ర ఎంతసేపు ఉంటుంది అనేది ముఖ్యం కాదు. ఉన్నంతసేపు ఎంత ప్రభావం చూపిస్తుంది అనేదే ముఖ్యం. అప్పలసూరి పాత్ర ప్రేక్షకుల మదిలో నిలిచిపోతుంది.

**'రంగస్థలం' తర్వాత మళ్లీ రామ్ చరణ్‌తో పనిచేశారు. ఆ అనుభవం ఎలా ఉంది?**

–రామ్ చరణ్ అంటే నాకు చాలా ఇష్టం. ఆయన పలకరింపులోనే ఒక ఆప్యాయత ఉంటుంది. వ్యక్తిగా చాలా మంచివాడు. మా కుటుంబం మొత్తం చరణ్ ని ఇష్టపడతారు. ఈ సినిమా కోసం ఆయన ఎంత కష్టపడ్డారో చూసి ఆశ్చర్యపోయాను. దెబ్బలు తిన్నారు, రక్తం కారింది. ఎక్కడా డూప్ ఉపయోగించకుండా స్వయంగా చేశారు. 'రంగస్థలం' నుంచి చరణ్ నటుడిగా నిరంతరం ఎదుగుతూనే ఉన్నారు. ప్రతి సినిమాకు మరింత అందంగా కనిపిస్తున్నారు. ఆయనకు అలాంటి మంచి పాత్రలు వస్తున్నాయి.

**డైరెక్టర్ బుచ్చిబాబు గురించి?**

బుచ్చిబాబు చాలా ప్రేమగా, వినయంగా ఉంటారు. అందరూ ఆయనను ఇష్టపడతారు. ఎప్పుడూ పాజిటివ్‌గా ఆలోచిస్తారు. 'రంగస్థలం' రోజుల నుంచే నాకు ఆయన పరిచయం. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆయనలో కాన్ఫిడెన్స్ చాలా పెరిగింది.

**నిర్మాత సతీష్ కిలారు గురించి?**

నిజంగా సతీష్ గారు అదృష్టవంతుడు. రామ్ చరణ్ ఎప్పుడో ఇచ్చిన మాటను గుర్తుంచుకుని ఈ సినిమా ఆయనకు చేశారు. అక్కడే ఈ సినిమా సక్సెస్ అయ్యింది. సతీష్ గారు ఈ ప్రాజెక్ట్ కోసం ఎంతో ప్రేమతో పనిచేశారు.

**ఏఆర్ రెహమాన్ సంగీతం గురించి?**

రెహమాన్ గారు ఇచ్చిన ప్రతి పాట ఒకదానికంటే మరొకటి పెద్ద హిట్ అయ్యింది. అక్కడే సినిమా సగం సక్సెస్ అయినట్టే..

**ప్రస్తుతం చేస్తున్న ప్రాజెక్టుల గురించి?**

–ప్రస్తుతం సోనీ లివ్ కోసం 'బ్లాక్ అండ్ వైట్' అనే భారీ వెబ్ సిరీస్ చేస్తున్నాను. చాలా పెద్ద బడ్జెట్‌తో రూపొందుతున్న ప్రాజెక్ట్ అది.


Published ,printed and owend by Sudheer Kumar Katepally printed at Sree sesha Sai enterprises , plot no .98/part 1,co-operative industrial estate phase-II, Gandhi nagar Hyderabad,Medchal Malkajgiri , Telangana-500037. Published at 6-3-553,Flat no .G2, CLassic Court Ane A, opp:NKM Grand hotel, Erramanzil Colony, Somajiguda, Hyderabad, Telangana-500082.Editor : Sudheer kumar katepally ph: 9000657700 PRGI NO: TGTEL/26/A2380